అభినవసరస్వతి

సంపుటం 8 } జానపాడు నలనామ సం॥ మార్గశిర మాసము. { సంచిక 12

కృతివిమర్శము.

అహంకారధ్వంసిని ప్రథమాహ్నికము — ఇది శ్రీకల్యాణానందభారతీ స్వాములవారిచే రచింపఁబడిన వేదాంతశాస్త్రవిషయకమగు నొక సంస్కృతవాక్యగ్రంథము. ఇందు భాషామార్దవమును బంక్తిసౌష్ఠవమును శబ్దపటుత్వమును నర్థగౌరవమును దఱచుగా నలరారుచున్నయవి. అద్వైతానందతీర్థ (వేమూరు) స్వాములవారు శాంకరసిద్ధాంతమును నిరాకరించుచుఁ బ్రభానామకంబగు నొక గ్రంథము వ్రాయుటయు దానిని విమర్శించుచు మలాది రామకృష్ణ సోమయాజులుగారు భ్రమభంజనియను మఱియొక గ్రంథము వ్రాయుటయు నీపత్రిక పూర్వపుసంచికలలోఁ దెలిపియుంటిమి. ఈయహంకారధ్వంసిని సోమయాజులుగారు వ్రాసిన యాభ్రమభంజనిమీఁది పూర్వపక్షమైయున్నయది. జీవన్ముక్త ప్రారబ్ధ సద్భావాసద్భావాద్యల్పవిషయములయం దించుకయభిప్రాయభేదమున్నను సోమయాజులవారితోపాటు కల్యాణానందభారతీస్వాములవారును శాంకరసిద్ధాంతమును శిరసావహించుచున్నవారలే కాని యద్వైతానందతీర్థస్వాముల వారివలె నూతనమతాచార్యతాగౌరవసంపాదనాభిలాషులుమాత్రము కారు. కనుకనే సోమయాజులుగా రద్వైతానందతీర్థస్వాములవారి ప్రభపైఁ జేసినపూర్వపక్షములయం దొక్కటేని యీయహంకారధ్వంసినిలో ఖండించియుండలేదు. అట్లు ఖండింపక పరమతముపై స్వప్రమాణముగఁ జూపిన దోష

ములకన్నింటికిఁ నొప్పుకొనుచు ననువాదములోని యొకటిరెండువిషయములు తమకు దుష్టములనితోఁచినంతమాత్రమున వారియందుఁ జిత్తమల చిత్తచాంచల్యముల నారోపించుటయేకాక యబోధత్వముకూడ నారోపించిరి. ప్రస్థానత్రయవేత్తలైన వారికబోధత్వ మెట్లుకలుగునని శంకించుకొని పౌరాణిక లశుననిందోక్తివలెఁ దద్వేత్తృత్వము వాగాడంబరమాత్రమేకాని తత్త్వనిశ్చయమునకుఁగాదనియు నట్టితత్త్వనిశ్చయము రాగమువలన సంప్రాప్తమగు గృహస్థాశ్రమమందున్నవారికిఁ గలుగదనియుఁ దురీయాశ్రమమే తద్ధేతుకమనియు సోమయాజులుగారిని వారవలంబించిన గార్హస్థ్యమును జాలఁ దూలనాడిరి కాని పూర్వమున గృహస్థులైన వసిష్ఠయాజ్ఞవల్క్యాదులకుఁ దత్త్వనిశ్చయముకలిగియుండుటయు వర్తమానమునఁ దురీయాశ్రమస్థితులు కూడ నీరీతి రాగద్వేషభూయిష్ఠులగుచుండుటయుఁ దత్పూర్వపక్షకములైయున్నయవి. జీవన్ముక్తునకు బాధితమైనను ప్రారబ్ధకర్మవశంబున జగంబు కనఁబడుచునేయుండునని యోగవాసిష్ఠప్రమాణప్రదర్శనపురస్సరంబుగ సోమయాజులుగారు భ్రమభంజనిలోననువదించిన విషయము నపరోక్షానుభూతిశ్లోకములఁ గనఁబఱచుచు జీవన్ముక్తునకుఁ బ్రారబ్ధమేయుందని ప్రకృతగ్రంథకర్తలు బహువిధముల నాక్షేపించిరి జీవన్ముక్తునకు జగంబు కనఁబడకయేయున్నఁ దత్త్వజ్ఞానార్థ మజ్జనుల కాచార్యుఁడేలేకపోవలసివచ్చి యందుమూలమున జ్ఞానసంప్రదాయమునకు విచ్ఛిత్తిగలుగును. అప్పుడు,

శ్లో॥ తద్విద్ధిప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ఉపదేక్ష్యంతి తేజ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శిన,, యను గీతావచన మనృతమనవలసివచ్చును. కావున జీవన్ముక్తులలోఁ జివరవాఁడును సప్తమభూమికాస్థితుఁడును నగు బ్రహ్మవిద్వరిష్ఠుని దృష్టిచే జగత్తు తోఁపకున్నను జీవన్ముక్తులలోఁ

ప్రథముఁడును బ్రహ్మవిద్యాసంప్రదాయప్రవర్తకుఁడును నగు బ్రహ్మవి
దునకుమాత్రము ప్రారబ్ధవశమునఁ దోఁచియే తీరవలెను-జనకాదులకుఁ
దత్త్వబోధకులగు యాజ్ఞవల్క్యాదు లిందులకు నిదర్శనము-సూతసం
హితయందును ఛాందోగ్యాద్యుపనిషద్భాష్యములయందును వివరింపఁ
బడియున్న యీయంశములు గ్రంథవిస్తరభీతిచే నిట నుదాహృత
ములు-ఇటులనే యీగ్రంథమందలి యాక్షేపములన్నియు నవిచారిత
రమణీయములును దూషణాభూయిష్ఠములును నై యున్నయవి-ఇట్టియా
క్షేపములఁ జేయుటయే కాక సోమయాజులుగారు భ్రమభంజనీలేఖన
మునం దహంకృతిసూపినట్లును దద్ధ్వంసమునకయియే తా మీగ్రంథ
ము రచించినట్లును శ్రీస్వాములవా రభిప్రాయపడుచున్నవారు-
ఆయభిప్రాయము నహంకారధ్వంసినియను నామమే వ్యక్తీకరించుచు
న్నది-తమగ్రంథమువ్రాయుచోఁ దా మహంకృతివహింపకయుండి
యితరులనాక్షేపించినను గొంతవరకు సమంజసమయ్యెడిగాని యది
యసంభవము-ఈయంశమును శాంకరబ్రహ్మసూత్రభాష్యము తాము
రచించిన పూర్ణమీమాంసాదర్శనముచే ననుగ్రహింపఁబడియెనని
వ్రాసినవ్రాఁత వేనోళ్లఁ జాటుచున్నయది-కావున నీగ్రంథము నహంకా
రధ్వంసినియనుటకంటె నహంకారసూచనియనుట నాత్రింత బాగుగా
నుండునని తోఁచెడిని-వీతరాగద్వేషులగుయతు లిట్టియహంకారసూచ
కములగు నిబంధనముల రచించుటమాని శిష్యజనోత్తారకములగు
నిబంధనముల శబ్దార్థదోషరహితంబులుగ రచించినయెడలఁ బరోపకార
కంబులయ్యెడిని-సంప్రదాయవిరుద్ధములగు నూతనసిద్ధాంతములుగ ప్రబ
లినప్పుడు వేదశాస్త్రప్రమాణములచేఁ దన్నిరాకరణమునకై యత్నిం
చెడి పండితులపై దోషాభాసంబుల నిరూపించుట శ్లాఘనీయమగుపని
కాద. కావేరీతీరస్థులును హరిద్వారాదిక్షేత్రములఁ జిరకాలము వసిం

చినవారును వేదాంతశాస్త్రంబున మహాపండితులును నగు శ్రీ వాసు
దేవతీర్థస్వాములవారిమధ్య బెజవాడకు విజయంచేసి యద్వైతానంద
తీర్థస్వాములవారితో వారిసిద్ధాంతముంగూర్చి చర్చింపఁబడలచి సభగా
వించుటయు నచ్చటికి జంధ్యాలగౌరీనాథశాస్త్రిగారు, రామకృష్ణసోమ
యాజులుగారు మొదలగు పండితులును డిస్ట్రిక్టు మునసిఫ్‌గారు, వ్యా
యవాదులు మొదలగు తగుమనుష్యులును విచ్చేసిరి. అప్పుడు వాసు
దేవానందతీర్థస్వాములవారద్వైతానందతీర్థస్వాములవారితో శాంకరసి
ద్ధాంతముపై మీరుచేసిన పూర్వపక్షము లెయ్యవి, యని ప్రస్తావించి
యంశములకు నుత్తరముగానక దానికిమాఱుగావదియుఁజేసి నమోస్త్వ
నంతాయ సహస్రమూర్తయే యనుశ్లోకార్థము వివరింపఁజేసిన
మీఁద నద్వైతానందతీర్థస్వాములవారు "గ్రంథముల మూలముననే
నెల్లడిపఱుపఁబడిన నాసిద్ధాంతమునభిప్రేతమైనచో దానిపైనివచ్చినఖండ
నముల మరల గ్రంథమూలముననే సమర్థింతునుగాని యిట్లు సభాము
ఖమున ముఖాముఖిగఁజెప్పనని తుదకుఁ గోపగించుకొని సభనుండి
వెడలిపోవుదుఁ దదుపరి” వాసుదేవానందతీర్థస్వాములవారుపై మువ్వు
రిగ్రంథములం బరిశీలించి రామకృష్ణ సోమయాజులుగారిగ్రంథములే
సర్వసమంజసములనియు నద్వైతానందతీర్థులవి శ్రుత్యనభిమతములగు
టయేకాక పరస్పరవిరుద్ధములుకూడనై యున్నవనియు నహంకారధ్వం
సిని యప్రామాణికముగాను నంచిత రాగద్వేషముగాను నున్నదనియు
మూఁడుదినములు మూఁడుమహోపన్యాసము లిచ్చియుండిరి. తత్సభల
కరుదెంచిన గౌరీనాథశాస్త్రిగారుమున్నగు శాస్త్రజ్ఞులును వాసుస్వాము
లవారితో నేకాభిప్రాయులైరి. కావుననీయహంకారధ్వంసినివిషయ
ములో మేమును నా మెల్లరతో నేకీభవించుచున్నవారము.

సూతసంహిత

తృతీయాశ్వాసము.

క॥ శ్రీనాథాజస్తుత! కోలగానిమహావంశజలధికౌస్తుభ కోట
య్యానందదాయి! శంకర! మానితవటమూలవాసి! మారారీ! శివా॥

వ॥ దేవా! యవధరింపుము, ముక్తిఖండమాహాత్మ్యంబెట్టిదనిన,

తే॥ సత్యవిజ్ఞాను నీశ్వరు సర్వదేవ
వందితుని మహాదేవు నవ్యయుని బరము
సౌమ్యు సంసారరోగభేషజుని శివుని
వినుతులొనరించి మ్రొక్కెద విమలభక్తి॥ 3

సీ॥ ఏదేవుదేవి త్రయీమయము లోకైక
జనని యేదేవునితనయు లధిక
బలవంతు లిభవక్త్ర బాహులేయాభిఖ్యు
లేదేవుసత్ప్రసాద లేశ
లేశలేశలవాంశ లేశమాత్రముచేత
జీవుఁడు సన్ముక్తిసిద్ధిగాంచు
ఏదేవులింగార్చనాదరమునఁ బరా
శరసూనుఁ డఖిలవిద్వరుఁడు నయ్యె
గీ॥ ఎవనిమ (హదద్భుతా) కార మీప్రపంచ
మట్టిపరమేశు శివమూర్తి నంబికేశు
పరు దయానిధి నీశాను భవ్యతేజు
శివునిఁగూర్చి నమస్కృతుల్ చేతు నెపుడు॥ 4

పంచచామరము.

చరాచరస్వరూపు విశ్వసాక్షి సాంబు శాశ్వతున్
బరాపరస్వరూపు సర్వవస్తురూపకాంతరున్
సురాసురారిసేవ్యు నిత్యు సూక్ష్ము నీశ్వరున్ హరున్
దురంతమాయ పాయఁగా ఘనుం దలంచి మ్రొక్కెదన్॥ 5

తే॥ శాంతుఁడౌ వసి(ష్ఠాది)సంయమీంద్రు
లెవ్వఁడు వేదాంతములవిన్కి నేమహేశు
నాత్మగాఁజూతు ర[ద్దే]వు నఖిలవంద్యు
సచ్చిదానందమూర్తిని సన్నుతింతు॥ 6

వ॥ మఱియు శివభక్తాగ్రగణ్యులైనట్టువంటి హిరణ్యాక్ష స్థాణు
పూజాపరాయణాంబికాచరణాసక్త మహేశ్వరాంఘ్రిపరాయణోంకార
వల్లభ శుద్ధలోలు పాలోలలోచన మహాప్రాజ్ఞ మహాబుద్ధి మహా
బాహు మహాదేవ శక్తిమచ్ఛక్తిద శంకు శంకుకర్ణ శనైశ్చర భగవ
ద్దగ్ధపాప భవ భవభయాపహ భగదర్ప భగప్రీత భవజ్ఞ భంగురాశ
సాగ్నివర్ణ జపావర్ణ బంధూకకుసుమచ్ఛవి విరక్త విరజ వేదపారాయ
ణరత సమచిత్త సమగ్రీవ సమలోష్టాశ్మకాంచన ఫలమూలాశని
శత్రుమిత్రవర్జిత కామరూప కామమాలి కాలతత్త్వవిశారద ముని
సోమ సోమగాథప్రియ సుధీ వేదవిద్వేదవిన్ముఖ్య విద్వత్పాద
పరాయణ విశాలహృదయ విశ్వ విశ్వాదండభవ పవిత్ర పరమ
పంకజారుణలోచన లంబకర్ణ మహాదేహ
లంబపింగజటాధర గ్రాహ్వాయణసుత గ్రీష్మ గ్రాహభంగపరాయణ
లోకాక్ష దూత లోకయాత్రాపరాయణ ప్రాతస్స్నానజితేంద్రియ వత్స
పుత్ర మునిశ్రేష్ఠ వత్సరాంగ మహాము మూర్ధ్వరేత ఉమాభక్త వల్క
ల్యాశ్వలాయనసూను బ్రహ్మవిద్యారత ముని ముకుంద మోచక
ముఖ్య మూలకారణ సర్వజ్ఞ సర్వవిత్సర్వ సర్వప్రాణహితర తాత్యు
గ్రా తిప్రసన్న ప్రమాణజ్ఞానవిగ్రహ హారతేయమహావీ రారణ్యోపనిషత్ప
రాత్మవిద్యారత శ్రీమచ్ఛ్వేతాశ్వతరపుత్రక శ్వేతాశ్వతరశాఖేయ
శ్రద్ధాప్రవర్తక శతరుద్రసమాఖ్యాక శతరుద్రప్రియ భక్త పంచప్రస్థాన
హేతు శ్రీమత్పంచాక్షరప్రియ శివసంకల్పభక్త శివసూత్రప్రవర్తక
లింగసూక్తప్రియ కైవల్యోపనిషత్పర జాబాల్యధ్యయనధ్వస్తపాపపుం
జ పురాణ పుణ్యకర్మ పురుషార్థప్రవర్తక మైత్రేయ శ్రుతిస్నేహమహా

మైత్రారుణ భస్మోద్ధూళితవిగ్రహ బాష్కలాధ్యయనవ్రత శాకల్యాధ్యయనరత సర్వశాఖారతు లాదిగాఁగల డెబ్బదిరెండువేల పన్నిద్దరుమహామునులు శమాదిసమన్వితులును శివభక్తిపరాయణులును నగ్నిరిత్యాదిమంత్రంబులచేత భస్మోద్ధూళితవిగ్రహులును రుద్రాక్షమాలాభరణులును త్రిపుండ్రాంకితమస్తకులును నమితతేజస్కుఁడగు శివుని లింగంబున నర్చించువారలును విచక్షణులును నై సత్రావసానంబున మేరుపార్శ్వంబున గుమిగూడి ముక్తిని ముక్త్యుపాయంబును మోచక మోచకప్రదుం దెలియుటకై పరస్పరంబు బహుకాలం బాలోచించి యమ్మహాధీగులు సాదరంబుగాఁ బరమేశ్వరునారాధించి రంతయు,

◆ ముక్తిముక్త్యుపాయ మోచక మోచకప్రద చతుర్విధప్రశ్నము. ◆

క౦॥ పరమాత్ముఁడైనశంకరు పరమానంద ప్రసాదపరిపాకమునన్ ।వర
మౌనివ్యాసశిష్యుఁడు। గరిమన్ సూతుండువచ్చెఁ గరుణానిధియై॥ ౮

తే॥ అమ్మహర్షులమధ్యంబునందు నిట్లు
నిలిచివెలుగొందుసూతుని నెమ్మిఁజూచి
భయము భక్తియు సంధిల్లఁ బరఁగ లేచి
చెలఁగి గద్గదకంఠులై చేసనుతులు॥

సీ॥ దండవన్నతులు భూస్థలిఁబడి చేసియుఁ
బాదముల్గడిగి యపారభక్తి
చిరకాలముగఁ బూజచేసి కృపాంబుధి
సర్వవాంఛాదాయి సర్వవేది
నాత్మజ్ఞుఁడౌసూతు నడిగిరిమునులంతఁ
దగుముక్తి ముక్తిసాధనము మోచ
కుని మోచకప్రదు వినఁగలవన్నియు
నది లోకహితమాట యరసిమదిని

గీ॥ ఘనుఁడు పౌరాణికుఁడు సూతుఁ డనఘు సాంబుఁ
ద్ర్యక్షు వేదార్థవిజ్ఞానులైనవారి

కధికుఁడై నట్టివ్యాసుని నాత్మదలచి
దండవన్నతిఁ జేసి భూసురుని భక్తి॥ 10

వ॥ పరవశత్వంబునొందివిభ్రాంతిదక్కి సర్వభూతహితరతుండై
ననూతుండు సర్వంబును జెప్పందొడంగి యమ్మహామునులంజూచి "వే
దవిన్ముఖ్యులైనమీరలు శ్రద్ధాభక్తిసమన్వితులై వినుం"డని యిట్ల
నియె, 11

సీ॥ "కుందేందుసంకాశసుందరదేహుండు
శంఖచక్రగదాసిశార్ఙ్గధరుఁడు
పీతవస్త్రుఁడు రుచిస్ఫీతభూషణశాలి
సర్వభూతహితైకచరితుఁ డమర
దానవగంధర్వమానిరాడ్ధ్యేయుండు
నారాయణుఁడు మున్ను సారభక్తి
స్మరియించువారికి సకలాఘహరణంబు
బహుజన్మసంసిద్ధిపరుల కభవ
గీ॥ భక్తులకుఁ దజ్ఞులకు వేదపరుల కెపుడు
స్మార్తరతులకుఁ జేరంగ శక్యమైన
శ్రీమదుత్తరకైలాసశిఖరివరముఁ
జేరి యత్యంతసద్భక్తిశీలుఁడగుచు॥ 12

వ॥ మఱియు నవైదికులకును బాపిష్ఠులకును నిందాపరులకు
ను దేవతాదూషకులు మొదలైన దురాత్ములకును నప్రాప్యంబును నతి
శోభనంబును ననేకకోటికల్పంబులకైనను నాచేత
నైన మద్గురునిచేతనైన నారాయణుచేనైన వర్ణింపనశక్యం
బైన యమ్మహాస్థలంబున వత్సరత్రయం బతిఘోరంబగు పరమత
పంబు చేసిన భగవంతుండును భక్తహితరతుండును జగత్సృష్టిస్థితిలయ
కారణుండును సర్వజగత్సాక్షియుం బరమార్థుండును బరానందుండును
శివుండును శంభుండును మహాదేవుండును రుద్రుండును బ్రహ్మాయు

మహేశ్వరుండును స్థాణుండును బశుపతియును విష్ణుండును నీశానుం
డును నీశ్వరుండును బరుండును హరుండును బురుషుండును బరమేశ్వ
రుండును బురాణుండును బరమాణుండును బూర్ణుండును బరాకాష్ఠయును
బరాగతియును బతియును దేవుండును హర్తయు భర్తయు స్రష్టయుఁ
బురాతనుండును మహాత్రాసుండును మహాధారుండును నాత్మవిద్యాధి
కుండును బ్రభుండును మహాత్ముండును విభూతియును ఫాలాగ్నియును
నాకాశంబును హరియును నవ్యయుండును బ్రాణజ్యోతియును భీముం
డును నంతర్యామియును సనాతనుండును నక్షరుండును దహరుండును
సాక్షాదపరోక్షుండును స్వయంప్రభుండును నసంగుండును నాత్ముండు
నునిర్ద్వంద్వుండును బ్రత్యగాత్మాదిసంజ్ఞితుండును నుమాసహాయుండును
భగవంతుండును నీలకంఠుండును ద్రిలోచనుండును బ్రహ్మవిష్ణురుద్రుల
చేత హృదయంబున సదోపాస్యమానుండును సర్వాత్ముండును సర్వవ
స్తువివర్జితుండును వృషధ్వజుండును నగు బరమశివుండు కృపాళుండై
కేవలంబుగా విశ్వమూర్తియగు విష్ణుమూర్తి ననుగ్రహించి మధుర
వాక్యంబుల నిట్లనియె, 13

ఉ॥ "ఘోరతపంబు చేసితివి, కోరిక లేమి, ప్రసన్నమూర్తినై
చేరితి నిన్ను, చెప్పు"మన శ్రీహరి భక్తిఁ బ్రదక్షిణత్రయిన్
గూరిమిఁ జేసి దండగతిఁ గుంభిసిపై బహుసన్నుతిక్రియల్
సారమతిన్ రచించి వివశాత్మమనోవిషయప్రవృత్తియై॥ 14

తే॥ సాంబు శంభు మహానందసాగరు శివు
నాగళంబుగఁ గొంతసే పక్షియుగళిఁ
గాంచి యంతఁ బ్రమత్తుఁడై కమలనయనుఁ
డీశుకంటెను నొండేమి యెఱుఁగఁడయ్యె 15

వ॥ అంతఁ బ్రబుద్ధప్రసన్నస్వభావుండై భగవంతుఁడైనవిష్ణుండు 16

ఉ॥ లోచనయుగ్మముం దెఱచి లోకహితుం గరుణాఢ్యు నీశ్వరున్
జూచి "మహేశ! శంకర! విశుద్ధనిజాకృతి భూతభవ్యముల్

గోచరమౌను నీకు నధికోన్నత! ముక్తిని ముక్త్యుపాయమున్
మోచకు మోచకప్రదుని ముక్తిద! నాకెఱుఁగంగఁ జెప్పవే॥ 17
తే॥ ఇంకఁ దెలియంగవలసిన వేమికలవు
యన్నియును జెప్పు నాకు శ్రద్ధానురక్తి
వినఁగఁ గోరితి దేవేశ!" యనిన శంభుఁ
డాదరంబున నమ్మాట లాలకించి 18
మ॥ అఖిలాధీశ్వరిఁ బార్వతీరమణి నాహ్లాదంబుతోఁ జూచి స
న్ముఖపద్మంబున నవ్వు కొంచె మమరం బూర్ణానుకంపాఢ్యుఁడై
నిఖిలాధీశ్వరుఁ డంబికాసహితుఁడై నీరేజపత్రాక్షుతో
సుఖలీలం బలికెన్ "జగద్ధిత మహాహా! సూచించు నీప్రశ్నమున్"॥
తే॥ అనుచు మఱియు నిట్లాడు తా "నంబుజాక్ష!
శ్రద్ధచేతను వినుమిది సంగ్రహముగఁ
దెలియఁ జెప్పెద, శుభమగు దీననీకు
మోక్షమార్గంబులందిది ముఖ్యపథము॥ 20
సీ॥ వేదాంతములయందు వినఁబడు ముక్తిదా
బహువిధంబుల సితపంకజాక్ష!
సాలోక్యసామీప్యసారూప్యనామంబు
లన మూఁడువిధములై యమరు, నవల
షడ్భావసుఖదుఃఖసంగతద్వంద్వశు
భాశుభరహితమై పరఁగ సత్య
విజ్ఞానరూపమై విమలసుఖాఢ్యమై
బ్రహ్మస్వరూపమై పరఁగి సర్వ
గీ॥ జంతువుల కాత్మభూతమై స్వప్రదయయి
మేయగాక యుఁదా నుపాదేయగాక
తలఁపనధ్వస్తయును దర్కితయునుగాక
సర్వసంబంధరహితమై సర్వమగుచు॥

వ॥ మఱియు నెవ్వుడు పరమార్థంబువలనఁ బ్రతిబంధరహితయు నవిచారదశయందు స్వమాయచేతఁ బ్రతిబంధయు నాల్గవదియు నగుసాయుజ్యముక్తియే ముక్తియని వేదార్థవిదుల చేతంబలుకంబడు, నింకఁదారతమ్యంబుచేఁ బ్రవర్తిల్లు, నితరముక్తులు జన్మనాశాభిభూతంబులును స్పర్ధచేతనుపహతంబులును సర్వదాపరతంత్రంబులును సుఖోత్తరంబులును దుఃఖమిశ్రంబులును నయ్యుత్కృష్టంబులై క్రమంబుగామోక్షంబునకు విశ్రాంతిభూములై కొందఱధికారుల కుపయోగింపంబడియుండు, కేవలశుద్ధచిత్తులుగానివారలకు నశ్వరంబులగు నీసాలోక్యసామీప్య సారూప్యంబులు స్వర్గంబునుం బోలెభోగార్థంబులైయుండు నివియు బహువిధంబుల భిన్నంబులైయుండు కొన్నిశంకరసారూప్యంబులును గొన్నివిష్ణుసారూప్యంబులును గొన్నితద్విభూతి సారూప్యసాలోక్యసామీప్య రూపంబులును గొన్నిబ్రహ్మవిష్ణుమహేశ్వరుల యర్వాగ్రూప సమాశ్రయంబులును గొన్నిసదాశివాదుల రూపసదృశంబులును గొన్నియన్యసమానంబులును గొన్నివీరల సామీప్యసాలోక్య రూపంబులన నివ్విధంబున బహువిధంబులై మోక్షంబులు ప్రకాశించు, మఱియును, 22

తే॥ ఇట్టిక్రమముక్తులందున నెవ్వుడునుదిని
వాంఛవొడము నశుద్ధస్వభావులకును
వారలైనను గ్రమముగాఁ జేరఁగలరు
పరమగతియైన సాయుజ్యపదముశౌరి!॥ 23

తే॥ మత్ప్రసాదంబుగలశుద్ధ మానసులకు
నిచ్ఛసాయుజ్యమందెతా నెసఁగునెవ్వుడు
మత్ప్రసాదవిహీనులౌ మానవులకు
నిచ్ఛకేవలముక్తియం దేమిలేదు॥ 24

సీ॥ నిగమార్థనిష్ఠులైనయతి ముఖ్యులై,
యధికులైనట్టి మహాత్ములకును

సతతపరివృత్త్యుపరతియందు సాయుజ్య
మందును శ్రద్ధ దా నతిశయిల్లు
జీ(వాత్మ)పరమాత్మ కేవలతాదాత్మ్య
రూపైక్యతాసిద్ధి రూఢమైన
సాయుజ్యముక్తి నాఁజను, నిదియజ్ఞా(ని)
తాత్రయంబైన ముముక్షువులకుఁ
గీ॥ గలుగునను మాను వేదాంత మెలమిఁదెలుపు
నెవ్వనికిఁదాస్వభావమా నిట్టిముక్తి
యతఁడె నేనాట నిత్యముం డాత్మవిదుఁడు
సంశయము లేదుదీనికి జలజనేత్ర॥

క॥ అరయఁగ స్వరసిద్ధాంత। స్ఫురణంబగుముక్తిపదము పొల్చునవిద్యా
వరణంబువాయుముక్తత। నెరవెప్పగ దగ్ధవస్త్రవిధముగుఁగాదే

వ॥ ఎవ్వని(కి)స్వతస్సిద్ధాంతరూపిణియగుముక్తి యభివ్యక్త యగు నాతనికిఁ బ్రారబ్ధకర్మాంతంబు జీవన్ముక్తియగు, ప్రదీప్తంబగు ప్రపంచంబె జీవనంబగు, ఫలోపభోగంబువలనఁ బ్రారబ్ధకర్మక్షయంబగుడుఁ బ్రపంచప్రతిభాన స్వప్నతుల్యంబుగానివర్తింపఁబడు నతండాకండె ముక్తుండనంబడు, భూతపూర్వానుసంధానంబువలననె ముక్తుండగు నట్టివాఁడు ముక్తుండును బద్ధుండును ముముక్షుండును నన్యుండునుం గాఁడు, నెట్లాత్మయం దాత్మను సుదృఢంబుగా నెవఁడెఱుంగు నతండె పరమజ్ఞానియగు, తదితరుండు మాంసావృతుండగు, నే నెఱుంగుదునని సుదృఢంబుగా నెవ్వఁ డాత్మయందుఁ దలంచు వాఁడెమూఢుండును విజ్ఞానవంచకుండును ననంబడు, సందేహంబు లేదు, ముక్తిస్వభావంబు వేదాంతంబులచేతనైన వర్ణింపశక్యంబుగాదు, స్వానుభవంబుగలవానికి మానంబెసిద్ధించు, ముకుందా! నాచేతసీకు శ్రద్ధచే ముక్తి దెలుపంబడియె, నీవును శ్రద్ధాయుక్తుండవై శ్రేయఃప్రాప్తికై తెలియు,,మని యుమానాథుండు మానాథునకుఁ జెప్పినట్లు సూతుండు శౌనకాదులకుం

చెప్పి మఱియు నిట్లనియె, 27

తే॥ "ఇట్లు వేదార్థమంతయు నిందిరేశుఁ
డభవుచే విని భూతేశు నంబికేశు
నఖిలలోకేశు నంబాసహాయు శివునిఁ
జుట్టి వలగొని ముమ్మాఱు శుద్ధభక్తి. 28

తే॥ దండవన్నతు లొనరించి తగినయట్లు
స్తుతులుగావించి భయభక్తిరతి చెలంగ
దేవదేవు భవానీశు దీనసులభు
పూజచేసె మహానందపూర్ణుఁడగుచు"॥ 29

—♦ముక్తిభేదకథనము♦—

వ॥ అంత నప్పరమేశ్వరుండు రమేశ్వరునకిట్లనియె, 30

క॥ "ఇఁక మీఁద ముక్త్యుపాయము
సకలంబును జెప్పువాఁడ జలజేక్షణ! న
ప్రకటశ్రద్ధాభక్తుల
నకలంకత వినుము నీవు నఖిలముఁ దెలియన్॥ 31

సీ॥ సన్ముక్తి యాత్మకు జ్ఞానంబుచేఁగల్గు
కర్మజాలంబులఁ గలుగ దెందు
జ్ఞానంబు వేదాంతసద్వాక్యముల మహా
తాత్పర్యనిర్ణయత్వంబువలన
వెసజనించిన మనోవృత్తియందునఁ దను
దా నెఱుంగుట యర్థతత్పరత్వ
మున నదె బ్రహ్మమైచను, దీనిచే నాత్మ
కజ్ఞాన మయ్యాత్మయందె యణఁగు
గీ॥ అణఁగునంతట ద్వైతమంచనఁగ లేదు
ద్వైతవస్తువు లేకున్న ధర శుభాశ

భ్రమతియగు, నణఁగిన రాగమును వైర
మును దొలంగును, దొలఁగిన మనుజునకును. 32

క॥ ధర్మాధర్మము లెడలును
నిర్మలగతి నగియుఁ బాయు నేనియుఁ దనువుల్
దుర్మదవిషయేంద్రియ త
త్కర్మంబులు సెడును భవముగలుగదు పిదపన్॥ 33

వ॥ ఇది శ్రుతిసమ్మతంబు 34

మ॥ ఘటవిజ్ఞానము తా ఘటాజ్ఞతఁ దొలంగం జేయున ట్లాత్మవి
స్ఫుటవిజ్ఞానము తాఁ దదజ్ఞత నడంచున్ రజ్జుసర్పాజ్ఞతా
త్పుటనంబైనను సర్పమేగుగతి, సందేహంబులే కాత్మ యు
త్కటవిజ్ఞానముచేతఁ దోఁచినను మీఁదం బాయు సంసారముల్॥ 35

తే॥ అట్టులజ్ఞానమూలమై యలరుచున్న
ఘోరసంసార మణఁగిన సారమైన
యాత్మతత్త్వైకవిజ్ఞానమబ్బ, నంత
తత్త్వమైయున్న బ్రహ్మంబు తానెయగును॥ 36

వ॥ అప్పుడు సంసారియగుజీవునకుఁదోఁచు దృశ్యంబంతయుఁ
దత్త్వంబైన బ్రహ్మంబయ్యెతోఁచు మఱియును 37

తే॥ అవని నజ్ఞానమూలకర్త్రాది సర్వ
కారకగ్రామనిర్మితాకారమైన
కర్మ మజ్ఞానహారమా నె,కర్మమునను
లలితసాయుజ్యముక్తియుఁ గలుగుటెట్లు॥ 38

క॥ కర్మమునఁ గలుగుముక్తియు।నర్మిలిస్వర్గంబువోలె నశ్వరమగుటన్
నిర్మలముక్తిపదస్థితి।కర్మమునన్ లేదు కోటికల్పంబులకున్॥ 39

వ॥ అట్లగుటఁ బరముక్తి కర్మంబునం గలుగదు, కేవల జ్ఞానం
బునసిద్ధించు,॥ 40

తే॥ కర్మ మది రెండువిధములఁ గానఁబడును
బాహ్య మాంతరమన,నందు వాచికంబు

కాయికంబును బాహ్యంబుఁగర్మలయ్యె
ఆంతరంబగు మానసం బరయ నెపుడు॥ 41

క॥ ఈకర్మద్వితయంబులు। బ్రాకటముగ బ్రహ్మయుచు భావింపుమను
శ్లోకత నెపుడు పాసవ। నేకాత్మతఁ జేయు జ్ఞానమంత యుఁగలుగున్॥

సీ॥ ఎవ్వఁడు దేవదేవేశుఁ ద్రిలోచను
శశిమౌళిఁ బాండురచారు దేహు
త్రిగుణాభిమానసందీప్తసర్వరూపాఢ్యు
బ్రహ్మవిష్ణ్వాశ్వగోపాస్యు నభవు
పార్వతీయుతవామభాగు మహేశ్వరు
నీలకంధరు శివు నిగమవేద్యు
హరు నుపాసనసేయు నాతనికుదయించు
శైవవిజ్ఞానంబు జలజనయన!
గీ॥ చిత్తకలుషంబుకలిగినఁ జెందు శివుని
దివ్యసారూప్య, మచ్చట దివ్యభోగ
మనుభవింపుచు విజ్ఞానమంది తుదిని
దాన సాయుజ్యపద మొందు మానివినుత! 43

తే॥ చెలఁగిగుణమూర్తులందున శివుని శ్రద్ధఁ
దగ నుపాసనచేసిన దానివలన
రుద్రసాలోక్య మొంది నిరూఢమహిమ
క్రమముగా జ్ఞానమున ముక్తిగాంచునతఁడు॥ 44

సీ॥ ఎవ్వఁడు శ్రద్ధచే నెంతయు రుద్రుని
పరమయోగామూర్తి నుపాసనంబు
సలుపు నాతఁడు రుద్రసామీప్యమునుబొంది
యతిమనోహరభోగ మనుభవించి
చిత్తపాకముగల్గ శివునిసారూప్యంబుఁ
జెంది శివజ్ఞానసిద్ధివలన

శివునిసాయుజ్యంబుఁ జెందు, నెవ్వఁడు ధాత్రి
నత్యంతపరమమైయలరునీశు
గీ॥ మూర్తిసేవించు నాతఁడు ముఖ్యమైన
రుద్రసాలోక్యమొంది నిరూఢభోగ
మనుభవించి తత్సామీప్య మనుభవించి
యంత నారుద్రసారూప్య మనుభవించి॥ 45
కం॥ జ్ఞానంబుచేతరుద్రుని । మానితసాయుజ్యమొందిమలయుననటు కా
దేనియువిష్ణ్వాదులపద । మానందతఁ జేరిభోగమనుభవముగుదుర్॥
వ॥ అక్కడక్కడ భోగంబు లనుభవించి భూతలంబున విశుద్ధం
బైన బ్రాహ్మణాన్వయంబున జనించు మఱియును,॥ 47
తే॥ ఎవ్వఁడైనను శ్రద్ధచే నిందిరేశ !
నిన్నుపాసించు నాతండు నిన్నుఁ జేరి
కాలమున నన్నుఁ జేరి భోగాళిఁ దేలి
జ్ఞానమున ముక్తిఁ గాంచును మానివినుత! ॥ 48
తే॥ కలుషమునఁ జేసి చిత్తవైకల్యమైన
విష్ణుసామీప్యమొంది యవ్విష్ణుదేవు
విమలసారూప్యమొంది యవ్విష్ణుమూర్తి
యమితసాలోక్యభోగంబు లనుభవించు॥ 49
క॥ నీపరమమూర్తిఁ గొల్చెడి। యాపురుషుండొందు వేడ్కనమితశుభంబౌ
శ్రీపతిసామీప్యపదం। బాపైనతఁడొందుముక్తినటు మోదమునన్ ॥50
సీ॥ అత్యంతపరమమైయలరునీమూర్తి నిం
దెవ్వఁ డుపాసన నెలమిఁ జేయు
అతఁడు నీసాలోక్య మనుభవించియు నీకు
సామీప్యమొందియు శార్ఙ్గి ! నీదు
సారూప్యమొందును సరవి, (నాపై)చిత్త
పరిపాకమెట్లెట్లొ పరఁగ నాదు

విజ్ఞానమేమైన వెసఁగల్గు, మోక్షంబు
గనునంత, చిత్తంబు గలుషమైన
గీ॥ కడఁగి బ్రహ్మాది దివ్యలోకంబులొంది
యందు నతిదివ్యభోగంబు లనుభవించి
పిదప జనియించుఁ గ్రమముగాఁ బృథివియందు
ఇందు కించుకను సందేహ మింత లేదు॥ 51

సీ॥ ఎవ్వండు సతతంబు హృదయంబులోపల
నక్షమాలాధరు నమలమూర్తి
వరదాభయకరాబ్జు వరకమండలుపాణి
శారదాసహితు నీశ్వరుని విధిని
అతిభక్తి సేవించు నాతండు తద్బ్రహ్మ
సారూప్యమొందును శౌరి! శుద్ధ
చిత్తుఁడైనను నిన్నుఁ జేరు, నంతట నన్నుఁ
జేరి యద్వైతవిశిష్టమైన
గీ॥ జ్ఞానమొదఁగల్గి ముక్తుఁడౌ దానివలన
పక్వచిత్తంబు గాకున్న బ్రహ్మలోక
సౌఖ్యములఁ గాంచి యాచారసహితమైన
వంశమునఁ బుట్టి విజ్ఞానవంతుఁడగును॥ 52

తే॥ అటు పరమమూర్తిఁ గొల్చిన యతఁడు బ్రహ్మ
భవ్యసారూప్య మొందును, పక్వచిత్తుఁ
డైనఁ గ్రమమున నను జెందు, నట్లుగాక
యున్నఁ గ్రమముగ జనియించు నుర్వియందు॥ 53

తే॥ బ్రహ్మదేవుని యత్యంతపరమమూర్తి
రూఢిభజియించి బ్రహ్మసాలోక్య మొందు
పక్వచిత్తుండుగాకున్నఁ బరఁగ నచట
భోగములనొంది క్రమముగాఁ బుట్టు భూమి॥ 54

వ॥ మఱియు నెవ్వండు నిత్యంబును శ్రద్ధచేత దేవతాంతరంబుపాసనసేయు నాతండు చిత్తపాకానుగుణంబుగా మూర్త్యుత్కర్షబలంబుచేత సాలోక్యాదిపదంబులొంది బ్రహ్మపదంబును విష్ణుపదంబును మహత్తరంబగు మత్పదంబును గ్రమంబుగా నొంది నావలన విజ్ఞానియై బాధవిముక్తుండగు, నలిచుండ యొక్కనేని యక్కడ ననేకభోగంబులనుభవించి భూమియందు మానవుండై జన్మించు, సంశయంబు లేదు.

క॥ హరి! సర్వమూర్తులందునఁ। బరమాత్మునినన్నుఁ దెలిసిపరమశ్రద్ధా
పరుఁడౌచు శుద్ధమూర్తిని। బరఁగఁ భజియించి చిత్తపాకానుగతిన్ ॥56

క॥ క్రమమొప్ప నాకు పరమా
త్తమమూర్తిన్ భజించి నాకు దయ విజ్ఞాన
క్రమ మొఱఁగి ముక్తిఁ జెందును
విమలంబౌ వేదమార్గవిధ మిది తలఁపన్ ॥ 57

సీ॥ ఈలీలఁ గ్రమముగా నింతయు బాహ్యంపుఁ
గర్మంబుచే నన్నుఁ గాంచి నాదు
వలన శివజ్ఞానకలితుఁడై ముక్తుఁడౌ
నవిశుద్ధుఁడైన బాహ్యంపుఁగర్మ
మున నక్కడక్కడ ఘనత సాలోక్యాది
పదమంది పుణ్యానుభవమువలన
మరల భూమిజనించి మఱి పూర్వవిధమునఁ
జెలఁగి కర్మంబులఁ జేయుచుండి
గీ॥ క్రమముగా ముక్తుఁడగుఁ జిరకాలమునకు
బాహ్యకర్మంబుచేత నో పద్మనయన!
అచిరకాలంబుననె ముక్తుఁడగుఁ దలంప
నాతరంబైనకర్మంబు ననుసరింప॥ 58

క॥ అసమాంతరోపచారత
వసుధాస్థలి సతులు పతికి వల్లభలగున

ల్లసమాంతరోపచారత
పొసఁగన్ జంతువులు వల్లభులు నా కెపుడున్॥ 59

క॥ అరయుఁగ బాహ్యపుఁగర్మము
కర మొప్పఁగ జ్ఞానసూచకంబగు నంత
స్థిరకర్మము శమదమముఖ
వరకృత్యము లవియె జ్ఞానవర్తన మెపుడున్॥ 60

వ॥ ఇది శాశ్వతశ్రుతిమతంబు,

శా॥ కాశీముఖ్యమహాస్థలంబులు శివాగారంబు, లచ్చోటులం
దాశాపాశముఁగోసినిల్చినను దేహాంతంబునన్ జ్ఞాన మ
క్లేశంబై జనియించు మర్త్యునకు, లక్ష్మీనాథ! యెల్లప్పుడున్
బాశధ్వంసకరంబులౌ స్థలములన్ వర్తింప మేలయ్యెడిన్॥ 62

క॥ పదిరెండు వేలప్రణవము
ముదమున నిత్యంబు సేయ మురహర! మరణం
బొదవినపిమ్మటఁగలుగును
మదమితవిజ్ఞానసిద్ధి మదనుగ్రహతన్॥ 63

సీ॥ శ్రీమన్మహానందసిద్ధపంచాక్షరి
ప్రణవంబుతోఁగూడఁ బరఁగునేని
అది షడక్షరియన నలరారు, నది దిన
దినము సహస్రంబుగను జపంబు
శ్రద్ధతోఁ జేసినజనుఁడు దేహత్యాగ
మైనపిమ్మటఁగాంచు నైశ్వరైక్య
విజ్ఞానగరిమంబు వెస, దానిచే ముక్తి
గల్గు వేగంబుగాఁ గమలనయన!

గీ॥ బాహ్యకర్మంబులెన్నైనఁబరఁగ దేహ
మెడలినంతన విజ్ఞాన మెలమిఁ జేయు
అవియు సద్వృత్తులకుఁగాని యన్యులకును
సిద్ధిగా వెందుఁ దలపోయ సిద్ధచరిత॥ 64

తే॥ పాపులకునైన నశ్రద్ధపరులకైన
వసుధలో శివక్షేత్రకీర్తనంబు
మరణమొందినయటుమీఁద మహితముక్తి
నిచ్చు నిస్సంశయంబిది నీరజాక్ష॥ 65

తే॥ మున్ను కోలాహలుండను మూర్ఖనృపులుఁ
డవిధిచోదితవృత్తిఁ గామాంధుఁడగుచుఁ
దండ్రివధియించి తల్లిని దాగ్రహించి
పోయెనంత వేదారణ్యభూమికడకు॥ 66

క॥ అచ్చటనతిమోహంబున
విచ్చలవిడినంచరించి వెసఁజచ్చినఁదా
నచ్చోటిమహిమకతమున
విచ్చిందత్పాపజలదవితతియు వేగఁ ॥ 67

క॥ అంతట మామకకరుణయు
నెంతయుఁబ్రసరింప నతఁడహేతుకమా వే
దాంతజ్ఞానముకలిమిని
చింతాసారమైన మోక్షసిద్ధింగాంచెఁ॥ 68

క॥ అటుగనుక భక్తిచేతను
నిటలాక్షుమహాస్థలముల నిలుచుటవలనఁ
ఘటియించుమోక్షకాముల
కటుల మహాముక్తివిభవ మత్యుత్త(మమై)"॥ 69

శా॥ ఈలీలఁ శివువాక్యముల్విని రమాధీశుండు నప్రమాంగుఁడై
యాలోచించి మహేశునిట్లనియె"వేదారణ్యమాహాత్మ్యమే
చాలంగావిననిచ్ఛపుట్టెను మహేశా! తెల్పవే"యన్న నా
శైలాధీశసుతేశుఁడిట్లనియెఁ దా సమ్యక్కృపాపూర్ణుఁడై॥ 70

ఉ॥ "సారసనేత్ర! తెల్పెదను సర్వజగద్ధితమైన తన్మహా
దారచరిత్ర మద్భుతము,తద్దయు భక్తిరతిఁ వినందగుఁ

ధారుణిఁ బద్మకంబన మదావసథం బలరారు, దానికిన్
జేరువ దక్షిణంబునను సింధుతటిన్ శివభక్తిసేవ్యమై 71

తే॥ కలదు దివ్యమహాస్థలి, కల్పమందు
సర్వమును లయంబైనట్టి సమయమునను
నన్నుఁజేరును నచ్చోట నఖిలవేద
చయము సంస్కారరూపమై జలజనయన! 72

తే॥ అంతఁ గల్పాదియందున నఖిలలోక
పాలనంబున కంగముల్ పరఁగఁదాల్చి
యచటనావల్లవెడలె వేదాళి, యట్టి
ధామమొప్పె వేదారణ్యనామమునను 73

సీ॥ శ్రద్ధచే మును దేవసంఘంబు మునులు వే
దారణ్యమున కేగి యంబురాశి
అర్ధయోజనమాత్రమైన విస్తీర్ణంబు
నటు పాదయోజనాయతముగల్గు
వేదతీర్థంబున వెస నర్కవారంబు
నను బర్వకాలంబునను సుభక్తి
స్నానంబు చేసి వేదారణ్యనాయకు
(నర్చనసేయంగ) నాయుమేశుఁ
డంబికాయుక్తుఁడయి వారలందఱికిని
సత్ప్రసాదంబొసంగె, నాస్కందుఁడచట
స్నాతుఁడగుచు వేదారణ్యనాథునన్నుఁ
గొల్చి మత్ప్రసాదంబున ఘోరతార
కాసురునిజంపి లోకాళి నలరఁజేసె 74

కం॥ మునునారదుఁడచ్చోటను ।
గని వేదారణ్యనాథుఁ గలుషవిరోధుం
(ఘనుఁడగు సనత్కుమారా
ఖ్యునను(గ్రహమున సుజ్ఞాన మొందెను ప్రేమఁ దా!) 75

తే॥ యాజ్ఞవల్క్యుండు నచ్చోట నభవుఁ గొల్చి
స్నాన మొనరించి ప్రొద్దున జలజనాభ!
మత్ప్రసాదంబుకలిమి సేమంబుదొడర
ధరణి యోగీశ్వరుండయ్యెఁ దత్క్షణంబ 76

కం॥ ఆవేదారణ్యంబున । నావేదాభిఖ్యతీర్థమందున స్నానం
బావిధిఁ జేసితదీశ్వరు । సేవించి ప్రదక్షిణంబు సేయుము భక్తిన్ 77

వ॥ బ్రహ్మజ్ఞానంబు నొందిరి మఱియును,

సీ॥ ఇచ్చట భూదాన మిచ్చిన నాతండు
రుద్రలోకావాప్తి రూఢుఁడగును
ధనధాన్యదాయి దా ధనదసమానుఁడౌ
నన్నదాని యరోగియగును, వస్త్ర
దాని యింద్రుఁడు, తిలదాని యపాపుఁడౌ
పార్వతీలోకంబుఁ బడయుఁ గన్య
నొసఁగిన, విషువాయనోష్ణాంశుచంద్రమో
గ్రహణంబులను బర్వకాలములను
భానువారవ్యతీపాత మానితార్ద్రి
లందుఁ దా వేదతీర్థంబునందు స్నాన
మొలమిఁ జేసి వేదారణ్యకేశునకును
తగుప్రదక్షిణములు మూఁడు తనరఁ జేసి 79

వ॥ దండవన్నమస్కారంబులు చేసిన ముక్తుండగు, మఱియు నచ్చట శివయోగికి నిష్కమాత్రధనం బిచ్చి యుపవాసంబు చేసిన ముక్తుండగు, సంశయంబు లేదు, సుముహూర్తంబుల నచ్చట స్నానం బొనర్చి శివుం జూచి శివయోగికరంబునఁ బణమాత్రధనం బొసంగిన ముక్తుండగు, గార్గిమైత్రేయులు పర్వంబున వేదతీర్థంబున స్నానంబు చేసి లింగరూపియగు తదీశ్వరునకుఁ బ్రదక్షిణత్రయం బొనర్చి భూమిఁ బ్రణమిల్లి తత్ప్రసాదంబున యాజ్ఞవల్క్యు చేతం దెలియంబడిన జ్ఞానయోగం

బున నక్కడ ముక్తిగాంచిరి, శ్వేతకేతుం డచ్చట స్నానంబుచేసి యద్దే
వునకుఁ బరమభక్తిచేత భూమి దండవన్నమస్కారంబులుచేసిన సర్వ
సంస్కారకారణాజ్ఞాన నాశనంబయిన యాత్మవిజ్ఞానంబు తండ్రియగు
నుద్దాలకునివలనం గాంచె, వరుణుం డవ్వేదతీర్థంబున శ్రద్ధాసహితుండై
స్నానంబుచేసి వేదారణ్యనాయకు శివు నారాధనచేసి తత్ప్రసాదంబున
నాత్మదర్శనంబుగాంచె, తత్పుత్రుండగుభృగుండును నచ్చోటనమ్మహా
దేవునారాధించి తత్ప్రసాదంబున బ్రహ్మాత్మైక్యప్రకాశంబగు నపరో
క్షజ్ఞానంబు తండ్రియగు నవ్వరుణునివలనం గాంచె, త్రిశంకుండునునవ్వే
దతీర్థంబున శ్రద్ధాసహితంబుగాఁ బర్వంబున స్నానంబుచేసి యమ్మ
హేశు నారాధించి ప్రదక్షిణత్రయంబుచేసి నమస్కరించి బ్రహ్మహ
త్యాదిపాపంబులవలన ముక్తుండయ్యె నంతయు, 80

సీ॥ ఇచ్చోట మృతినొంది చెచ్చెరముక్తుఁడౌ
మహి భక్తులకు మహామయహారంబు
ఇది భుక్తిముక్తులనిచ్చును, నేనును
గిరిజయు మద్భక్తవరులు దీని
పూజింతు మీస్థానము ఘనంబు, నాచేత
సర్వవేదాంతైకసంగ్రహంబు
నగు ముక్త్యుపాయంబు తగఁజెప్పఁగాఁబడె
నిది మహాగోప్యమౌ నిందిరేశ!
శ్రద్ధ లేకున్నఁ జెప్పెడిసరణిగాదు
తెలియు,,మని చక్రికీశుండు దెలుప నమ్ము
రారి విని భక్తి మ్రొక్కి (ధూర్జటికి) నపుడు
దివ్యసంతోషవరసుధాతృప్తుఁడయ్యె 81

మోచకకథనము

వ॥ అంత నయ్యుమాకాంతుండు మాకాంతుంజూచి "యింకనీ
కు శ్రుత్యుక్తరీతిమోచకుం దెలియంజెప్పెద భక్తిశ్రద్ధాగరిష్ఠుండవై
విను" మని యిట్లనియె, 82

సీ॥ "అతినిర్మలాకృతియయి యకారాదిక్ష
కారాంతవర్ణ సంకలన చేత
కల్పితాకృతియు నఖండ గంధర కాంతి
సాంద్రజపారూఢచంద్రఖండ
నీలకంధరయుఁ ద్రినేత్ర కుండలకర్ణ
యక్షమాలావృత దక్షహస్త
వరకమండలుయుక్త వామకరాంబుజ
జ్ఞానముద్రాఢ్య ప్రసన్న హృదయ
గీ॥ సర్వవిజ్ఞానకోశపుస్తకసమేత
సర్వలక్షణసంపన్న సర్వభూష
ణాశ్రితి యఖిలవిద్యామయాంగి పుండ
రీకపీఠస్థ వాణి స్వర్లోకవినుత॥ 83
క॥ మన్నాకనాఁడు(గనుంగొ)ని। సన్నుతిగావించిభువిని జాగిలిపెకొ
(మన్ననలు)చేసియ్యాక్రియ। సన్నడిగెనుభక్తిగొడసళిన దళాక్షా!84
తే॥ ఆసరస్వతికి జగద్ధితార్థముగను
నేను గౌరీసమేతుండనై నయంబు
మీరలు మోచకు దుఃఖవిదూరమైన
పరమవిజ్ఞానమును దెల్పితి రయ(మ యది)॥ 85
తే॥ నీకు జెప్పెదనిప్పుడు నీరజాక్ష!
ధాతమొదలుగ స్థావరాంతంబులైన
జంతువులు పశువులగు, నాజంతుతతికి
అరయఁ బతినేఁటఁ బశుపతియందు(రి) నన్ను 86
క॥ నేనాపశువులనెల్లను బూనికతోఁగట్టివైతు, పాసఁగమాయా
నూనోగ్రపాశపంక్తుల వానిక్ వైకుంఠనాథ! వదలింతుఁగడున్ 87

వ॥ ఇదియు సర్వప్రమాణంబులందున బలీయసియు దోషరహి
తయు సాధ్వియు నగు శ్రుతిపలికె, అక్షజాదులు దోషయుక్తంబులు,

శ్రుత్యనుసరణంబులగు స్మృతిపురాణభారతాదులు ప్రమాణంబులు, వేదమార్గవిహీనులకుఁ బాంచరాత్రాదిమార్గంబులు కాలాంతరోపకారకంబులు, తాంత్రికులకు దేవతాప్రాప్తిమూలంబుగాఁ గాలాంతరంబున లభ్యుండనగుదు, వేదమార్గరతులకవ్యవధానంబుగా లభ్యుండనగుదు, నీశ్వరుండను సాంబుండను నగు నాకు వెలిగా మోచకుం డన్యుండు లేఁడు, స్వభావంబున సర్వజ్ఞుండను విగతమాయుండను నగు నాకంటె నన్యులై యాత్మవిజ్ఞానవిహీనులై మాయావృతులు సదాసంసారులు నగు జీవులందఱు మోచ్యులగుదురు, ప్రకృతి కేవలజడాత్మికయగుఁ గావున సకలపశువులకు సంసారమోచకుండనైన నాకంటె నన్యుండు లేఁడని శాశ్వతయగు శ్రుతి పలుకు" నని శివుండు కేశవునకుం జెప్పి మఱియు నిట్లనియె, 88

సీ॥ "ఈరీతి నామాట లెంతయువిని వేద
మయమూర్తిఁ లోకైకమాత వాణి
పూజించెనద్భక్తిఁ బురుషోత్తమా! నీవు
ననమానుఁడవు లోకయందు నాకు
భక్తవరుండవై ప్రబలితి వట్లాట
చక్రి! చెప్పితిని మోచకుని నీకు
మద్భక్తునకు వేదమార్గైకనిష్ఠున
కనభిమానికి బ్రాహ్మణునకు ధర్మ
మతికి నేఁజెప్పినట్టి సన్మార్గ మెల్ల
తెల్పు మన్యుల కీమాట దెలుపఁగా" ద
టంచుఁ బద్మాక్షు కీశ్వరుండనినయట్లు
చెప్పెసూతుండు నమ్మునిశ్రేష్ఠులకును 89

వ॥ అనిచెప్పి మఱియు సూతుండిట్లనియె 90

శా॥" ఈలీలన్ వినిచక్రి యాత్మమతమున యాఖ్యానము నంబాన్వితున్
బాలేందుస్ఫురితోరుమౌళి భవు గీర్వాణాళిసంసేవ్యునిన్

చాలన్ మోచకుఁగానెఱింగి శివునిన్ సత్యామృతాద్వంద్వు శ
ర్వున్ లోకేశుఁ బరాపరాతిగు మనో గాఢిన్ నుతుల్ సేయుచున్ 91

క॥ ఆనందపరవశస్థితిఁ బూనెన్ మౌనీంద్రులార! ప్రాసంగంగ మీకున్
సేనింక మోచకత్వము మానుగ వచియింతు వినుఁడు మానసములరన్

సీ॥ పూర్వమం దొకవిప్రపుంగవుం డురుభక్తి
వైదికాచారైకవర్తనంబు
సకలంబుగావించి శమితకల్మషబుద్ధి
జన్మనాశభయాతిచలితుఁడగుచు
క్రమముగా దేవతాగణముల సంసార
మోచకులను బుద్ధి మొదలఁగొలిచి
యట విచారముచేత నాదేవతలనెల్ల
జనినాశగతులుగాఁ జాలఁదెలిసి
వారినందఱివిడనాడి బ్రహ్మమయుని
సర్వవిద్యాధినాథు నీశ్వరుని శివుని
స్వాత్మతత్త్వైకసంస్థుఁ బ్రసన్నమూర్తి
సర్వలక్షణసంయుక్తు శాంతు నభవు 93

దండకము॥ శ్రీమచ్ఛరచ్చంద్రగోక్షీరపీనోల్లసత్కుందరాకారు
గంగాశశాంకస్ఫురజ్జూటు జ్యోత్స్నాప్రభావ్యాప్తరాకేందుసంకాశమం
దస్మితాస్యున్ వినీలాబ్జకంఠున్ మణికోటికోటీరకేయూరమంజీరహారాది
నాగేంద్రభూషావిశేషున్ స్ఫురద్వేదయజ్ఞోపవీతున్ లసద్వ్యాఘ్రచర్మాం
బరున్ యోగపట్టాభిరామున్ మహాభూతలిప్తాంగు విజ్ఞానరత్నావళీకోశసం
కాశసత్కౌశతత్త్వాక్షమాలోల్లసత్కుండికామండిత జ్ఞానముద్రాప్రవి
భాతక్షుద్రబాహాచతుష్కున్ సదా స్వాత్మభూతామితానందచిచ్ఛక్తి
రూపార్ధదేహార్ధ్యు మాయావటద్రుస్థలప్రస్థితున్ ధార్మికామ్నాయవి
జ్ఞాననిరాట్సంవృతున్ దివ్యవీరాసనాభ్యాసు నోంకారపద్మాసనాసీను
ధర్మస్వరూపోక్షసంసక్తపార్శ్వున్ మహాజ్ఞానవిభ్రాడపస్మారపృష్ఠస్థితాం

ధ్రీన్ పరబ్రహ్మవిద్యాప్రదానాతిసంరూఢు మాయాతమోమో
చకున్ జన్మనాశాదిదూరున్ గృపాధారు రుద్రున్ మహోపాసకా
నేకవాంఛాప్రదున్ సర్వజంతుప్రజాభీష్టదున్ విశ్వసర్గాదిహేతున్ శివున్
దక్షిణామూర్తిదేవాఖ్యు నీక్షించి భక్తిన్, 94

తే॥ అతఁడు భూస్థలి దండవన్నతులొనర్చి
"రుద్రభగవదీయమైనట్టి రూఢమైన
దక్షిణంబగుముఖముచేఁ దనర మమ్ముఁ
బ్రోవు" మని మ్రొక్కి యానందపూర్ణుఁడగుచు 95

క॥ దేవీసహితమహేశ్వరు
భావించి భజించి మ్రొక్కి బహుతరపూజా
ప్రావీణ్యవిధులఁగొల్చిన
దేవుఁడు కరుణించి యతని దెస గనుఁగొనుచున్ 96

తే॥ ఆత్మవిజ్ఞానమొసఁగి యయ్యవనిసురున
కమితసంసృతివిచ్ఛేదమాచరించె
దక్షిణామూర్తిదేవుండు తత్క్షణంబ
తన్మహత్త్వంబు వర్ణింపఁదరమె జగతి 97

సీ॥ దక్షిణామూర్తియై తనరు నాదేవుని
కరుణచే నాయాసకలన లేక
బహుజనంబులు భవబంధనిర్ముక్తులై
పరఁగిరి మీరలు పరమమునులు!
విభు మహాదేవుని వేదస్వరూపుని
శర్వు సంసారమోచకునిఁగాఁగ
సర్వభావంబున సంశయరహితులై
భజియించినను మీరుఁ బరమముక్తి
గల్గు నీదేవుఁ బూజింపఁ గల్గు సర్వ
సిద్ధు"లని చెప్పసూతుండు చేరిమునుల

శ్రద్ధచేత నమస్కృతుల్ జరిపి భక్తిఁ
బూజగావించి రానందపూర్ణులగుచు 98

శ్రీమోచకప్రదకథనము.

వ॥ అంతసూతుండు మహామునులంజూచి విష్ణునకు శివుండు
చెప్పినప్రకారము మీకుం జెప్పెదవినుండని యిట్లనియె, 99

తే॥ "శ్రీపతికినిట్లు శంభుండు చెప్పఁదొడఁగె
శ్రద్ధచేవినుచక్రి! యాచార్యుఁడొకఁడె
పరఁగుసంసారమోచకప్రదుఁడు జగతి
నతనికంటెను దైవతం బవనిఁగలదె 100

క॥ ఆచార్యుఁడు వేదాంతాలోచనసంప్రాప్తబోధరూఢమనీషుం
డౌచుఁ జెలంగెడునాతఁడు లోఁచును దామూడుగతులఁదోయజనేత్రా!

వ॥ అందు బ్రాహ్మణుం డుత్తముండు, క్షత్రియుండు మధ్యముండు, వైశ్యుం డధముండు, నయ్యధముండు శూద్రవైశ్యులకు గురుండగు, మధ్యముండు రాజులకు వైశ్యులకు శూద్రులకు గురుండగు, ఉత్తముండు బ్రహ్మక్షత్రియవైశ్యులకు శుశ్రూషకుండైనశూద్రునకు గురుండగు, శూద్రులకు స్త్రీలకు గురుత్వం బెన్నటికి లేదు, వైశ్యునకు రాజునకు విద్యోత్కర్షబలంబుచేత నుత్తమునిగూర్చి (గురుత్వంబు) కొంద ఱిచ్ఛయింతురు, నయ్యుత్తమునకును బ్రహ్మచారి గృహస్థు వానప్రస్థుఁడు యతి యతివర్ణాశ్రమి యుననుత్తరోత్తరాధిక్యంబున నైదువిధంబులఁ బ్రకాశించు, శ్రేష్ఠులందఱు నశ్రేష్ఠులకు గురువులగుదురు విద్యోత్కర్షబలంబుకలిమిని బ్రహ్మచారి గృహస్థవానప్రస్థయతులకును గృహి వానప్రస్థయతులకును వానప్రస్థుండు యతులకును గురువులగుదు రతివర్ణాశ్రమి నేనపోతె సర్వాధికారులకును గురువులకును గురుండగుఁగాని శిష్యుం డెవ్వరికిం గాఁడు, వానికి న్యూనాధికులు లేరు, శరీరేంద్రియవిలక్షణుండును బరమార్థైకవిజ్ఞా(నుండును) సుఖాత్ముండును స్వయంప్రభుండును నగు పరాత్పరు నెవ్వఁడెఱుంగు నతం డతివర్ణాశ్ర

మియనంబడు, నవస్థాత్రయముక్తుండును నవస్థాత్రయసాక్షియు నగు మహాదేవు నెవ్వఁడెఱుంగు నతం డతివర్ణాశ్రమి, వేదాంతమహావాక్య శ్రవణంబునఁ దన్ను నీశ్వరుఁగా నెఱింగిన నతివర్ణాశ్రమి, యెవ్వండైన వేదాంతంబులచేత దేహంబున మాయాకల్పితంబైన వర్ణాశ్రమధర్మంబులు బోధస్వరూపినగు నాకు లేవనియును నాదిత్యసన్నిధిలోకంబునంబోలె మత్సన్నిధానంబున దేహేంద్రియాదులు ప్రవర్తించుననియును సువర్ణంబున నగ్నియోగంబునఁ గటకస్వస్తికాదులు గల్గినట్లు మాయాయోగంబున నాయందు జగంబులు దోఁచుననియును శుక్తియందు రజతంబునుంబోలె మాయామయంబైన మహదాదిజగజ్జాలంబు నాయందుఁ గల్పితంబనియును జండాలదేహంబునఁ బశ్వాదిశరీరంబున బ్రహ్మాదివిగ్రహంబున నన్యశరీరంబులఁ దారతమ్యంబుగా నాకాశంబునుంబోలె సర్వసంబంధవర్జితంబై ప్రకాశించుచున్న మహాదేవుండ నేననియును దిగ్భ్రమంబులు వాసిన దిక్కులు యథాపూర్వంబుగాఁ బ్రకాశించునట్లు విద్యాభ్రమంబుఁ బాసిన నేనకాని యన్యంబు లేదనియును స్వప్నప్రపంచంబునుబోలె జాగ్రత్ప్రపంచంబును నాయందు మాయావిజృంభితంబనియును నాత్మస్థితుండై యాత్మ నేనని నిశ్చయించుచు నాత్మదర్శనంబున వర్ణాశ్రమాచారంబులు మిథ్యలనియును దేహేంద్రియప్రాణమనోబుద్ధ్యహంకారచిత్తంబులును వ్యోమాదిప్రపంచంబును గర్తయు భోక్తయు భోజయితయుగాక సచ్చిదానందబ్రహ్మంబే నేననియును స్వానుభూతికలన నెవ్వని కెప్పుడి విశేషంబులు కలిగియుండు నాతం డతివర్ణాశ్రమియనంబడు, జలచలనంబు సూర్యునియం దారోపించిన ట్లహంకారగత సంసారం బారోపితంబయ్యె, నన్యగతంబులైన వర్ణాశ్రమాచారంబు లాత్మయందు భ్రాంతిచే నారోపితంబు, లయ్యాత్మకు విధినిషేధవర్జ్జానర్జ్జంబులు లేవు, నిశ్చయజ్ఞానంబున నీదృశులైన యాత్మవిజ్ఞానుల మాయామోహితు లెఱుంగ లే, రయ్యాత్మవిదులకు స్వాభావికమైన యానిష్ఠను మాంసచక్షువులైన మనుజు లెఱుంగ లేరు, ఆత్మవేది జనులు నిద్రించినచోఁ బ్రబుద్ధుండును వారి ప్రబుద్ధతయందు

నిద్రితుండును నగు, నిర్ద్వంద్వ నిర్వికార నిరంజన నిత్యశుద్ధ నిరాభాస చిన్మాత్ర పరామృతస్వరూపంబైన బ్రహ్మంబును వేదాంతంబులచే నెఱింగి స్వానుభవంబున నిశ్చయించునతం డతివర్ణాశ్రమి, యతండె పరమగురుండును వేదవిత్తముండును మోచకుండును మోచకప్రదుండును సర్వకారణుండును సత్యచిద్ఘనుండును భుక్తిముక్తిదుండును సర్వదుండును నగు, నిది పురుషార్థంబును వేదాంతసిద్ధంబును, నీచేతఁ బ్రార్థితుండనై సకలదేవమునిగణమనుష్యులకు సాక్షాన్మోక్షసిద్ధికై వచించితి" ననిన విని "జగన్మయుండైన విష్ణుండు పరమాత్ముండైన శివుని పాదంబులు శిరంబున నిలిపి భూమియందుఁ బ్రణతుండై వేదార్థంబైన బ్రహ్మవిజ్ఞానం బెఱింగి వివశుండును గద్గదస్వరుండును నానందాశ్రుకలితనేత్రుండును నై శివప్రసాదంబునఁ గృతార్థుండయ్యె, మీరును శ్రద్ధచేత నివ్విధంబున మోచకప్రదు నెఱింగి తదీయసేవ సేయవలయు, నీయర్థంబులు గురునియందును శివునియందును శ్రద్ధాభక్తులుగలవానికిఁ బ్రకాశించు" నని చెప్పె, నట్లు రమేశ్వరున కుమేశ్వరుం డిట్లనియె॥

* జ్ఞానానుత్పత్తికథనము *

తే॥ "ఇంక మీఁదటవచియింతు నిందిరేశ!
జ్ఞాన ముదయింప(నీయ)నికారణంబు
లవియెఱుంగుచు వానిని నరసివిడువ
జ్ఞాన ముదయించుఁగావునఁ బూనివినుము॥ 103

వ॥ శివద్రోహంబును శివభక్తాపకారంబును శివజ్ఞానదూషణంబును త్రిపుండ్రోద్ధూళనద్వేషంబును దదనుష్ఠానవర్జనంబును రుద్రాక్షధారణాభావంబును నీకును బ్రహ్మకును మీభక్తులకును ద్వేషంబు సేయుటయు మీధనంబు లపహరించుటయు నిత్యమాత్మరక్షణాభావంబును దద్ద్రోహంబును దత్సంతాపకారిత్వంబును వేదవేదాంతవిద్వేషంబును దదధ్యయనవర్జనంబును శ్రోత్రియోపరాధంబును వేదాంగస్మృతిపురాణభారతవిద్వేషంబును వీనిపఠించువారలతోడి ద్వేషంబును వీని యర్థహా

రణాపరాధంబును వామపాశుపతాశ్రౌతపాంచరాత్రాశ్రయత్వంబును శిష్టజనంబులతో దురాలాపంబులుపలుకుటయుఁ దత్సంగరాహిత్యంబును మద్యభక్తియుం దనిష్టంబును దుర్వృత్తిజనసంసర్గపోషణదుర్వృత్తిత్వంబులును బ్రాణిసంచారమార్గనిరోధనబంధనకంటకనిక్షేపాదులును గోరక్షణాభావంబును గోహింసయు గోప్రచారభూమిబాధయు వృష్టివాతాతపక్లిన్నజనంబులు గృహాగతులైన వారల రక్షింపక వర్జించుటయు వాపీకూపతటాకాదిబాధయుఁ దజ్జలదూషణంబును వ్యాఘ్రచోరాదిభీతజనంబుల రక్షింపమియు సాధుభయకారిత్వంబును వశ్యాకర్షణవిద్వేషస్తంభోచ్చాటనాభిచారాభిరతియును నక్షద్యూతనృత్యగీతవినోదంబును నపశబ్దప్రయోగాభక్ష్యభక్షణంబులును బరస్త్రీదర్శన పరస్త్రీగమనాభిలాషంబులును బరస్త్రీగమనంబును స్వస్త్రీలయందు దర్శనవర్జనద్వేషబాధాదులొనర్చుటయును గురునకిష్టంబుఁ జేయమియు ననిష్టంబు సేయుటయు సేవసేయమియును నీశ్వరగురుదేవజ్ఞానస్వగురుసంతానంబులయందు భక్తిలేమియు స్వగురుమూర్తికి మహాభక్తిచే దేహంబు నివేదింపమియు నన్యులకు నివేదించుటయు నాచార్యునియందనీశ్వరభావంబును దన్నిందాశ్రవణ తదుపేక్షా తద్వివాద తదుక్తవిస్మృతులును నయ్యాచార్యునియందు బాలబుద్ధియు నరబుద్ధియు నశిష్టబుద్ధియు నివి మొదలైన దుర్గుణంబులు జ్ఞానంబుజనింపనీయ"వని శివుండు విష్ణునకుం జెప్పినట్లు సూతుండు మహర్షులకుం జెప్పి మఱియు నిట్లనియె. 104

కం॥ "హరుఁడిట్లు చెప్పఁ గేశవుఁ। డురుభక్తినమస్కరించె, నొప్పుగ మీరల్
పరులకుఁ దెల్పుచు వీనిని। బరివర్జింపంగవలయుఁ బ్రజ్ఞాస్పదులై॥ 105

* గురూపసదనశుశ్రూషణమహిమ *

తే॥ "ఇంకవివరింతునీకు నే నిందిరేశ!
బ్రహ్మవేత్తలశుశ్రూషఁ బరఁగుఫలము
మున్ను శశివర్ణుఁడను విప్రముఖ్యుఁడొకఁడు
పాకయజ్ఞాఖ్యపుత్రుండు పాపి గలఁడు॥ 106

చం॥ అతఁడు తమోభిభూతకలుషాత్మకుఁ డాగమధర్మదేవతా
హితమతి సర్వభూతతతిహింసకుఁ డల్పుఁడు శంభునిందకుం
డతులవిషాగ్నిదుండు పితృహంతయు గోఘ్నుఁడు మాతృహంతయుఁ
సతతకృతఘ్న నాస్తికవిచారుఁడు జ్ఞానవిదూరుఁ డెంతయుఁ॥ 107

క॥ చండాలకామినీపతి। చండుఁడు క్షేత్రాపహారి సాహసి గర్వో
ద్దండుఁడు మధుమాంసాశియు। ఖండోద్ధతిధరణిఁదిరుగుఁగష్టాత్మకుఁడై

తే॥ అతనిపితరులు బ్రహ్మలోకాధివాసు
లమరలోకస్థులంద ఱయ్యఘముకలన
నిరయమునఁగూలి, రాతంను నిష్ఠురాము
యుగ్రహపిశాచ పీడితుండయ్యె నంత॥ 109

తే॥ అతనిజనకుండు పాకయజ్ఞాఖ్యుఁ డీశ
భక్తుఁ డింతయు విని దుఃఖపరతనొంది
యార్తుఁడై యుండె, దేవభక్తాఖ్యుఁడఖిల
వేది యాతనికిట్లనె నాదరమున॥ 110

సీ॥ " విను పాకయజ్ఞ! నీవును శివప్రియుఁడవు
శ్రేయస్సుహేతువుఁ జెప్పువాఁడ
పదియాఱుక్రోసు లేర్పడ నిడువౌచుఁ దా
నంతె వెడల్పునై యతిశయిల్లు
గోపర్వతంబనా దీపించుస్థల, మందు
శక్తియుమాదేవి చంద్రమకుటు
నారాధనముచేసి యాత్మాఖ్యనద్దేవు
శక్తీశ్వరుండను సంజ్ఞచేసె
అట్టిదేవుని బ్రహ్మ దా నధికభక్తి
సేవగావించి తత్కృపఁ జేసి సృష్టి
శక్తిగాంచె, మహేంద్రుఁ డాశర్వుఁగొల్చి
యఖిలగీర్వాణకోటికి నధిపుఁడయ్యె॥ 111

క॥ సురగురుఁడీశక్తీశ్వరు। వరభక్తిభజించి దేవవర్గంబునకున్
గురుఁడుపురోహితుఁడయ్యెను।సురవైరిగురుఁడునిచటశుక్రుఁడుభక్తిన్

తే॥ ఆర్ద్రి నైర్ఋతితారకయందు నిందు
ధరుని శక్తీశుఁ బూజించి దనుజతతికి
ధరఁ బురోహితుఁడయ్యె, నాస్థలమునందుఁ
జేయుసత్కర్మవితతులు చేర్చు ముక్తి॥ 113

శా॥ అచ్చోఁ బర్వములందుఁ బుణ్యతిథులం దా శక్తినాథాఖ్యుఁ దా
నిచ్ఛంజూచి నమస్కరించి ధన మయ్యాశానభక్తాళికిన్
మెచ్చుల్ పుట్టనొసంగఁ గల్గు సుఖముల్ మేలౌ జయంబబ్బెడిన్
వచ్చున్ మోక్షము శంభుసత్కరుణ సుర్వారప్రభావోన్నతిన్॥ 114

సీ॥ అచ్చటశక్తీశు ననుదినంబునుజూచి
శివయోగివితతికి శిష్టభక్తి
సంకల్పపూర్వకసరణిఁ బ్రస్థంబైన
ముష్టిమాత్రంబైన ముదముగదురఁ
దండులం(బులొసంగు) ధన్యాత్ములకు ముక్తి
గల్గు, నచ్చటను దుష్కర్ములైనఁ
గాయంబువిడనాడి కాంతురుమోక్షంబు
సద్దేవుకరుణచే ననఘచరిత!
అచటఁ గలఁడు మహాయోగి యఖిలవేది
ఘనమహాకారుణికనామకలితుఁ డొక్క
ముని సదానందుఁడచటికిఁజని సుభక్తిఁ
బుత్రుతోఁగూడ శుశ్రూష పూనెనలుపు,,॥

కం॥ అనియిట్లుదేవభక్తుఁడు। వినిపించినరీతిఁ బుత్రు వేకొని భక్తిన్
జని కనుగొని గోపర్వతి।మునశక్తీశ్వరుని శివుని మోచరు నభవున్
కం॥ సేవించి పాకయజ్ఞుఁడు।దేవునకున్ నూటయెనిమిదిప్రదక్షిణముల్
గావించి తత్కృపోన్నతిఁ।గోవిదు సర్వజ్ఞు లోకగురు సన్మూర్తిన్

కం॥ అతివర్ణాశ్రమి ధీరుని సతతమహానందమూర్తి నంయమి నటఁ దా
నతిదూరంబునఁ గని బహు నతులొనరింపుచును భక్తి నమ్రుండగుచున్

వ॥ తన తనయువర్తనం బెఱింగించిన మహాయోగియగు నమ్మహాకారుణికుం డప్పాపాత్ముండగు శశివర్ణుని స్వాత్మానందానుసంధానప్రమోదంబున విలోకించిన బ్రహ్మవిద్యాబలంబున నతని శిష్యుంగాఁ బరిగ్రహించె, తదవలోకనమాత్రంబున నతని పాపంబులుకొన్ని ప్రగళంబులగుటయు విగతరోగుండై దినదినంబును దృణకాష్ఠజలమూలఫలంబులు గురుని కర్పింపుచుఁ దద్ద్వారరక్షణంబునుం జేయుచుండ బహుపాపంబులు నశించిన నంత నమ్మహాత్మునకు గాత్రశుశ్రూష చేయుచుం బాదమర్దన తైలాభ్యంగ వస్త్రశోధనాదికృత్యంబు లొనర్చుట మహాపాపంబులు నశించిన నంత నమ్మహాయోగి ప్రసన్నుండై స్వభుక్తశేషం బొసంగినఁ దద్భుక్తశేషామృతపానశాంతసర్వాఘతాపుండై యత్యాదరంబున శుశ్రూషణంబు సేయుచుం బ్రణష్టపాపుండును బరిశుద్ధచిత్తుం(డును న)గు నా శశివర్ణునియం దత్యంతప్రసన్నుండై యమ్మహాత్ముండు,

సీ॥ శరదిందుచంద్రికాసమపాండురవిభూతి
తనువున నలఁది యత్యంతకరుణ
వేదాంతవిజ్ఞానవేద్యార్థమాతని
కుపదేశమిచ్చె సద్భక్తికలిమి
నిచ్చునంతనతండు నెంతయు మత్కృప
నపరోక్షవిజ్ఞానమంది నన్నుఁ
దన్నుఁగాఁజూచి తద్వైక్యతగాంచెను
దజ్జనకుఁడు తద్గతులవలన
వినియు మత్కృప శివయోగవిదుని సేవఁ
జేసి విద్యనుగని ముక్తిఁజేరె వేగ
వారిపితరులు స్వర్లోకవాసులైరి
పూతమయ్యెఁ గులము, భువి పుణ్యయయ్యె.

తే॥ వానిచేతను భోగింపఁబడినయట్టి
కులట చాండాలి యప్సరోలలనయగును
నతసవిద్యాబలంబుచే నమరలోక
నిలయమైయుండె నానందకలితయగును॥

తే॥ ఇంక నేమని చెప్పుదు నిందిరేశ!
బ్రహ్మవిదుఁడైనగురునకు భక్తియుక్తి
నంగశుశ్రూష చేసినయట్టిమహిమ
యిట్టిదయ్యెను, గురుసేవ యెంతఘనము.

సీ॥ మును సుధగాఖ్యకామిని వేశ్య పాపాత్మ
పతులనుజంపి తద్విత్తధనము
(లెల్లను) గైకొని తల్లిని బుత్రుని
దాసదాసీబంధుతతుల సుఖము
నొందించి తా సుఖమొందియుండఁ బిశాచ
రోగాదిబాధలు భోగమెడలఁ
జేసి బాధింపఁగా దాసవర్గముఁగూడి
బహుకష్టదశనొంది యహము రాత్రి
నిద్ర లేకతపింపఁ దన్నిలయమునకు
నొకఁడు నాఁడొక శివయోగి యుర్విఁదిరుగు
చుండి యాకలిగొనిరాఁగ నువిద గాంచి
పూర్వభవకోటిసంచితపుణ్యగరిమ॥ 123

తే॥ బ్రహ్మవిదుఁడైన యమ్మహాప్రాజ్ఞునకును
గుతుకమొదవంగ దండవన్నతులొనర్చి
యలరఁబూజించి తత్పాదజలముద్రావఁ
బాసె రోగపిశాచాదిబాధయపుడె॥ 124

ఉ॥ అంతట విస్మయంబొదవ నాసతి యాపరమార్థవేదినిన్
శాంతుని భక్ష్యభోజ్యములఁ జందనకుంకుమపుష్పమాలికా

త్యంతమనోజ్ఞవస్త్రములఁ దద్దయుఁ బూజయొనర్చి వేడ్కఁ ద
త్ప్రాంతమునందునిల్చి భయభక్తులతో నుతిసేసి యిట్లనున్॥ 125

ఉ॥ "తావకదర్శనంబునఁ గృతార్థతగంటి సరోగనైతి సౌ
ఖ్యావహమయ్యె మేను మరణావధి నన్ను శమింపుమింక నీ
సేవయొనర్తు నిచ్చట వసింపఁగదే" యని వేఁడ సత్తప
శ్శ్రీవెలయం బురాకృతవిశేషగతిన్ నివసించె నచ్చటన్॥ 125

చ॥ అదియును వత్సరత్రయము నాత్మధనాదులఁ బూజచేసె స
మ్మదమున, నంత నమ్మునిసుబోధితయై పరముక్తిఁ జేరె న
మ్మదవతి, మాతృపుత్రసుతబంధుసమూహము స్వర్గలోకమున్
గదిసె, ననేకులీకరణిఁ గాంచిరి మోక్షము తద్జ్ఞసేవలన్॥ 126

తే॥ ఎచటవిజ్ఞానివసియించు నచట నేను
నిల్తు దూరంబుఁజనినైన, నెమ్మి నమ్మ
హాత్మ మాహేశ్వరుని బూని యధికభక్తి
సేవ సేయంగవలయు విశిష్టమతికి॥ 126

సీ॥ నిమిషమాత్రంబైన నిమిషార్ధమైనను
జ్ఞాని యెచ్చోనుండుఁ బూని యచట
సర్వతీర్థములుండు, సంశయంబులు లేవు
జ్ఞానికప్రియుఁడైన శార్ఙ్గి! నాకు
నప్రియుండగు వాఁడు, నంబికాదేవికిఁ
బ్రియుఁడౌను మద్జ్ఞాని నయవిధిజ్ఞ!
సర్వంబునకు వెలి(సర్వులు, జ్ఞాని మ
దాత్మయ,)యతనికి నాకు భేద
ముగవచించునతం డెపో మూఢుఁ డెందు
గురుముఖంబున శాస్త్రముల్ కోరి చదివి
జ్ఞానమెదనిల్పి జ్ఞాని శాస్త్రాళివిడుచు
పుడమి ధాన్యంబుగొని తుషవిడుచురీతి॥ 128

వ॥ పరిపూర్ణోదకంబైన హ్రదంబునఁ బిపాసా (నివృత్తి)మాత్రంబు జలగ్రహణంబు సేయునట్లనంతంబులగు వేదంబుల బ్రహ్మనిష్ఠుండు స్వాత్మవిజ్ఞానమాత్రం బవలంబించు, దుర్లభంబగుమనుష్యత్వంబుం బ్రాపించి యందు బ్రాహ్మణుండయ్యును బటువిగ్రహుండయి సచ్చిదానందంబును నద్వయంబును నగు నతివర్ణాశ్రమిరూపంబు వేదాంతశ్రవణాదుల నెఱుంగకున్న నింక నెన్నండు ముక్తుండగు, వాకాశంబు చర్మంబునుంబోలెఁ జుట్టివేయ నెప్పుడుసమర్థుండగు నప్పుడు నన్నెఱింగి దుఃఖవిముక్తుండగు, మహాపుణ్యాత్ములకు బహుజన్మాంతంబున మత్ప్రసాదంబువలన మదీయజ్ఞానంబుజనించు, నేదేహంబుననైన నపరోక్షజ్ఞానంబు జనించుఁ దద్దేహనాశపర్యంతంబె సంసారదర్శనంబగుఁగాని తదనంతరంబునం గలుగనేరదు, పరమార్థంబునంజూచినఁ బూర్వంబు(ను సంసారదర్శనము లేదు, దేహవినాశానంతరమునఁ దద్దర్శన మెట్లుసంభవించు) కావున ముక్తిదంబగు బ్రహ్మాత్మవిజ్ఞానంబు మత్ప్రసాదంబునఁ బరమవిగ్రహంబున జనించు,, నని త్రయీమయుండును నభీష్టఫలప్రదుండును త్రిలోచనుండును సంబాసహితుండును కృపాకరుండును నగు మహేశ్వరుండు రమేశ్వరునకుఁ బోధించి మౌనముద్రాధరుండయ్యె నంత॥

సీ॥ అఖిలవేదార్థంబు నబ్జాక్షుఁ డీలీల
విని శంభు శశిమౌళి విశ్వనాథు
వినుతించి మ్రొక్కి యవ్విభుపాదయుగళంబు
నిజమూ(ర్ధమునను)చి నియతిఁ దత్ప్ర
సాదంబునను సర్వసంసారవర్జితుఁ
డయ్యెను, నద్దేవుఁ డబ్జనాభు
సన్నిధి నిగమార్థసరణి యెల్లను దెల్పి
సకలదేవశ్రేష్ఠసహితుఁడగుచుఁ
బుండరీకాఖ్యనగరికిఁ బోయి యచటఁ
బుష్టతతులను గణరాజు పూజసేయుఁ

దా సభాపతియగుచు నృత్యంబుసలిపి
భూరికృపచేత భక్తులం బ్రోచుచుండె॥ 130

౦ వ్యాఘ్రపురంబున శివుండు దేవతల కుపదేశము సేయుట ౦

తే॥ అంత సూతునివీక్షించి యఖిలమునులు
"శివునివల్లను విజ్ఞానసిద్ధిగాంచి
విష్ణుఁ డేలీలవిహరించె విమలచరిత!
చెప్పుమా" యన సూతుండు చెప్పఁదొణఁగె॥ 131

కం॥ హరియుఁ జిదంబరమనఁజను
పురిఁ జేరి మహేశ్వరునకు బ్రొక్కి తదాజ్ఞన్
గరుడారూఢుండయి నిజ
పురమగు వైకుంఠమునకుఁ బోయెను వేడ్కన్॥ 132

ఉ॥ అంత విరించిముఖ్యదివిజాధిపు లాహరి లోకనాయకున్
శాంతు ధరారమాపతిని జక్రిఁ గదాసిమహాబ్జహస్తు న
త్యంతదయాఢ్యు భక్తివినయంబునఁ బ్రొక్కి "మహాత్మ! నీవు న
య్యంతకవైరిచేవినినయర్థము మాకెఱిఁగింపవే" యనన్॥ 133

చ॥ హరి సురకోటికిట్లనియె "నారయ మీరు జగద్ధితైకత
త్పరులయి వేడినప్పటికిఁ దత్త్వరహస్యము నేవచింప, న
గ్గిరిశుఁడెమీకుఁ దెల్పు నికఁ గేవలభక్తిఁ జనందగున్ స్వరా
ట్పురుష హృదబ్జమధ్యగతిఁ బొల్చు చిదంబర దివ్యధామమున్॥ 134

కం॥ ప్రతిదినమును బ్రతిపక్షము
ప్రతిమాసము నాఱునెలలు ప్రతివత్సరమున్
ప్రతనిష్ఠఁ దగిలి చూచిన
యలభక్తున కిచ్చు ముక్తి యాస్థల మెపుడున్॥ 135

సీ॥ శీఘ్రంబుగా గతశేషదోషమణంచు
భోగకాములకును భోగ మొసఁగు
నమ్మహాతీర్థంబు నతిభక్తిమీరలు
సేవించి తపములు చేసి యచట

నతిసిద్ధిదమును రుద్రాధ్యాయమధ్యస్థ
మును సతారము సర్వమనువరంబు
నగునట్టిపంచాక్షరి గురూక్తి లక్షుజ
పము చేసి యభ్రసభాధిపతిని
చూచి కరుణాకటాక్షవిస్ఫురితుఁడైన
యమ్మహాదేవుఁ బంచాక్షరమ్ము చేతఁ
బూజగావింపుఁ డానందపూర్ణుఁడగుచు
మీకువిజ్ఞానమొసఁగు సుశ్లోకులారా! ॥ 136

వ॥ మఱియు నంబికాపతియును నానందమహాతాండవపండితుం డును సార్వకాలంబును వటచ్ఛాయానిషణ్ణుండును భూతిభూషణుండును సోమార్ధశేఖరుండును శుద్ధుండును సోమసూర్యాగ్నిలోచనుండును సోముండునుగపర్దియును నీలకంఠుండును వేదయజ్ఞోపవీతియును గంగాధరుండును సుప్రసన్నుండును సుస్మితుండును సురగభూషణుండును దీర్ఘబాహుండును విశాలాక్షుండును వృషారూఢుండును హారకేయూరకటకనూపురాదివిభూషితుండును భస్మధారాధరుండును శ్రీమంతుండును ఫణికుండలమండితుండును బవిత్రపాణియును బుండరీకత్వగంబరుండును గ్వణత్కింకిణీసంయుక్తకలకాంచీవిరాజితుండును సర్వాభరణసంయుక్తుండును సర్వలక్షణలక్షితుండునుగోక్షీరధవళాకారుండునుగుందేందుసదృశప్రభుండును సంసారభయభ్రాంతులకభయేష్టవరప్రదానహస్తద్వయుండును దదన్యకరద్వయసంధూత డమరుదీప్తహుతాశనుండును గృపాళుండును నాత్మమాయోత్థ ఘోరాపస్మారపృష్ఠస్థిత పాదాంబుజుండును స్వస్వరూపమహానందప్రకాశాప్రచ్యుతుండును నగు శివుండు సర్వవిజ్ఞానంబు మీకుపదేశించు”నని చెప్పి సూతుండు శౌనకాదుల కిట్లనియె॥ 137

తే॥ అఖిలలోకేశ్వరుండైన యంబికేశుఁ
డేచటనానందనృత్యంబు నెసఁగఁజేయు

నమ్మహాస్థలిఁ బుండరీకాఖ్యపురముఁ
జేరి రింద్రాదు లాస్తికస్థితివహించి॥ 138

సీ॥ అంతటదివిజు లత్యంతభక్తివిభూతి
భూషితాకృతులయి భూరినిష్ఠ
వ్రతములు దానంబు లతితపంబులు చేసి
రాదృతి సర్వహితానురక్తి
వేదవేదాంతసంవేద్యపంచాక్షరి
ప్రణవంబుతోడ జపంబు చేసి
భక్తిచే వారు సభాపతిఁ బూజించి
శక్తిసమేతుఁ బ్రసన్నవదను
భుక్తిముక్తిద స్వాత్మానుభూతిగరిమ
లాస్యమొనరించు భక్తైకలభ్యు శివుని
జూచి లౌకిక వైదికస్తోత్రములను
వినుతిగావించి రానంద వివశులగుచు॥ 139

వ॥ అంతనమ్మహాదేవుండు

చ॥ మునుల మహేశ్వరాళి సురముఖ్యుల నిర్జరలోకనాథునిన్
గనుగొని పాపముల్దొలగఁగాఁ గరుణించి సమస్తలోకపా
వనమును వేదసారము భవాపహరంబునునైన నృత్తమున్
ఘనమునిదేవమధ్యమునఁ గన్గొనఁ జేసె మహేశుఁ డున్నతిన్॥ 141

తే॥ హరుసతాండవదర్శనాహ్లాదమునను
విబుధు లంత విచేష్టులై వివశులగుచు
నంబికాపతి సర్వజ్ఞ నఖిలనాథు
నాపగాధరు శశిమౌళి నభవుఁ జూచి॥ 142

కం॥ మ్రొక్కుచు "సంసారాంబుధి। గ్రక్కునఁ దరియించునట్టిఘనవిజ్ఞానం
బక్కజము గ్రశుతహితముగ। మక్కువబోధింపుమీశ! మా" కని వేడన్॥

కం॥ గురువులకు గురువునొక్కఁడు
పరమేశుఁడు సురలఁజూచి పలికెను గరుణన్

"పరమరహస్యజ్ఞానము
పరఁగఁ వినుపింతు శ్రద్ధభాసిల వినుఁడీ"॥ 144

వ॥ అని మహాదేవుండు దేవతలంజూచి స్వయంవేద్యంబును నిరాశ్రయంబును నానందపూర్ణచైతన్యంబును నగు నాత్మతత్త్వం బొక్కటియ వెలుంగు, నదియ నేనగుదు, సందియంబు లే, దయ్యాత్మకు మోహినియును మాయాఖ్యయు నగు నొక్కశక్తికల, దదియు విచారంబున నాత్మయగు, తదభేదంబగు నయ్యాత్మయందుఁ బ్రళయంబునఁ బ్రపంచసంస్కారంబు వసియించియుండు, స్వభావంబుననే కర్మవాసన సంక్షుబ్ధయగు, తత్క్షోభయుక్తుండగు నయ్యాత్మ స్వభావంబున విక్రియుఁడయ్యును క్షోభచేతఁ గాలతత్త్వమై (మరలఁ ద) త్కాలసంయుతుండయి పూర్వంబురీతి నీక్షణంబుచేసి మరల బ్రహ్మాదికంబగుజగంబుసర్జించి తన్మోహంబునఁ దదాసక్తుండయి జ్ఞేయజ్ఞాతాదికంబును నశుద్ధంబును స్వప్నతుల్యంబును మహోత్తరంబును ననాద్యంతంబును నగు సంసారమండలంబునందుఁ గర్మానురూపంబుగా విచిత్రయోనిజనితుండై సుఖదుఃఖంబులననుభవింపుచుఁ బూర్వజన్మార్జితపుణ్యంబున ధరణీతలంబున మనుష్యుండై జన్మించి మత్ప్రసాదంబున వేదోక్తకర్మంబులాచరించి శుద్ధచిత్తుండై సర్వదుఃఖాఢ్యంబును సారవర్జితంబును నగు సంసారం బనిత్యంబనివిచారించి విరక్తుండై మోక్షకాంక్ష మహత్తరంబును వేదదర్శితంబును నగు మోక్షోపాయంబు మత్ప్రసాదంబునం గాంచి యాత్మయగుతా నాత్మమాత్రయగు పరమముక్తిఁ బ్రాపించు, ముక్తి సకలజనంబులకు నాత్మవిజ్ఞానంబుచేఁగాని వేఱొక్కవిధంబున గలుగనేర, దట్టియాత్మవిజ్ఞానంబునకు సాధనంబు జ్ఞానంబు, జ్ఞానంబునకుసాధనంబు శాంత్యాదిగుణవ్రజంబు, మదీయస్థానంబులగు కాశ్యాదివిశుద్ధస్థలంబులం దభిరతి గలిగిన యోగ్యులకు నయోగ్యులకు మరణంబుకంటెఁ బరంబగు కాలంబున విశుద్ధబ్రహ్మవిద్యాసాధనం బగుమంత్రంబులోనఁ బంచాక్షరి యనుమార్గంబులలోన వేదమార్గంబును బ్రాప్యంబులలో మోక్షం

బును దేవతలలోన నేనును ముఖ్యులగురీతి స్థానంబులలోన మదీయస్థానం
బులన్నియు నుత్తమంబు, లందుఁ గాశీ కాళహస్తివృద్ధాచల పుండరీక
పుర వల్మీక వేదారణ్యంబు లత్యుత్తమంబు, లం దతిముఖ్యతమంబు
కాశీపురం, బంతకంటెఁ బుండరీకపురంబు నా కతిప్రియంబు, మఱియు
నమ్మహాస్థలంబు శీఘ్రకాలంబున భుక్తిముక్తిప్రదంబును భక్తిలభ్యం
బును నతిశోభనంబును నై ప్రకాశించు, మఱియును. 145

సీ॥ సర్వార్థవిదులైన సంయమీంద్రులచేతఁ
గనఁదగి యాశ్చర్యకలితమైన
విజ్ఞానమిదిమీకు వెసఁజెప్పితిని నేను
సురలార! నమ్మఁడీ శ్రుతిపదంబు
నరులచే మునిదేవవరులచే ముక్తికై
సంసేవ్య మిమ్మహాస్థలము భక్తి”
నని దేవదేవుఁ డయ్యభ్రసభాపతి
వేదాంతవేద్యుండు విశ్వసాక్షి
పాశమోచకుఁ డంబికాపతి శివుండు
దెలిపెనీలీల విజ్ఞానదివ్యపదము
నంత దివిజులు బ్రహ్మవిద్యానుభూతి
నభవు వే కాంచి సానందు లగుచు భక్తి॥ 146

తే॥ వేదలౌకికనుతులను వేదమయుని
శివు సభాపతి వినుతించి సిద్ధపంచ
వర్ణమంత్రంబుచేత నపార్యనిష్ఠఁ
బూజగావించి రద్భుతస్ఫురణ దనర,,॥ 147

• ఈశ్వరనృత్తదర్శనము •

వ॥ అని సూతుండు చెప్పిన శౌనకాదిమును లిట్లనిరి 148

తే॥ “ సూత! నీచేతవిజ్ఞాన మాతతముగ
నాత్మముగవింటి, మిటమీఁద శూలపాణి

యుంబికాపతి బ్రహ్మమైనట్టి శివుని
భూరినర్తనవీక్షించు బుద్ధివొడమె॥ 149

క॥ అటుగనుక కరుణాంభోడను
పటుగతి నగుపాయమిపుడు భాషింపు" మనన్
"స్ఫుటభక్తి వినుఁడు తెల్పెద
నిటుసర్వ" మటంచునూతుఁ డిట్లనిపలికెన్॥ 150

ఉ॥ "మున్ను వృషాధినాథు మునిముఖ్యుఁడు శౌనకుఁ డిట్లువేడఁగా
సన్నుతకీర్తి నంది శివు సన్నతి మొక్కి వచించెనిట్టుల" ల
భ్యున్నతిఁ ద్వారకాద్రిపయి నొప్పఁగ నాట్యము సేయు సంధ్యలన్
బన్నగ రాజభూషణుఁడు, పార్వతిదక్క నెఱుంగరెవ్వరున్॥ 151

తే॥ శ్రీమదభ్రసభామధ్యసీమయందు
సలలితానందనృత్తంబు సలుపుశివుని
శౌనకా! నేను గౌరియు షణ్ముఖుండు
గణపతియుఁ దక్క నన్యులు గాంచరెవరు॥ 153

సీ॥ శంభుప్రసాదైకసంసిద్ధిగలవారు
గనుగొంద్రు తన్నాట్యకౌశలంబు
అట్లాటఁ దత్ప్రసాదార్థమై శౌనక!
పుండరీకాభిఖ్యపురముఁ జేరి
(గ్రహాంకతి)చాపసంగతినుండ నార్ద్రను
గను శుచియై యుషఃకాలమునను
ఘనమైన శివగంగయనుతీర్థమునఁ గ్రుంకి,
ధనధాన్యవస్తువు లత్త్వవేది
కిడ యథాశక్తినొసఁగి భక్తిని మహేశు
నగసుతేశు మూలస్థాననాథు దండ
వన్నతిప్రదక్షిణములఁ బరఁగఁగొల్చి
యుపవసించి పంచాక్షరాయుతజపంబు॥ 154

వ॥ చేసి యిట్లుదినదినంబును వత్సరాంతంబు సపూర్వవిధానంబుగా స్నానంబుచేసి శ్రీమూలస్థాననాయకునికి నమస్కరించి మహాభక్తి శ్రీమదభ్రసభాపతికిఁ బ్రదక్షిణత్రయంబుచేసి దండవన్నతులొనర్చి పూర్వక్రమంబున శ్రీమత్పంచాక్షరీమంత్ర మయుతంబు జపించి వత్సరాంతంబున యథాశక్తి ధనంబొసంగి శ్రద్ధాపూరంబుగాఁ బంచాక్షరంబున సభాపతిం బూజించినఁ దత్ప్రసాదంబునఁ దదీయతాండవావలోకనంబగు, నిచ్చట ననేకులు తత్ప్రసాదంబునఁ దన్నృత్తావలోకనంబుచేసి సకలవాంఛితార్థంబులం బడసి"రని చెప్పిన నందీశువాక్యంబులువిని శౌనకుండు శ్రద్ధచేతఁ దత్క్రమంబుగాఁ బూజించి మహేశప్రసాదంబున నభ్రసభామధ్యంబున భవానీసహితుండగు మహేశ్వరునాట్యం బాలోకించి యతిప్రీతి యథాశక్తిస్తోత్రంబుల స్తుతిసేసి కొంతకాలంబు భక్తిచేతఁ బరవశుండై నాట్యంబుసేయు దేవనాయకుమరల నీక్షించి ప్రమోదంబునఁ దానును మహోద్దండనర్తనంబుచేసిన దేవదేవుండును శౌనకునకు సంతుష్టుండై గంభీరవాక్యంబులనిట్లనియె, "శౌనకా! మదాజ్ఞ మొదలివేదంబగు ఋగ్వేదంబునకు నిర్వాహకుండవుగమ్ము, విశేషించి శౌనకుండును శాకల్యాధ్యయనుండవుగ" మ్మనియానతిచ్చిన శివాజ్ఞావశంబున శౌనకుండును శాకల్యుండనం బ్రసిద్ధుండయ్యె,నిట్లనేకులు పూర్వోక్తమార్గంబున శ్రద్ధాభక్తి నభ్రసభామధ్యంబున మహేశ్వరునాట్యంబు విలోకించి యచిరకాలంబునఁ గృతార్థులైరి, కావున మీరును బూర్వోక్తమార్గంబున దేవిచేతఁ జూడంబడు పరుండగు నమ్మహేశ్వరునృత్తంబు తత్ప్రసాదమార్గంబున నీక్షించి పరమముక్తిం జెందుఁ"డని సూతుండు మహర్షివ్రాతంబున కుపదేశించి మఱియు నిట్లనియె. 155

సీ॥ "విష్ణ్వంశజనితుఁడై వివిధగుణాఢ్యుఁడై
గురువరోత్తముఁడౌచుఁ గొమరుమిగులు
వ్యాసుండు మును నాకు నాసక్తిఁ జెప్పిన
పరమరహస్య మేర్పడఁగ మీకుఁ

దెల్పితినని చెప్పి దివ్యమునీంద్రుని
వ్యాసునిఁదలఁప నవ్యాసహాని
కృష్ణాజినాంబరకృత్యుఁడై రుద్రాక్ష
వలయుఁడై యాషాఢకలితుఁడగుచు
లలితభస్మత్రిపుండ్రంబు వెలయ భూతి
భాసురోద్ధూళనముఁగల్గి పంచవర్ణ
మంత్రజపమొప్ప నరుదెంచె మహిమమీఱ
పరశివధ్యానసంరూఢ భావుఁడగుచు॥ 156

కం॥ తనవంటిశిష్యసంఘము। తనుగొల్వఁగ వచ్చినట్టితత్త్వజ్ఞమహా
మునిఁగనుఁగొని మానసాతుఁడు। తనశిష్యులు తానుమ్రొక్కి తత్పాదములన్
ం॥ శిరమునఁనిడుకొని భక్తిని। గరమానందంబునొంది గద్గదగళుఁడై
గురుపాదప్రక్షాళన। పగమోదకపానతృప్త భావుండగుచున్ 158

వ॥ శిష్యసంఘసంవృతుండగు నమ్మహాత్ముఁ బూజించి వేదవత్ప్రత్యక్షంబుగు తద్వాక్యంబులు తనశిష్యసమూహంబునకు వినుపించి వారలందఱుంగూడి వ్యాససమేతంబుగా వ్యాఘ్రపురంబు ప్రవేశించె, నంత వేదవ్యాసపురోగములైన మునులు సూర్యుండు చాపగతుండైయుండ నార్ద్రర్క్షంబున శ్రద్ధచేత శివగంగాతీర్థంబున స్నానంబుచేసి యథాశక్తి ధనంబు బ్రాహ్మణులకిచ్చి యొక్కదినం బుపవసించి శ్రీమూలస్థాననాయకు దర్శించి ప్రదక్షిణత్రయంబుగావించి సాష్టాంగవినతులొనర్చి షడక్షరమంత్రంబున శ్రీమూలస్థాననాయకుఁ బూజించి తన్మంత్రంబయుతంబు జపంబుచేసి వత్సరాంతంబున నమ్మహాతీర్థంబున స్నానంబుచేసి దానంబొసంగి శ్రీమూలస్థాననాయకుఁబూజించి సభాపతికినిత్యంబు దండవన్నమస్కారంబులొనర్చి షడక్షరి నిత్యంబు జపంబుచేసి వత్సరాంతంబున బ్రాహ్మణులకు యథాశక్తి దానంబొసంగి సతారంబగు పంచాక్షరిచేత సభాపతియగు మహేశ్వరుఁబూజించి,రంతటభగవంతుఁడైన మహేశ్వరుండు ప్రసన్నుండై దృష్టిగోచరుండై నాట్యంబుచేసె, నంత వ్యాసాది మునులు సమస్తవేదాంత సభాపతియును గోటిసూర్యప్రకాశుండును నతినిర్మలుండును విశాలవక్షస్థలుండును నాగహారుండును నగు శివునిజూచి ప్రమోదంబున భూమియందు దండవన్నమస్కా-

గంబులుచేసి తత్ప్రసాదంబున వివశులై విశేష్టితులై నివృత్త బంధను
లైరి. అంతఁ బుష్పవర్షంబు గురిసె, సురాసురాది జనంబులు స్వస్తి
మంగళపురస్సరులై తోషితులై యప్సరసలంగూడి జగంబు కాహళ
రవపూరితంబులు చేసిరి, శంకరుండును భగవంతుండును నగు సభాప
తి సత్యలోకహితమైన యంబికంగూడి వేదసూత్రంబునఁ బరిసరబంధం
బు గలవాఁడై విలసిల్లె, నిఖిల భువననాథుండును నీలకంఠుండును త్రినే
త్రుండును భగవంతుండును బరమేశ్వరుండును నైన శివుండు భక్తులగు
సకల జనులచేతను సేవ్యమానుండై గణేశకుమారనందిసహితుండై పు
ణ్యంబగు పుండరీక పురంబునకుఁ బ్రదక్షిణంబుచేసి శివగంగయందు
స్నానంబుచేసి తాండవపండితుండై సకలప్రాణులకుఁ దీర్ఘంబొసంగ,
సురాసురాదులును శ్రద్ధచేత నద్దేవుసన్నిధిని శివగంగయందు స్నానం
బుచేసి యథాశక్తి ధన ధాన్య వస్త్ర గో భూమి దానంబులు శివ భ
క్తులకునిచ్చి శంకరుండును శశిభూషణుండును నీలకంఠుండును విరూపా
క్షుండును నగు శివుని రుద్రాధ్యాయ జపంబున స్తోత్రంబులు చేసిన
వారల ననుగ్రహించి యంతర్హితుండయ్యె, శేత తీర్థ స్నాన సభాపతుల
మాహాత్మ్యంబెవ్వండెఱుంగు వానికి ముక్తి స్వతస్సిద్ధయగు, నెవ్వం
డైన యీముక్తిఖండంబుఁ జదివిన వినిన వినుపించిన ముక్తిం బ్రాపిం
చు, నని సూతుండాత్మవిజ్ఞానదాయియగు వ్యాసునకు నమస్కరించి
సోముండును సాక్షియుఁ బ్రత్యగాత్ముండును నగు శివునకు నమస్కారంబు
లుచేసి స్వానుభవానంద పరవశుండయ్యె నంత 159

మాలిని॥ నిగమనిచయవాహా! నిత్యకల్యాణదేహా!
అగణితగుణశాలీ! యామినీనాథమౌళీ!
ఖగగమననిషేవ్యా! గాఢవిజ్ఞానిభావ్యా!
స్థగితసుఖితభావా! దక్షిణామూర్తిదేవా!॥ 160

గద్య॥ ఇది.....కొప్పరాజనంతామాత్యపౌత్ర లింగనామాత్య
పుత్ర సుజనవిధేయ నరసింహనామధేయ ప్రణీతంబగు
శ్రీమహాస్కాందపురాణ సూతసంహితయందు
ముక్తిఖండంబను తృతీయాశ్వాసము.

శంతనురాజచరిత్ర

చతుర్థాశ్వాసము.

క॥ శ్రీరమణీమణి వదనాం
భోరుహమద చంచరీక! భూకాంతావ
క్షోరుహ గతకర ! కరధృత
హారాంగద వలయ ! వేంకటాచల నిలయా!॥ 1

తే॥ అవధరింపుము జనమేజయక్షితీశ
వరునకిట్లనె నమ్మునివంశకరుఁడు
"ముద్దుకూఁతును నీగతి బుజ్జగించి
యాదినారాయణస్వామి యరుగునంత ॥ 2

తే॥ చెలువ కౌతూహలాయత్తచిత్తయగుచుఁ
బద్మమిత్రోదయముఁగోరు పద్మినిగతి
శంతనునిరాకఁగోరుచు సఖులుదాను
నాత్మ సుస్థలమునకేగి యలరియుండె ॥ 3

* సూర్యోదయవర్ణన *

సీ॥ పొలయుల్కు లెడలి యుయ్యెలఁ బిన్నవయసుదం
పతులు ర (తీలోలు) గతులఁజిక్క
సంకేతములనుండి జారిణీజారు లొం
డొరులఁ బాయుటకునై యుబ్బుదక్క
సందుగొందులఁ బోవఁజాలక యున్న త
స్కరులు పేరెము లెత్తి కరము స్రుక్క
ప్రస్థానసముచిత పాథేయములుగొని
చనుపాంథులకు మహోత్సాహ మెక్క
అంబరస్థలిఁగన్పట్టె నపుడె సమయ
ఫణిఫణాభోగభాగభాస్వన్మణిసమగ్ర
జాగ్రదకలంక రత్నరాజంబనంగ
వింతయొరపుల కిక్కయు వేగుచుక్క॥ 4

తే॥ అరుణశేఖరతయుఁ జరణాయుధత్వ
మరయఁ గాలజ్ఞతయును మాయందెకలదు
సరిగనంచుఁ ద్విశుద్ధిగఁ జాటుకరణిఁ
గొక్కరోకోయటంచని కోడిగూసె॥ 5

స్రగ్విణి॥ తెల్లనయ్యెన్ దగన్ దీపికాసంతతుల్
చల్లనయ్యెన్ నవస్త్రైణహారావళుల్
నల్లనయ్యెన్ మిళిందస్థితిం బద్మముల్
మెల్లనయ్యెన్ స్మరామేయమౌర్వీధ్వనుల్॥ 6

చం॥ జనితవియోగదుఃఖ పటుసత్వర విభ్రమ (ఘూక)దంపతీ
ఘృణు లకలంకలీల నుడిఁగెన్ (ముడిగెన్)గుహాలందుఁ జీఁకటుల్
మనసిజుఁ డధ్వగప్రకరమర్మ విభేదనమాచరించి తాఁ
గినుకదొలంగఁ గత్తి కడిగెన్ ముడిఁగెన్ నవకైరవావళుల్॥ 7

వ॥ అంత 8

సీ॥ కరమునఁ బూర్వదిక్కమలాక్షి కేళిమైఁ
బట్టిన పికిలిపూఁబంతియనఁగ
సమయవసుంధరాజాని పైఁగనుపట్టు
బటువుమీటిన సూర్యపటమనంగ
ఉదయభూభృచ్ఛిఖరో పరిస్థలియందుఁ
గొమారారు జేగురుకుప్పయనఁగ
గగనలక్ష్మీనాథ కనదురోంతరమున
రాజిల్లు కౌస్తుభరత్నమనఁగ
నాకసరిదుదకేళికాఘోకమాన
ఖేటకరివరకరసముత్క్రప్రదీప్త
చటులవిస్ఫుటహాటకాబ్జంబనంగ
భానుఁ డుదయించె ఘనతీవ్రభానుఁడగుచు 9

వ॥ అప్పుడు, శంతనుఁడు కొలువుకూటమునకువచ్చుట.

సీ॥ తన కీర్తివల్లీమతల్లికి దశదిశాం
తరములు కాయమానములుగాఁగ
తన దయాసహకారవనవాటి కఖిలమా
ర్గణకోటి కలకంఠగణముగాఁగ
తన శౌర్యపద్మబాంధవునకు గర్వాంధ
పాంథితతి తమఃపటలిగాఁగ
తన విలాసజ్యోత్స్నకు నవవయస్స్త్రీహృ
దయములు చంద్రకాంతములుగాఁగ
తనభుజాభూరిమణిమయ స్తంభమునకు
శుంభదంభోధివలయితక్షోణిరమణి
సాలభంజికగాఁగ నిస్తంద్రవిభవ
సాంద్రుఁడై రాజ్యమేలుచు శంతనుండు 11

వ॥ కఱిమబ్బులుగుబ్బతిలు బలు పులుదిండి రాబారిదూలమ్ముల
దెసమసలక మెసవుకొను నను తలంపున మిసమిసలనెసఁగు మేటికిరీటి
పంచరాయిరంగులఁ దురంగలించు నచ్చంపు జిగిపచ్చికలకు వచ్చి గ్ర
చ్చర మూరుకొను కేళికాకురంగబాలికాపాళికలకు సద్మపద్మమహించిన
చికిలిమెఱుంగునగవు తెఱంగున నెసంగు నిగనిగనిదుగరాల మగరాల
తెలిచాయలను సోయగమ్ముఁ బండువెన్నెలల నిండారనిరసించు చందు
వాచెందొవ్వు మొగడలవెడలి కడలికొను సాంద్రసౌరభ్యలహరికి మొందు
కొని తండోపతండంబులై చమదెంచు గండుతుమ్మెదముత్తమ్ములచె
న్నున మిన్నలముకొన్న కాలాగురుగురు ధూపధూమస్తోమంబులం
గనుంగొని యదభ్రశుభ్రేతరాభ్ర విభ్రమంబుల ససంభ్రమంబుగ
నఖండతాండవంబులుసలుపు నీలమయూరవారమ్ముల విప్పుగల
పింఛంబుల చొప్పుచెప్పు గొప్పకప్పు కీలుకొప్పులుగల వాలయొప్పుల
కుప్పల బెడంగున నెమ్మొగులకు పటికంపుగోడల సొంపారు మాని
కంపుబొమ్మల ప్రతిబింబమ్ముల డంబుమీఱు ముకురబింబంబుల నిడుం

బించు చంద్రకాంతపుజగతుల నారజంపుఁబలుకుల చలువలుగ్రమ్మఁజేయు బకదారులు పొంకంబుగాఁ గనుపట్టు మణివిటంకమ్ముల వ్రేలు జీవదంతపుఁబంజరమ్ములఁ గరమ్ము భరమ్ము లేక తమతమపోతమ్ముల కాయతమ్ముగా భవ్యకావ్యనాటకాలంకారంబు లుపదేశించు ప్రౌఢకీరికాశారికాసంచయమ్ములకు భయావహమ్ములుగా మార్జాలనేత్రమ్ములఁబోలు వైడూర్యమ్ములఁ జూపట్టు గవాటమ్ములుగల కొలువుకూటమ్మున కేతెంచి పొడువు కెంపుసొంపుసంపాదింపంజాలు ప్రాగెంపురాచెక్కడంపుసింహాసనంబున నాసీనుండై యఖండచండరుచిపిచండిలమార్తాండమండలమధ్యంబున నిండుకొలువున్న కుండలిప్రకాండశయను తెఱంగున రంగుమిగిలి చింతామణిభద్రపీఠంబున నున్నతిగన్న వెన్నునన్న చెన్ను వహించి రాజచంద్రుండుగనుక మవ్వంపు నవ్వువెన్నెలల నశేషవిద్వజ్జననేత్రోత్పలంబులకు నుత్సవంబుగల్పింపుచుఁ బ్రభుమార్తాండుండుగనుక మౌళిభాగభాగబ్జరాగప్రభాబాలాతపంబుల నిఖిలబంధుజనహృదయపద్మంబులు వికసింపంజేయుచు నేవంకసరసులు నావంకరాజహంసంబులు నేదిక్కువిబుధులు నాదిక్కు గురుజనంబులు నివసించియుండ నంగ వంగ కళింగ బంగాళ కరహాట లాట సౌవీర సౌరాష్ట్ర మహారాష్ట్ర విదర్భ విదేహ నేపాళ వత్స మత్స్య కురు కుకురు సింధు గాంధార కొంకణ ప్రముఖ నిఖిల దేశాధినాథులుగొని తెచ్చిన మణి హాటక పీటికా పేటికా ధాటికా ఘోటికా శాటికా చేటికా కోటికాదులు కానుకలొసంగి నిటలతటఘటితకరపుటులై కొలిచియుండఁ బులినంబులఁబోలు శ్రోణులు నళినంబులనేలు పాణులు మధుర్ఝురంబులగేరు వాణులు మధుకరమ్ములమీఱు వేణులు గల కొందఱు మందగమనలు వెలిచామరంబులు వైవఁ జలుపావడలు వాలుగన్నులు గుబ్బచన్నులు గల కొందఱు సుందరాంగులు కర్పూరవీటికాపేటికాదులు ధరియించి తత్తద్వినియోగంబులకై వేళలరయుచుండఁ జక్కెరమోవులు కపురంపుఁగమ్మతావులు గల కొంద ఱిందిందిరాలకలు కరాంబుజంబులఁ దంబురంబు

లె త్తి తత్తదుచితలయస్వరతాళమేళనంబుల సవిస్తరంబులుగా గీతప్రబంధంబులు విన్నపించి సభారంజనంబొనర్ప నరవిందములఁబోలు పదములు కురువిందములనేలు రదములు గల కొంద ఱకలంకశశాంకముఖు లర్ధచంద్రారాళాశీవిషకపిత్థకటకాముఖశుకతుండపల్లవపద్మకోశప్రముఖ భరతాభినయనంబు లెఱింగింపఁ "చంద్రవంశాబ్ధిసంపూర్ణచంద్రోదయ! యవార్యగాంభీర్యచాతుర్యధైర్యశౌర్యవీర్యస్థైర్యసద్గుణగణవిశేష! శేష భాషా జిగీషామనీషాధురంధర! ధరారమణీమణీరమణీయతపనీయమణిఘృణికమనీయకేయూరశృంగారశుంభద్భుజార్గళవిహార! హారహీరనీహారకర్పూరపటీరమందారకుందారవిందారిభూరికీర్తిచ్ఛటాచ్ఛాచ్ఛచ్ఛాయాచ్ఛాదితదశదిశాంతరాళ! శంతనుక్షమాపాల! జయ విజయీభవ" యనివందిమాగధబృందంబులు హృద్యానవద్యగద్యపద్యంబులఁ గైవారంబులు సేయ నిండుకొలువున్న యవసరంబున, 12

శంతనుమహారాజుదగ్గఱకుఁ గోయదొరలు వచ్చుట.

సీ॥ ముక్కులపై నామములు నీలిచల్లడ
ములు బాహులందు డేగలును గఱకు
కోఱమీసంబులు కురువంకసిగలును
బిగువైనకాసెలు పెద్దబాములు
మొలలలోఁ దీరైన నెలవంకకత్తులు
దీర్ఘములౌ నీలదేహములును
వెడవెడనవ్వులు తడఁబడుమాటలు
నెఱ్ఱనికాంతిఁ జెన్నొనఁగు గ్రుడ్లు

గీ॥ భుజములను విండ్లు లమ్ములపొదులు గలిగి
పెంపుమీఱుచు దిక్కు వీక్షింపు చలర
నుర్విపాలకదేవేంద్రుఁడున్న పెద్ద
కొలువుకేతెంచి రప్పుడు కోయదొరలు 13

తే॥ ఏగుదెంచి మహీపాలు నెనుట నిలిచి
నయముతో వంకవంక దణ్డములొనర్చి
మంజుమృగమదగజకుంభమౌక్తికాదు
లందముగఁ గాన్కలిడి యిట్టులనిరి పెలుచ 14

తే॥ సామి! దేవర తండ్రి! శ్రీ రామువంటి
దొడ్డదొరవయ్య మామాట సడ్డచేసి
బన్నపరాకునైన నేర్పడఁగ వేగఁ
జిత్తగింపుమి యిప్పుడు విస్తరముగను 15

మ॥ పులులుం దుప్పులు జింకలిఱ్ఱులును మన్బోతుల్ (సివంగుల్ నెఱా)
యెలుగుల్ సింగము లేదు లేనుఁగులు నెంతే గుంపులై వాల్మికం
బులతోఁ ర్లక్ బలువేటకాండ్ర పని నేర్పుల్ గట్టి పెట్టించి యే
మలగన్గొన్నను దామెయై మలయుచున్ మత్తిల్లి కన్పట్టెడిన్ 16

తే॥ అయ్య! వాకేల మామనసైన యపుడు
మలలఁ దగనూసుసుందుము, మందుకైన
మెకముగనుపడ దెచ్చుట నొకటి ముందు
మందలై యున్న విప్పుడమందగతుల 17

సీ॥ సింగముల్ కనుపడ్డ భంగంబులై పాఱఁ
దగఁజంపకున్న మాతల్లితోడు
ఏనుఁగుల్ గనుపడ్డఁ బీనుఁగులం జేసి
ధరఁగూల్పకున్న మాతండ్రితోడు
పందులుగనుపడ్డ మందుకు లేకుండ
హరియింపకున్న మాయన్నతోడు
ఇఱ్ఱులుగనుపడ్డ నఱ్ఱులు తెగ వేసి
పొఱివుచ్చకున్న మాగురువుతోడు
సిన్నమెకములు మాకింక సెప్పనేల
అయ్య! సరిసీమలనుబట్టినట్టు పట్టి

తీర్గఁజేయక యున్న మాకేటిపేరు
మలలకే తెంచి మా వేఁటకలయఁగనుడి 18

కం॥ అనిపల్కెడియాటవికులఁ
గనుఁగొని మందస్మితంబు కనుఁగవఁదొలుకన్
ఘనుఁడా రాజశిఖామణి
ధనవస్త్రవిభూషణములు తగనొసఁగి వెసన్ 19

వ॥ వారలం బోవంబనిచి యున్నయెడ 20

తే॥ గొరక లురిగోలలును దుపాకులు జిగురులు
వలలు బోనులు వాగురుల్ వాటమైన
చాటుతడకలు మొదలగు సాధనములు
వేడ్కఁ గొంచేగుదెంచిరి వేఁటకాండ్రు 21

సీ॥ కాలారిమోహాన మాలపెద్దఫిరంగు
బెబ్బులిబల్గుండు పెద్దతునక
బంగారుతీఁగె తుపాకిభైరవమాల
సింగిణిమణిరేఖ చిత్రరేఖ
చీఁకటిదొంగ కార్చిచ్చుమాలయుదారి
మందులకొండఁడు మాలబంతి
మాఱివెన్నెలకుప్ప నేరెసుబండు దొం
గలమిండఁడను నామములఁజెలంగి

గీ॥ వైశ్యయుగ్మముకలహించుభాతి సారె
భాంకృతులొసర్చుచును దుర్నృపతులరీతిఁ
బెట్టిదంబుగఁ జూచుచు వేఁటకాండ్రు
కుందనపుఁబట్టెడలఁ బట్టుకొనుచురాఁగ
కదలె భైరవకంఖాణగణము లపుడు 22

—శంతనుఁడు వేఁటమార్గము వెడలుట—

వ॥ అయ్యవసరంబున 23

సీ॥ కులుకుగాఁ గస్తూరితిలకంబు నుదుటిపైఁ
దగదిద్ది సిగను సంపెఁగలమర్చి
వన్నెజాళ్వాపాగ తిన్నగాఁజుట్టి పై
మల్లెపూసిస్తురుమాల్గట్టి
కళ్కుసుప్పాణిచౌకట్లు కీవిగఁబెట్టి
యొసఁగ సందిటను దాయెతులువెట్టి
బలికెంపురవకెంపుఁ బతకంబుమెడవేసి
బంగారుప్రాఁత కబాయిదొడిగి
గీ॥ తళుకులీనెడిజరబాజుదట్టి మొల బి
గించి చౌకప్పుబాకు ధరించిమించి
నిలువుటద్దంబులోపల నీడగాంచి
కంతువింతఁజెలంగె నాశంతనుండు॥ 24

వ॥ అప్పుడు. 25

ఉ॥ రంగుమెఱుంగువజ్రములరాజిలు పల్లము మేలిజాళువా
బంగరుసత్ఖలీనమును బచ్చ లమర్చిన మోముపట్ట యొ
ప్పంగనుపట్టఁ బాదరసముంబలెఁదిర్గిమ్మరు నొక్కతేజిఁ జే
రం గొనఁ దెచ్చి సాహిణి పురస్థలినిల్పిన నిచ్చమెచ్చుచున్॥ 26

క॥ నరపతి సమ్మదమొదవఁగ
సురపతి హరిపతిపయిం బ్రశోభితుఁడైన
ట్టిరవొంద దొరలు సచివులు
గురుతరముగఁగొల్వఁ దూర్యఘోషము లడరన్॥ 27

తే॥ హత్తి మొత్తములగుచు రాహుత్తు లెదుటఁ
గడఁగిచను దేర వెలిజల్లిగడలమూకఁ
జేరి యిరుగడ లరిగెలవారు రాఁగ 28
వెల్లగొడుగులనీడ భూవిభుఁడుగదలె॥

వ॥ ఇట్లు కదలి చని చని యాభూమండలాఖండలుండు ఖండోద్దండ
గండభేరుండవేదండ రిపుపుండరీకశుండాలగండక కాండద్వీపితరక్షుకాండ
మండలప్రచండభైరవారావవినిర్భేదితపుండరీకభవాండభాండంబును గీ
చకనిచయకర్షణజనితదవహుతవహజ్వాలికామాలికా దర్శనస్ప
ర్శనప్రశస్తఖపిస్థల లంఘనజంఘాలగంధవహవాహవ్యూహాదినిగ్రహ
వ్యగ్రభిల్లపల్లవాధరీ కంకకర్షణశరాసనవినిర్ముక్త వారుణశరాసారస
మాసాదితకాండవర్షాగమంబును నధోభువనశరణనిజకుల పరివృఢస
ముద్ధరణకరణోదీర్ణతా కర్ణేజపనిశిత ఖనిత్రసదృశపోత్రోద్ఘాతవాహినీ
సైకతాంతరోద్వాంతఘన లుబ్ధలబ్ధామోదమేదుర స్తబ్ధరోమస్తోమ
భీమభూమఘుర్ఘురనిర్ఘోషప్రతిఘోషితాసన్న హిమవన్మహీధరగుహాకు
హరంబును నరుణకిరణప్రవేశకలనాసంవర్ధమాననిరంతరనిబిడాంధకా
రనిర్గంధనధురంధరవిద్యోతమానజ్యోతిర్లతావితానసముంజసకుంజపుంజా
భ్యంతరంబును నానావిహంగమిథునశరణ్యంబును నగు నరణ్యంబునందు
సముచితప్రదేశంబులలోపల లెసంగించియు బోను లొడ్డించియు నుఱులు
పఱఁగించియుఁ జోపుడుగోలలఁ జోపు వెట్టించియుఁ జెలంగునప్పుడు, 29

కం॥ దిసమొలవేలుపుగట్టుము
లసమానప్రౌఢిలుబ్ధకావళి పఱపన్
కసిమసఁగి వాల్మీకంబుల
వెసమసలక గీటణఁచె విలయస్ఫూర్తిన్ 30

• శంతనుమహారాజు సైన్యము మృగములవధించుట. •

కం॥ వేఁపులుకోపాటోపత భూపునిముందటను మృగసమూహము త్రుంపన్
చూపులుతీపులుగొనఁగా వేపునఁగని వేటకాండ్రు వీసరచేతన్ 31

వ॥ మృగంబులపయిం గవిసి 32

తే॥ "బైసుమాలక పొడుపుమీఁ బావ! నీవు
పిటికిఁ బాఱక నఱుకుమీ మఱఁది! నీవు

కడకుజరుగకి చీలుమిూ కొడుకొనీవు
తలఁగిపోవక చెంతుమిూ తాత!నీవు 33

తే॥ ఏలయిన్నాళ్లు పెంచెవమా నృపతిమిమ్ము
నేఁడుగా కెన్నటికిఁక మిూనేర్పులెల్ల"
యనుచుఁదమలోనఁ బంతంబు లాడుకొనుచు
వసుధఁగూల్చిరిమృగముల వఱ్ఱుగాను 34

చ॥ పులిపులినేతునంచు నొకపోటరి యామృగయుండు గొబ్బునన్
బులిపయికేగఁగా నదియు బోరున మిూఁదికిఁ జొకళింప న
త్యలఘురయంబునం దనముహస్తమునందలి దొడ్డబాకు త
ద్గళమున గ్రుచ్చి చీల్చె నెసకంబున, వాఁ డెటువంటిశూరుఁడో 35

చ॥ ఊరుజవ మొప్ప నొక్క మృగయుండు మహోగ్రత నేగుదెంచు సూ
కరము నదల్చి బల్లెమున గర్భము వ్రేసినఁ గఱ్ఱవెంట స
త్వరము గ దంష్ట్రిరా భువికి వామకరంబున బల్లెమూఁది చె
చ్చెర వలకేలివంకిణిని జీల్చెగళంబు నృపుండు మెచ్చఁగన్ 36

వ॥ అయ్యవసరంబున నయ్యవనీపాలకుండు, 39

క॥ ఖడ్గమ్ములఁబడనఱకెను ఖడ్గమ్మున భూరిచిత్రకౌశలమున వి
ద్విడ్గహనదహనుఁ డహహా! రాడ్గణములుచుట్టునిల్చి స్తుతిసేయన్

క॥ తల్లడమందఁగఁ బార్థివ
తల్లజుఁ డత్యంతరోషతామ్రాక్షుండై
భల్లముల భూరి (బాహాభ
ల్లమ్ములఁ గసిమసంగె బలమేర్పడఁగన్)

వ॥ ఇత్తెఱంగున మృగయాలోలాత్ముండై యమ్మహాత్ముండత్యంతోత్సా
హంబు వొడమి యంతటం దనివితీరక మఱియునుం గడంగి, 40

మ॥ ధరణిం బంచముఖత్వమొంది శ్రుతివిస్తారాప్తి సామోదని
ర్భరదానోన్నతిగన్న సామజగతిన్ భంజించునం మ... మహా

శరభాక్రాంతదిగంతరాళుఁడగుచున్ సంరంభశుంభద్భుజా
త్యురుశౌర్యోద్ధతిమీఱఁ జంపె నృపసింహుం డుగ్రసింహంబులన్ 41

తే॥ ఎన్నఁ జండాలులకు దానమిను చవంత
కుంభినీసంభరణకేళిఁ గొమరుమిగిలి
నట్టు నిజగతి తగఁ బూనె ననుచుఁ గెరలి
మత్తమాతంగములఁ గూల్చె మహిపమౌళి 42

తే॥ మనుపరిస్థలసంస్థితామలసితాబ్జ
పత్రనామాప్తిఁ గాంచి గోప్రాణహరణ
వృత్తి నేప్రొద్దు నలరె దుర్వృత్తులనుచుఁ
బుండరీకాళిఖండించె భూవిభుండు॥ 43

కం॥ హరివిద్వేషసమాశ్రయ
గురుచేతోవృత్తిఁ బూనెఁ గొసరక దీనిన్
ధరణికి బలిసేసెదనని
శరభంబులఁ ద్రుంచె నృపతి సరభసలీలన్॥ 44

కం॥ భూదయితుఁడనే నివియును
భూదారము లదియుఁగాక భువిఘనవృత్తుల్
నాదవ్రు తెఱఁగున వీనిన్
ఛేదించెదననుచు విభుఁడు చెండెం గిరులన్॥ 45

తే॥ ఆత్మవంశాధిపతియైన యబ్జునకును
హృత్కళంకంబు పుట్టించి యులనెసంగ
కాన వీనిని వేకూల్ప న్నానటంచు
హరిణశశములఁ గూల్చె మహామహుండు 46

కం॥ హరిగతులమెఱయుచున్ శం
బరభంజన విలసనమునఁ బరఁగుచు నతను
స్ఫురణ నలరంపగురియుచు
గరిమ నెసఁగె నప్పుడు రాజకందర్పుఁ డొగిన్॥ 47

వ॥ అంత 48

కం॥ పురహరకరసారంగము
హరిణాంకహృదంతరాళ హరిణముదక్కన్
ధర నెన్న మృగము పచ్చక
పురమయ్యెన్ రాజతిలకు పొలుపగు వేటన్॥ 49

వ॥ ఇత్తెఱంగున నారాజపుంగవుండు నిరాఘాటవనంబున మేటిమృగంబులగీటణంగించి వేటకాండ్రుకొని తెచ్చిన వ్యాఘ్రనఖంబులు చమరీవాలంబులు దంతావళదంతంబులు కిటిదంష్ట్రలు కస్తురిపిణియలు గైకొని వారికి బహుధనంబులొసంగి పంది కుందేలు దుప్పి జింక మొదలగు మృగంబుల సరసతరసవిసరంబులు పాల్పడి యుటుఁ జనిచని ముందట, 50

—♦ శంతనుఁడు హిమవత్పర్వతమును వర్ణించుట ♦—

సీ॥ మదజాల పదజాల పదకూల మృదు బాల
పవననిర్గతతుంగ భంగసరసి
తతదరీ గత ఝరీ హితపరిస్థితహరి
ప్రకరసద్ఘూత్కృత చకితభిల్లి
గురు తుంగ తర శృంగ వరసంగత రథాంగ
శాత్రవ మిత్ర నక్షత్రపాళి
స్ఫుటదంత పటుదంత పుటకాంత తట సంత
త విహారకలితగంధర్వయుగళి
గీ॥ లలితపికమధుకరశుకకలరవముఖ
విహగకులకలకలరవమహితసరస
మృదులకిసలయకుసుమఫలదళవిలసి
తధరణిరుహాళి యత్తుహినధరమాళి॥ 51

వ॥ కట్టెదురం గన్పట్ట నత్యంతసంతోషస్వాంతుండై కనుంగొని యగ్గిరికి నమస్కరించి, 52

చం॥ హారునకుఁ గూర్మిమామ తుహినాళికి సంభవసీమ మేనకా
గురుకుచపాళిసామ్యమునకోటులకెల్లను దావలమ్మ భూ
ధరవరుఁ డంబికాసతి నుదారతఁ గన్నగురుండు బాపురే
సరసమ త్తసద్గుణనిశాంతము నీహిమవంతముం జూచిరే॥ 53

వ॥ తత్ప్రభావంబు వర్ణింపుచు నటఁ బోవంబోవ, 54

శా॥ రంగద్రూపవినిర్జితాంగజునిపై రాజద్రతిన్ వీచె స
ద్గంగాతుంగతరంగలోల మధులిడ్భీర ఘోషస్ఫుర
ద్గాంగేయాంబుజఫుల్లహల్లక లసద్గంధానుబంధాప్తి (స్రా
మ్యం) గొంపోయినరీతి గంధవహ మామోదానుసంధాయియై॥

వ॥ అంత ముందట॥ 56

ఉద్యానవనవర్ణన

సీ॥ కాంచనకాంచన కాంచనానానంబు
పున్నాగపున్నాగ భూషితంబు
శ్రీఫలశ్రీఫలశ్రీఫలాగారంబు
మందారమందారమంజులంబు
సురసాలసురసాలసురసాల నిలయంబు
కేసర కేసరభాసురంబు
వంజులవంజులవంజులాస్థానంబు
చందనచందనబృందయుతము

మదనమదన సమూహ రమ్యస్థలంబు
దంతశరదంత శరసముదాయసదన
మగుచుఁగన్నులపండువై యలరునట్టి
వనముగనుగొనె మేదినివల్లభుండు॥ 57

వ॥ కనుంగొని యుద్యానంబు చేరంజని యచ్చట నొక్క రమ్య
ప్రదేశంబున సైన్యంబుల విడియ నియమించి మృదుల తరపదకమలకేలి

తరత్నపాదుకాయుగళుండై తన కత్యంతప్రియమిత్రుండగు విశారదుండను మంత్రినందనుకరంబు కరంబునఁగీలించి యయ్యారామాభ్యంతరస్థలంబున సంతసంబునవిహరించు కంతువసంతుల వింతదనర్చుచుఁ జని చని హిందోళసుందరీసందోహాగరుత్సంఘాతసంభూతవాతపోతోద్ధూతబాలరసాలమూలేందుకాంతాలవాలసన్నిహితప్రసవరససరిత్కూలసంవర్ధమానకాంతార వారశీర్యన్ముక్తాఫల రంగవల్లికాయమానాంగణరంజితనికుంజపుంజ జ్యోద్యచ్ఛితచ్ఛాయాప్రవేష్టిత కాసారసంజాతకంజాతమంజుకింజల్కపుంజ సమంజసరథాంగచక్రాంగ విహంగకులకోలాహలప్రతిఘోషితానంత మణికాంతమణికుట్టిమప్రదేశంబుల నిలుచుచు వలితెమ్మెరలు గ్రమ్ముకొనఁ గమ్మతావులు కుమ్మరిలు నిరంతరనీరంధ్రవాసంతికాలతానిశాంతమ్ముల యిమ్ముల దొమ్మిగొని ఝుమ్మని నాదమ్ముల మోదమ్ములొసంగు మొకరితుమ్మెదలమొత్తమ్ముల చిత్తమ్ములకుఁ దత్తరమ్ములం గ్రమ్మఁజేయు తదుపరిభాగాచ్ఛాదితాచ్ఛకుసుమగుళుచ్ఛాభిరామ హేమాభ్రంకష శాఖోప శాఖాశిఖాంతర కులాయసమేధమానరాజద్రాజకీర శారికానికరమధుర వచోవిశేషంబు లాలకించుచు గొప్పలై విప్పుగలిగి యొప్పుమీఱు కురువేరుచప్పరమ్ముల క్రేవల నెత్తావులదీవులై రేవమీఱు పూవులంజూపట్టుకోవులం బెనఁగొన్న కన్నెమావులపై మిన్నుముట్టి చెన్నుగలసురపొన్నగున్నలచాయఁ జల్లదనంబులకెల్ల నెల్లయగు మల్లియలనెనసి యల్లిబిల్లిగనల్లుకొనిన మొల్లతీవపొదరిండ్లపజ్జనిబుకొనిన గొజ్జంగిమావులపొదల బోరున జిలుకు నీహారవారిపూరంబులు నిండి మెచ్చువచ్చు నచ్చపచ్చరాకట్టు దోనలచెంగట మాటిమాటికిఁ జెంగలువయాకుపెనూటిసీటిపోటుచూపు కీరఘోటకుని మేటిథాటిగలిగి నిగనిగని తొగఱేని రాలంగట్టిన నిద్దంపు ముద్దుటరంగుల చెఱంగులఁ దురంగలించు మోహంబుల నిధువనంబులఁ జెలంగు మయూర మిధునంబులం గాంచి హర్షింపుచునా రాజన్యనందనుండు విశారదుతోనిట్లనియె. ౫౮

కం॥ ధరపురభిత్సురవనతరు
లరుదుగ నివ్వనము గన్న యవియాఁగాదే
ఉరుగతిఁ జెందఁగ నేటికి
నరవిభ నందనకుమారసంతానాఖ్యల్॥ 59

కం॥ శ్యామసదాళుల్ చెలఁగఁగఁ
గోమలపురుషతిలకాప్తిఁ గొనకొనియెనిటన్
శ్యామ సదాళుల్ చెలఁగఁగఁ
గోమలపురుషతిలకాప్తిఁ గొనకొనుటరుదే॥ 60

సీ॥ ఘనసారములఁబోలు ఘనసారములచాలు
బహుళీనగారూఢపటిమగాంచి
సురసాలములఁబోలు సురసాలములచాలు
నిష్టఫలావాప్తి నేపుచూపి
స్యందనమ్ములఁబోలు స్యందనమ్ములచాలు
సుందరచక్రాప్తి నందగించి
పున్నాగములఁబోలుఁ బున్నాగములచాలు
స్థిరమహాభోగసంస్థితిరహించి
గీ॥ కంటివేనీవునర్మసఖా! మదీయ
సద్వచోగతి నాయాయిసాలములను
చిత్రశృంగార(చేష్టితా)శేషలీల
నలలితంబైన యివ్వనస్థలమునందు॥ 61

కం॥ అని వనిఁగని చతురోక్తులు
ఘనమలరఁగఁబల్కు నృపకుమారమహేంద్రున్
గనుగొని యిష్టసఖుండును
ఘనవాగ్వైభవవిలాసగతి తేటపడన్॥ 62

సీ॥ చిగురుటాకులపేరఁ జెంగావిఁగట్టి
ఫలములపేర భూషలుధరించి
విరులగుత్తులపేర మెఱుఁగునవ్వువహించి
పైకనాదముపేరఁ బాటఁబాడి
గురుపరాగముపేర సరిగందమలఁది భృం
గావళిపేరఁ గొప్పలవరించి
పూఁదేనెపేర సంమోదాశ్రుగతినొప్పి
కలహంసములపేర గతులనొంది
వనరమాదేవి దేవ ! భవత్సమాగ
మోత్సవంబున నెంతయు నుల్లసిల్లె
ఘనులు మీరేగుదెంచుటకంటె నెక్కు
డైన సంతోషభోగభాగ్యములుకలవె 63

చం॥ లలశివబిందుబాలక విలాసగతిన్ సుమకోటిగన్పడన్
గలితమదాంబుబిందువులకైవడఁ బుష్పరసంబుజారఁగాఁ
జెలఁగుచుఁ జైత్రుఁ డంచితవిశేషరమం దగుమీకుఁ గాన్కగా
నిలిపిన కుంజరమ్ములన నిర్మలకుంజములొప్పె నచ్చటన్ 64

మ॥ వనజాతాంబకరూపు లీ రిటకురా వాంఛన్ లతాసుందరుల్
వనజాతారిశిలాప్రకల్పితమహావారావళీరావ్యభా
జనసంఘంబుల (మల్లికాప్రసవ)గుచ్ఛస్వచ్ఛముక్తాళి పెం
పెసయన్ నించి విచిత్రభూతిని నివాళింపించినట్లొప్పెడిన్ " 65

వ॥ అనిపలుకుమంత్రినందను వచోవిలాసమకరందబిందుబృంద
మ్ములు కర్ణంబున కమందానందంబు పొందుపఱుప నారాజసంక్రందన
నందనుండచ్చటచ్చట సంచరింపుచు,

సీ॥ చెలులు చంద్రాస్యకు శిశిరకృత్యములు గా
వించిన శశికాంతవేదిఁ జూచి
సకియలు కురువేరుచప్పరమ్ములనీడ
సయ్యాటలాడిన జాడఁ జూచి
వనితలు మన్మథస్వామివైభవలీల
వ్రాసిపూజించిన క్రమముఁ జూచి
మగువలూఁగిన గుజ్జుమావుల వ్రేలాడు
నల తీఁగె తూఁగుటుయ్యాలలఁ జూచి
తోయజాక్షులు పటికంపుదోనలునిండ
పచ్చరాకట్టుపణఁకుల నిచ్చలలరు
నలరుతేనియ కాల్వల కడ్డమేయఁ
బొలుచుపుష్పాడికట్ల లింపొలయఁ జూచి. 67

ఉ॥ ఇచ్చట నెవ్వరోసకియ లిందునిభాస్యకు శైత్యకృత్యముల్
మెచ్చఁగఁ జేసినా, రిచట మీనపతాకుని పూజ చేసినా
రిచ్చటనిచ్చటన్ బహువిధేష్ట వినోదము లన్మెలంగినా
రిచ్చటివారొ నెచ్చెలులు నెవ్వతొ యవ్వనజాక్షి యెన్నఁగన్ 68

కం॥ కురువేరు చప్పరములఁ గ
పురమొగి నెడలేకనిండి పొలుపగు భాస్వ
త్సరణులఁ జేర్చినయలనల
చరణాంకములౌర! మాయఁజన వించుకయున్ ॥ 69

కం॥ పుష్పాడివ్రాసిన వెన్నెల
కుప్పలు చెడ, పుర్వినిండ గుప్పినసుమముల్
విప్పుగ నించుక వాడవు
మెప్పుగ నిటమున్నె యిచట మెలఁగినవారల్ 70

తే॥ వారలిటనుండి యెచటికిఁ జేరఁజనిరొ
ఇష్టసఖి! చూచితే? యన, హితుఁడుపల్కె

"విరహాపరితాపశాంతికై వెలఁదిఁగూడి
సకియలిచ్చటవనకేళి సలిపిచనిరి. 71

కం॥ ఈనికటశ్రోణీస్థలి,మానినులుండుదు రనూన మానవియతిచే
భూనాయక! మెల్లన "ఁజని,మానుగవీక్షణము చేతమా?"యనునంతన్

సీ॥ వదరెడురాయంచ కొదమలనదలించి
యలసయానము దీర్చునట్టిస్వనము
పెద్దగాఁదనరారు ముద్దుకీరములకు
నేర్పుగాఁబలుకులు నేర్పురుతము
గంధాంధభుజగభు గ్గణము వంకలుదీర్చి
నిద్దంపునటనలుదిద్దునినద
మెచ్చికోయిలపిండు మచ్చికతోఁజేరి
కలికిపాటలు చెప్పు కలరవంబు
క్రమకాంచనకాచకంకణవినూత్న
పాదకటకఝుణంఝుణార్భటులు పెలుచ
నొక్కబలు మ్రోఁతగా జెల్వలున్న కుంజ
వివరమునసుండి బోరున వినఁగబడియె. 73

మ॥ విని భూపాలకమౌళిమంత్రిమణి పృథ్వీనాథుతోఁబల్కె "నో
యనఘా! వింటివె?యొక్క మ్రోఁత వినఁగానయ్యెన్ లసత్కుంజసం
జనితంబై,యట మానినీమణులు స్వేచ్ఛన్ నిల్వఁగాబోలు,త
త్స్వన మామానవతీకృతోల్లసితనాదంబౌ వితర్కింపఁగన్" 74

చం॥ అనవుడుభూమిపాలమణి యాత్మసఖుంగనియిట్లుపల్కె "నీ
నినదముఁజూడ నేగఁ దరుణీమణులున్న లతాగృహంబు వే
కననగుఁగాన మానగతిగాఁజని మెల్లన యాలతాంగులన్
గనుగొనివత్తమే?మన మఖండకుతూహలమొప్ప నెచ్చెలీ!" 75

కం॥ నావుడుసఖుఁడను "మెల్లన
భూవర! యేనేగి చెలులఁబొడగాం చిటకున్

వేవేగవత్తు నంతకు
నీవిటచుండుము హితప్రవృత్తి నెలంగన్" 76

మ॥ అని రాజాజ్ఞవహించి నెచ్చెలిపరీమోదాయత్తచిత్తంబునన్
జనఁగా వీచెను సానుకూలగతిఁ జంచచ్ఛీతవాతూల మా
వినతానందనదుగ్ధపత్రరథముల్ విఖ్యాతిమై వానుభా
గనిరూఢోద్ధతిచేమెలంగె నతిమాంగల్యస్థితుల్ దెల్పుచున్ 77
ప॥ చని చని తరుగణంబులోనం జొచ్చి 78

మ॥ కలితాహ్లాదమునన్ గనుంగొనియె భూకాంతాప్రియుం డచ్చటన్
గలకంఠిన్ గనకాంగిఁ గాంచనకుభృత్కారివ్యవక్షోరుహన్
గలహంసోత్తమయానఁ గంధరకచన్ గంజాతపత్రేక్షణన్
గలికిన్ గన్నియ నొక్క కామినిఁ గనత్కర్పూరమందస్మితన్ 79

ఉ॥ కాంచి దృగంచలంబులు వికస్వరభాస్వరలీలనొంద న
భ్యంచితహర్షబాష్పతతు లాననవిస్ఫుటహాటకాబ్జని
ర్యంచలసాంద్రసీమ విలసద్గతిఁబూనినభంగసంపద
న్మించినకౌతుకంబెసఁగ నెమ్మదినెన్నగణంగె నెంతయున్ 80

ఉ॥ "ఎవ్వతొ యీవిలాసవతి యెవ్వతొ యీకలకంఠకంఠి తా
మవ్వపుఁబువ్వుదీవియల మంజులకుంజములన్ మనోజ్ఞమా
నివ్వనవాటికో విలసితేష్టవినోదవిహారలీలచే
జవ్వనిపిండు లూడిగముసల్పుచుఁ జుట్లనెసంగ మీఱెడిన్ 81

కం॥ మణిహారములో నాయక
మణిభాతిని దారకాసమాజమున నిశా
మణిరేఖగతి వయస్యా
మణికోటులలోన నీరమణిమణి యలరెన్ 82

సీ॥ అలరారుకళలూరు నెలగేరుచునుమీఱు
జిగిదేరు నీకన్నెమొగములీరు

అలకప్పులలిగుప్పు చెలువుప్పుఘనుదెప్పు
మెఱపైపునయీకొమ్మ కొప్పువొప్పు
సిరిఁజూపువిరితూపుదొరతూపు గుఱి యేపుఁ
బాపునీకోమలిచూపుకోపు
చెలువంపుబలుసొంపుగలకెంపువగఁజంపు
మురిపెంపునీయింతి మోవిపెంపు
గీ॥ నిక్కునుపుబువ్వుదొక్కు నీనెలఁతముక్కు
మెఱుపుగమిసేలు నీకాంత మేనిడాలు
కప్పురపుఁబల్కులొల్కు నీకలికిపల్కు
దీనినుతియింపవశమె వాగ్దేవికైన॥ 83

తే॥ కమలదళనేత్రి తీఁగెను కరయుగంబు
కలికితొడలును బుష్కరగతివహించె
సుందరీమణికిల్కొప్పు సొలపుచూపు
మందయానంబు సారంగమహిమఁగాంచె॥ 84

తే॥ అబ్జపున్నాగవిఖ్యాతినతిశయిల్లె
నబ్జపున్నాగవిఖ్యాతినతిశయిల్లె
నబ్జపున్నాగవిఖ్యాతినతిశయిల్లె
నబలగళవేణిముఖనాభిహస్తగతులు॥ 85

ఉ॥ కన్నులతీరు మోవిజిగి కౌనుబెడంగు మొంగబుడంబుబల్
చన్నులఠీవి కంధరవిలాసము పల్కులతీపు చూపు మేల్
వన్నియకొప్పుచొప్పు కరవైభవ మంఘ్రులరాయి ప్పరయారోయా
కన్నె కెకాక లోకములఁగల్గినకాంతలయందుఁగల్గునే॥ 86

ఉ॥ కన్నులు పుండరీకగతిగాంచె, మృదూక్తి శుకాప్తిచెందె, బల్
చన్నులు పర్వతస్థితి ప్రశస్తిగనెన్, ఘనవేణి నారదా
భ్యున్నతివీరాజె, నట్లగు టహా తగ నీయెలనాగఁ గన్గొనన్
జెన్నెసలారఁగల్గవె యశేషవిశేషరసప్రకాశముల్"॥ 87

మ॥ అని యశోకమలి రూపవిభ్రమవిలాసౌన్నత్యముల్ మంత్రిసం
దనుఁ డానందరసాబ్ధిమగ్నవిలసత్స్వాంతాబ్జుఁడై వేడుకన్
వినుతుల్ చేసి తదీయవార్త క్షితిభృద్వీరావతంసంబు శ్రో
త్రనవాకల్పముగా వినన్ దెలిపి చేరన్ దెత్తునంచున్ జనన్॥ 88

మ॥ చని గోత్రాతలనాథుఁ గాంచి జలభిత్సంకాశసద్వైభవా
భినవాడంబర! నీప్రపంచ విలసద్విఖ్యాతసమ్మోదసం
జనితప్రాభవలాలసుండనయి స్వేచ్ఛన్ బోయి యేనిమ్మహా
వని నానావిధచిత్రముల్ గనుచు రేవన్ మీఱుచున్ ముందరన్॥ 89

సీ॥ బాలానిలవిలోలదేలాలతావాల
కూలాంచితరసాలకోటిగడచి
సారసారివిహారసారసాకరతీర
సారవర్ధనసారసమితి దాటి
చందన కృతమాల కుందనాగతమాల
చందనవరసాల చయము మీఱి
లలితసారభసారకలితసత్సహకార
ఫలితోరుఖర్జూరపటలిఁ జూచి
లుంగములను లసన్మాతులుంగములను
పూగములను ఖ్రికాశపున్నాగములను
తాలముల భూరిరుచిరహింతాలములను
జాజులను విరజాజుల నరవిఁ గాంచి॥ 90

సీ॥ మావుల మకరాంకుమావులఁ జెన్నారు
కోవుల లవలీనికుంజములను
రేగులఁ బూఁదేనెవాఁగుల నలకొండ
గోఁగుల సురపొన్నకూటములను
గురుగులఁ బనసలమరువులఁ బొన్నల
పొరుగులఁగల పోకమ్రాకలందు

కావులు వెదఁజల్లు పూవులుగల మొల్ల
తీవెలల్లిన గంగరావులందు
స్వచ్ఛతరజాయమానాతిసాంద్రశిశిర
గోస్తనీకాయమానప్రశస్తనిస్తు
లైందవోపలవేదికాబృందములను
వికచపద్మదళాక్షుల వెదకివెదకి॥ 91

ఉ॥ అంత నతాంతభాస్వరలతాంతనితాంతసమగ్రసౌరభా
క్రాంతదిగంతరాగతనిరంతరమాంసల భృంగమంగళా
త్యంతవిలాసగీతనినదాకలితంబగు నొక్క కుంజగే
హాంతరసీమఁ గాంతతరహైమకరోపలవేదికాస్థలిన్॥ 92

మ॥ ఘనవిద్యుల్లతికాభగాత్రిల వలత్కంజోల్లసన్నేత్రలన్
ఘననీలోపలనీలవేణులను వీణామాధురీవాణులన్
ఘనసారోజ్జ్వలహాసలన్ దిలసుమాకారస్ఫురన్నాసలన్
గనదంభోరుహరాగపాణుల రథాంగశ్రీపృథుశ్రోణులన్

వ॥ అత్యంతవినయవివేకలక్షణవిచక్షణలగుమృగేక్షణాసహస్రం
బులం గనుంగొని తత్సభామధ్యంబున॥ 94

సీ॥ సంపూర్ణచంద్రుని సరసమాడఁగఁజాలు
మొలకలేనగవొల్కు మోముదాని
క్రొక్కారుమెఱుఁగుల గుంపుపెంపెలయింపఁ
జాలిన నెమ్మేనిడాలుదాని
జాతినీలమ్ముల నీతిగాదనిదెప్పు
గొప్పమేల్కొప్పుక ప్పొప్పుదాని
కలువరేకులనేగు కన్నులుగలదాని
రివిగుల్కెడి కావిమోవిదాని
చికిలిబంగరుచెఱఁగుల చేలదాని
ముద్దుటంచులకాటలు దిద్దుదాని

చిలుకలకుఁ గల్కిపలుకులు దెలుపుదాని
కంతురతివంటి యొక కల్వకంటిఁ గంటి॥ 95

ఉ॥ ఆరమణీలలామ కహహా! సవతంచనవచ్చునే సురాం
భోరుహపాణులన్ మనుజపుష్పసుగంధుల యక్షకన్యలన్
చారణకామినీమణుల సాధ్యమృగేంద్రవిలాసమధ్యలన్
గారుడపాటలాధరుల నాగలతాంగుల రాజశేఖరా!॥ 96

ఉ॥ అంగజుపూవుముల్కి, రతియాడెడిముద్దులచిల్క, జాళువా
బంగరునక్కు, లేచిగురుబంతి, మెఱుంగులకుప్ప, ముత్తెపున్
రంగుజగ్గునిగ్గు, వగరాజిలుబోదపసిండి యుంచగా
కంగన నెన్నిచూడ నహహా! సతిమాత్రమె రాజశేఖరా!॥ 97

చ॥ కపురము నన్మృగీమదము కమ్మసితావులుక్రిమ్మ దేవపా
దపవికచప్రసూనరసధారల సమ్మిళితంబుఁ జేసి య
చ్చపు నునుక్రొమ్మెఱుంగులు నిశామణివెన్నెలలందుఁ గూర్చితా
నిపుణతఁ జేయఁగావలయు సీరజజుం డల కన్యకామణిన్॥ 98

ఉ॥ భంబులుగా నఖాళి, కరభంబులుగా తొడ, లక్షు లంబుజా
భంబులుగా, సుధారసనిభంబులుగా పలుకుల్, కురుల్ ద్విరే
ఫంబులుగా, జితోల్లసదిభంబులుగా నడ, లొప్పు, భద్రకుం
భంబులుగా స్తనంబులు నృపాలక! పంకజపత్రనేత్రికిన్॥ 99

ఉ॥ కంబుగళంబు, కనకంబుగదే నును మేను, కౌను నా
కంబుగదే, సునాస కనకంబుగదే, చనుదోయి మత్తకో
కంబుగదే, శశాంకపృథుకంబుగదే నిటలంబు, మేలు, లో
కంబున దానిఁబోలు నవకంపుసతీతిలకంబు గల్గునే॥ 100

సీ॥ సారంగమద మదసారంగములమీఱుఁ
గలకంఠిమైతావి కనులఠీవి
అంబుజరాగ రాగాంబుజమ్ములమీఱు
సకిమోవి కెంపు హస్తములసొంపు

పున్నాగవర వరపున్నాగములమీఱు
నలినాక్షినూగారు నాభితీరు
పుష్కరఘన ఘనపుష్కరంబులమీఱు
తొయ్యలికీల్కొప్పు తొడలచొప్పు
వేదిగంభీర గంభీర వేదిగతుల
సరవిమీఱుశరత్పూర్ణచంద్రవదన
కటితటముహేల విలసితగమనలీల
నబలగొనియాడఁదరమె బ్రహ్మాదులకును॥ 101

ఉ॥ కన్నులుచేరఁజేసి, జిగికొను బళీ! పిడికెండ, గుత్తపుఁ
జన్నులుపట్టెఁడా బెడఁగుజగ్గులు గుల్కెడు వేణిబారెఁడా
పున్నమచందమామవగ బూనినమోము కొణిందెఁడారయఁ
గన్నియఁ గౌఁగిటంబొదువఁగల్గినమేటికి స్వర్గమేటికిఁ॥ 102

తే॥ కలికిరదనాళి మొల్లమొగ్గలనుమీఱు,
పణఁతిమీఁగాళ్ళు తాఁబేళ్ళఁబట్టిపోరు,
బాలనూగారు చీమలబారుగేరు,
కాంతఁగనుగొన్నఁ గన్నులకవ్వుదీఱు॥ 103

ఉ॥ దానిబెడంగుగుబ్బలును దానిచొకాటపుఁదేటచెక్కులున్
దానియొయారపుంబిరుదు దానిమెఱుంగుసోగవెంట్రుకల్
దానిమిటారిచూపులును దథ్యము కన్నులఁజూడ బాపురే!
మానవులేమిచెప్ప నలమన్మథుఁడైనను భ్రాంతిఁబొందఁడే॥ 104

సీ॥ చికిలికెంపుల నీటుసేయంగవచ్చునే
కాఠిన్యగుణ మందుఁ గలిగియుంట
చిగురుటాకుల సాటిచెప్ప నేగతివచ్చు
నానాఁడు మార్దవం బూనకుంట
కెందమ్ములను సామ్యమొందింపనెట్లొప్పుఁ
బ్రొద్దువెన్నెలచేతఁ బొలుపుగనుట

పగడంబు లెనయంచుఁ బలుక నెట్టులఁజెల్లుఁ
గనుక నేవేళఁ జేకట్లఁబనుట
గీ॥ అహాహా! మృదుతరసంపత్తి నతిశయిల్లి
సతతతారుణ్యయుక్తమై సహజసరస
లీలనెసఁగి విశృంఖలోద్వేలగతుల
నొప్పు నా చంద్రముఖి పాదయుగళమునకు॥ 105
తే॥ వేడ్క ముఖచంద్రుఁ గచనిలవిషధరంబు
పైకొనినఁ దన్మహామిత్రభావమొంది
నట్టిగమనాండజముఁ జేరి యధిపుఁ గాచు
కొను భయములగతిఁ జెలి కాళ్లగోళ్ళుతనరు॥ 106
కం॥ అజుఁడు గజగమన గమనము
గజసంపదగాంచుటెఱిఁగి కచ్ఛపములుగా
సృజియించెం బ్రమదంబున
గజకచ్ఛపలీల తొంటిగతి యేర్పడఁగన్॥ 107
తే॥ పంకమునఁబుట్టి బహువిధప్రాప్తి వృద్ధి
బరఁగియుండిన కమలగర్భంబు లీడై
యతుకులై మ్రోయు స్వర్ణకాహళలు సరియె
చంద్రవదన విసర్మలజంఘికలకు॥ 108
చం॥ నిరతము విభ్రమాప్తిగని నిష్ఠురకర్కశలీలఁ జెంది బం
ధురరుచి లేకమోఁటు కరితుండము లోవివరంబెఱుంగ కే
సరసిజనేత్రియూరువుల సాటికివచ్చి ముసింగి దీటురా
నరటులువూని వన్యముల నాకులపాటు వహింపదే ధరన్॥ 109
మ॥ కులగోత్రాగ్రముల న్వసించి విలసత్కూర్మాసనాసీనమై
బలిమిన్ మారుతభుక్సముద్ధరణ శుంభల్లీలఁ బెంపొంది ని
శ్చలతన్ ధాత్రీ తపంబొనర్చి మహిళాంచచ్ఛ్రోణియై నిల్చెఁగా
కల రత్నాకరమేఖలాప్తి గనసేలా కాకయున్నం దగన్॥ 110

క॥ ఆవనజనేత్రినాభికి । భావింపఁగఁ బొన్నపూవు పరఁగనరియొకా।
దావర్తము (సమమనియు)నఁ । గావచ్చును వరదఁ బోవఁగాఁగను
గొనుచున్॥

తే॥ భామినీమణి లేఁగౌను బయలుచెంద
నుపరిసిమకు నాహార్యయుగళినిలిచె
అతనుచే నట్లు విపరీతమయ్యె నేను
కమలసంభవు నిర్మాణకౌశలంబు॥ 112

తే॥ లలితనాభీబిలాంతరస్థలము వెడలి
కురుపయోధరభూధరకూటములకుఁ
బరఁగ నెగఁబ్రాకు మేచకఫణియనంగ
భామకెంతయుఁ గనుపట్టె రోమరాజి॥ 113

తే॥ వనజదళనేత్రివళులతో వైరమెత్తి
భంగసంపదఁజెందెఁ దరంగసమితి
అదియెకారణముగను దానాశ్రయించె
భంగనామంబువాని నభంగగతిని॥ 114

సీ॥ అశ్రాంతఘనవిభ్రమాయాసమునఁగుందు
రంగుబంగరుబొంగరంబులీడ
కమనీయమార్దవకలితమ్ములై మించు
సరసప్రసూనగుచ్ఛములుసమమె
తృణకాష్ఠపాషాణధృతిఁ గర్కశతమీరు
కులధారుణీధరకోటిజోడ
పొద్దునఁ గొలఁకులఁ బొలుపుగా జతఁజెందు
మదగథాంగవిహంగమంబులెనయె
గీ॥ బహుళసుస్థిరలక్ష్మిచేఁ బరిఢవిల్లి
వినుతకాఠిన్యయుక్తమై నునుపుగలిగి

యనిశమును జోడుఁబాయక యలరుచున్న
చంద్రముఖి నిబ్బరపు గుబ్బచన్నుఁగవకు॥ 115

తే॥ హంసవితతికి భోజనంబౌటకతన
నవమృణాళంబులను బోల్పఁదవునుగాక
లలితమధుజృంభణాతిమీఱు లతలఁబోల్పఁ
బాటిగానేర్చునే కొమ్మబాహువులకు॥ 116

కం॥ వలముఱి దరాప్తిగని వె
ల్వెలఁబాఱియు మొరసి ముడిఁగి విషరుహనేత్రీ
గళలక్ష్మికిని బ్రదక్షిణ
మెలమిం గావించఁబోలు నిద్ధస్ఫూర్తిన్ 117

చ॥ భువనచతుర్దశప్రకటమోహనచారుకళాఢ్యమైన త
త్కువలయనీలవేణి నవకోమలకమ్రరదాంశుకంబుతోఁ
పవడము సాటిరాదె కద పక్వదశం దనరారు దొండపం
డవనిఁ బడంగఁ జూచియును హా! తగ సామ్యమనంగఁ జెల్లునే॥ 118

కం॥ అతిపృథుతను గరినతనున్
నితంబమధ్యస్తనముల నిర్మించి తగన్
జతురాస్యుఁడు కిలికించిత
పతి మధురోక్తులను మార్దవంబును నిల్పెన్॥ 119

తే॥ అమలకురువిందముల నీరసముగఁ జేస
దాడిమీబీజములఁ జప్పదనము చేసి
మొల్లమొగ్గల వెస ముచ్చమునుగఁ జేసి
జలజపత్త్రాక్షి రదనముల్ చెలువుమీఱె॥ 120

కం॥ ఛాయాచోరకరుచితోఁ। బాయనిముకురములఁ దెగడి పంకేజపలా
శాయతవిలోలలోచన। సోయగపుంజెక్కులలరు సుస్మేరములై॥

తే॥ మంజుతరవజ్రపుష్పహేమప్రసూన
విజయబిరుదాంక మొగిఁబూసవెలసెననఁగ

గ్రొత్తముత్తెంపుముంగర కొమరుమిగుల
సుందరీమణి నాసిక చూడనలరె॥ 122

కం॥ తొమ్ముదుల లెక్కసేయక। యెమ్మెగులుకు కొమ్మవీను లెన్నఁగ
శ్రీకారమ్ములు నిజమ్ముసుమ్మీ। కమ్మలసంగతిని మిగులఁగనుపట్టు
టచే॥ 123

సీ॥ తమ్ముల సరియంచుఁ దగఁజెప్పవచ్చునే
తమ్ములు పంకజాతమ్ములగుట
కైరవమ్ముల సాటిగా నెన్నఁబోలునే
కైరవమ్ములు దివాభీరులగుట
క్రొమ్మెఱుంగుల దీటుగూర్పఁగఁబాడౌనే
క్రొమ్మెఱుంగులు క్షణభంగురములగుట
గండుమీల సమంబుగాఁ బోల్పఁజెల్లునే
గండుమీ లరభంగగరిమగనుట
రాజితాదభ్రశుభ్రవిభ్రాజమాన
రుచిరశుచిమంత్రికర్ణికారుక్ప్రకలిత
చారుదీర్ఘకటాక్షవీక్షావిలాస
గౌరవములైన పూఁబోణి కన్నులకును॥ 124

కం॥ అగణితదృఢశౌర్యంబుల
జగములుమూఁడొక్కమాఱుసాధింప మనో
జ్ఞగతుల రతిమకరాంకు లె
సఁగనెత్తినవిండ్లనంగ సతిబొమ లమరెన్॥ 125

మ॥ కమలాక్షీముఖకాంతిలక్ష్మికి శరత్కాలంబునన్ నిండువు
న్న మరేమీఱు ద్వితీయయామమున జీర్ణక్షీరభృన్మాళికా
రమణీయంబగు వ్యోమమండలమునన్ రాజత్కళంకాప్తిన
ప్రమతింబాసి చెలంగు పూర్ణశశియై సైదోడు భావింపఁగన్॥ 126

సీ॥ తరళాక్షి కురులవిస్ఫురణఁగాంచితలంకి
ఘననీలములు తృణగ్రాహులయ్యె
పణఁతి పెన్నెరులసంపదగాంచిభయమంది
ఘనము ధరాధరాగ్రములఁజేరె
బాలక కుంతలప్రతిభఁగాంచిచలించి
సమదాళితతి విపినములదాఁగె
లలన కేశప్రభాలక్ష్మిఁగాంచికలంగి
శైవాలలత జలస్థలులఁజెందె

గీ॥ అహహా! తథ్యంబుసుమ్మిది, యటులఁగాక
యున్న ధరలోన భంగపాటొందువార
లకొగివాటిల్లుగతులు దీనికిఁదనర్చు
టకును గారణమెన్న నించుకయుఁగలదె॥ 127

ఉ॥ గోచరమౌన యక్కుసుమకోమలి సుందరరేఖ శేషభా
షాచపలేక్షణావిపులచారుమనంబులకైన లేశముఁ
వాచకశుద్ధితో మిగుల వర్ణనసేయఁగడంగిరేని హా!
చూచినఁగాక యావలవుసోయగ మెన్నఁగవచ్చు నేరికిఁ॥ 128

చ॥ అతులవిలాసభాగ్యమహిమాన్వితయైతనరారుచున్న త
త్సతిఁ గనుగొన్న పూరుషకదంబములఁ నిజశాంబరప్రభా
వత భ్రమియించి మించి యనివారణదారుణకౌసుమాశుగ
పతితతుల మర్మభేదనము పంచశరుం డొనరింపఁజే నృపా!॥ 129

తే॥ దాని పరిరంభసంభ్రమోదారచతుర
గతులచే నుల్లసిలువాని బ్రతుకు బ్రతుకు
దాని రతిసౌఖ్యకలననే తనరుచున్న
వానిజన్మంబు జన్మంబు వసుమతీశ! ॥ 130

సీ॥ తుహినమహీధరోత్తుంగశృంగస్వర్ణ
కందరమణిసానుకటకములను

సమదభృంగీలసత్సంగీతనిస్స్వాన
రంజిత లవలీ నికుంజములను
శ్రీఖండసానుమ చ్ఛీతవాతాలోల
బాలరసాలాలవాలములను
కైరవకల్హార కంజాతసంజాత
సౌరభోద్గార కాసారములను
గీ॥ విమలశీతలశశిశిలా వేదికలను
సారమకరందనిమ్నగా తీరములను
మంజతర గోస్తనీకాయమానములను
చాన విహరించుఁ జెలులతో సంతతంబు॥ 131

మ॥ లలనాకోమలపంచబాణ! మదిఁ బోలంజూడ నాశ్యామ యా
జలజాతాంబకహేతి యాచెలువ యాసౌభాగ్యపుంబ్రోపు నా
జిలుఁగున్ వెన్నెలసిగ్గు నాతరుణి యాసింగారపుందీవి యా
తలిరుంబ్రాయపుమోహినీరమణి యాతన్వంగి నీకేతగున్" 132

కం॥ అని సఖుఁడు నృపతిచంద్రున
కనురాగాద్భుతకుతూహలాతిశయంబుల్
జనియింప సతివిలాసము
ఘనసరసమనోజ్ఞనా క్ప్రకాశతఁ దెలిపెన్॥ 133

వ॥ ఇత్తెఱంగున నక్కురంగనయన సౌందర్యప్రసంగంబు విన్నవించిన

ఉ॥ ఆ చతురబ్ధిభూమిపతి కాసతివార్తలు విన్నయంతనుం
డాచనుగుబ్బలాకరములా మొగమాకటి యారదాంశుకం
బాచరణంబు లాకచము లన్నియుఁ బల్మరుఁ గాంచినట్టుగా
దోఁచుచునెగాని యన్యమిఁకఁ దోఁచద యాతని మోహమెట్టిదో॥

ఉ॥ ఆరమణీలలామ నవయౌవనకోమలసుందరాన్వితా
కారము రాజచంద్రునకుఁ గన్నులఁగట్టినలీలఁదోఁప నం

భోరుహాగేహినీసుతుఁడు పుండ్రధనుఃప్రవిముక్త చండశా
తోరుసుమాంబకంబుల మహోగ్రతఁ జూపి కలంచె మర్మముల్॥

తే॥ చండకాండౌఘముల రాట్ప్రకాండ మదవి
ఖండన మొనర్చు రాజశేఖరుని గదిసి
చికిలిపూఁటమ్ము లేనింటఁ జిలుక తేజి
పాదుశాహా బళీ! భంగపఱుపఁ జొచ్చె॥ 137

న॥ అయ్యెడ, 138

సీ॥ ఖండకోదండ ప్రచండకాండౌఘముల్
మైనాటఁ దన కూర్మిమంత్రిఁ జూచు
చూచి లతాంగి భాసురవిలాసస్ఫూర్తి
పలుమాఱు వాంఛమైఁ దెలియ నడుగు
అడిగి తదీయ మోహనమూర్తి సారెకు
మదిలోన భావించి కుదురుపఱచు
పఱచి తా నాత్మలోపల వెన్నవలెఁ గరం
గుచు నుస్సురని మోము కొంతవంచు

గీ॥ వంచి కనుమూసి తనరఁ జిత్రించినట్టి
ప్రతిమవై ఖరిదాల్చు, తాల్చి తనలీల
శిరము కదలించు, కదలించి నెరవు నగవు
రాజచంద్రుండు మోహవిభ్రాంతుఁడగుచు॥ 139

సీ॥ భద్రగజశ్రేణులఁ బరఁగుచుండెడి రాజు
కెంత ప్రియంబయ్యెఁ గాంతగమన
మాచక్రవాళాచలాచక్ర మేలుభూమి
వరున కెంతరుదయ్యెఁ దరుణిపిరుదు
ధనరాశి యర్థార్థితతికిచ్చుదొర కెంత
బంగారమయ్యె స్వర్ణాంగికాంతి

హేమాద్రిస్థైర్యాభిరాముఁడౌ పతి కెంత
సౌందర్యమో! బూఁబోఁడి గుబ్బదోయి
గీ॥ విమలసన్మార్గణావళీవ్యయావిభవ మెంత
గగనమయ్యె వధూమణి కలికికౌను
అకట యిటువంటిఘనులకు జలజముఖుల
వినుతసౌందర్యరేఖ మోహనముగాదె॥ 140

వ॥ అప్పుడు పురుహూతసన్నిభుండు దెప్పరంబగు మోహంబు ద్రిప్ప లేక కుప్పవైచి యొప్పుమిగులు ప్రియసఖుంగని యిట్లనియె॥ 141

చ॥ "వరసఖ! నీ మనోజ్ఞతరవాగ్రచనావిభవంబు భారతీ
సరసిజపత్రనేత్రియును జాలదు వర్ణనసేయ నాత్మ, నే
నరయఁగనేర్తునే పొగడ, నత్తరలాక్షి విలాసలక్ష్మి సు
స్థిరగతి విన్నయాదిగను జిత్తము విభ్రమమందె నేమనన్ ॥ 142

చ॥ అతనుఁడు చండపుండ్ర విశిఖాసనమందలిమౌర్విఁగూర్చి మా
రుతరథ మాగ్రితం దక్షిమి క్రూరమహాశనిసారఘోర తీ
వ్రతర సుమాస్త్రసంతతుల రాయిడిచేసె మదీయమానసం
బతులితలీల నీచులకు హా! దయగల్గునె యించుకేనియున్ ॥ 143

సీ॥ తనువు నేచేఁదొడంగె నెనసిగంధపుఁగొండ
గాలి గాదిది దావకీలిగాని
చండతాపమొనర్పసాఁగెఁ బుష్పంధయ
కులముగాదివి హాలహాలముగాని
ఘనదుస్సహవ్యథాకరమయ్యె స్మరహాయో
త్కరముగాదిది తీవ్రశరముగాని
గాఢచేతోభయంకరవృత్తిగదె హంస
గణముగాదిది మృత్యుగణముగాని
గీ॥ అకట యివిపాంథజనముల నధికహింస
పఱుప మకరాంకునకుఁ దోడుపడి మనోజ్ఞ

సౌమ్యసద్వృత్తిపదవి దౌర్జన్యగతిని
జెలఁగె,హీనుల కౌన సుస్థిరగుణంబు॥ 144

—♦ చంద్రదూషణ. ♦—

సీ॥ ప్రబలార్జునోరు విగ్రహాజాతబహుళార్తి
ఖేదంబుచేఁ దగఁ గృశతగనుట
హరివిరోధావాప్తి నలరారియుంట శ్రీ
రామాహితానూనధాముఁడగుట
దాక్షాయణీప్రియ తాత్పర్యగుణియౌట
చటులదోషాకరోజ్వలతగనుట
పద్మినీవైభవ ప్రతికూలుఁడై యుంట
కౌటిల్యహృదయ విఖ్యాతియగుట
గీ॥ పోసఁగ దశకంఠునకు సరిపోల్పవచ్చు
అయయో!యిటువంటిచంద్రున కరయ దయయు
సత్యశౌచంబులును గల్గఁజాల వెపుడు
పాంథు లేగతి వీనిచే బ్రదుకువారు॥ 145

సీ॥ బంధురకార్శ్య సంబంధంబె తెల్పు స
ర్వౌషధీశ్వరుఁడను టనృతమగుట
ప్రాచుర్యగతిఁ గృష్ణపక్షంబె(బోధి)ంచు
ఘనకళానిధియను టనృతమగుట
పాంథతనూజాత పాటవంబే(చెప్పు)
హైమకరుఁడను టనృతముగుట
కడిఁగి కళంకంబుఁ గప్పనిరూపించు
నమృతధాముఁడను టనృతమగుట
గీ॥ అకట!యాథార్థ్యమై కానవచ్చునుండ
చతురవాగ్ధోరణీ విలసత్ప్రశస్త

నిపుణత విశేషమహిమ నన్నీరజారి
యందు బుధులెంతు రది యేమియలఘుమతమొ॥ 146

సీ॥ పటుకాయమానాగ్ర జటిలోల్లసిత ఫుల్ల
మల్లికాసుమగళ న్మధురసంబు
మల్లికాసుమగళ న్మకరందపారణ
ప్రీతభృంగాంగనా గీతరవము
ప్రీతభృంగాంగనా గీతసముద్భూత
సహకారకిసలయ సంచయంబు
సహకారకిసలయ సంచయగ్రసన స
త్కలకంఠవర కుహూకారరుతము
గీ॥ తలఁప నేతత్స్థలంబున నిలువకుండ
పరిసరావని నత్యంతబంధుగోత్ర
వేదనాపాదనానూన విలసనముల
నదరుపుట్టింపఁజొచ్చె నేమనఁగవచ్చు॥ 147

వ॥ అని యిత్తెఱంగున మోహవిభ్రాంతచేతస్కుండై పలుకు
చున్న యన్నరవరకుమారశేఖరుం గనుంగొని మృదుమధుర సరసవచ
నరచనా ప్రాచుర్యతిరస్కృతవాచస్పతియగు మంత్రికుమారశేఖరుం
డిట్లనియె, 148

చ॥ "విరహభరోగ్రతాపమున వేఁగఁగ నేల నృపాలచంద్ర! నీ
వరయఁగఁ గామినీజన నవాంబురుహాస్త్రుఁడ వట్లుగాన(ని
న్గరమనురక్తి) గన్న లలనామణి మన్మధచండకాండ ఝ
ర్ఝరితశరీరయై మదుని సొక్కదె నీకు దక్కదే. 149

మ॥ స్థిరచింతాభర మోఁదనేటి కిఁక వాగ్దేవీమనోభర్త త
త్సరసీజేక్షణ నంబుజాలయను దైత్యధ్వంసికింబోలె భా
సురలీలన్ ఘటియించెనీకు నిజ మోక్షోణీశ! వెయ్యేటికీ
పరసప్రాభవులెన్న మీర లహహా! సంకల్పసిద్ధుల్ కదా". 150

క॥ అని తత్కన్యాసందో ర్యకలాల సచిత్తుఁ శత్రుజైత్రుని శశ్వ
ద్వినయాతిశయములొప్పఁగొనిచనఁగా నంత నెదుట నుత్తరలీల

సీ॥ అనుకూలగతిఁ బీచెఁ దనర శీతలగంధ
బంధురోన్నతులొప్ప గంధవహము
కుడిభాగమున నుండి యెడమదిక్కునకేగె
పత్రిశేఖర దుగ్ధపత్రరథము
లల్లనల్లనఁ ద్రోవకడ్డంబుగా వచ్చి
గోమాయువులుచూచె మోములెత్తి
పీన రథస్త్రైణమాణిక్యమయపాణి
వీణకలధ్వనుల్ వినఁగనయ్యె

గీ॥ కలయఁ బల్కెను దగఁ బైడికంటిజోడు
ఇట్టిశుభశకునంబుల కెల్లమి నతుల
హర్షసంభరణప్రాంచ దంతరంగుఁ
డగుచు నవ్వనిఁ గొంత దవ్వరిగి యరిగి. 152

వ॥ అయ్యెడ నయ్యవనీశ్వరవరనందనులు వన్నె మిగిలి మిన్ను దన్ని చెన్నుగల కన్నెపొన్నగున్నలదండ నెన్నికకెక్కు చిన్ని సన్న హొన్నగన్నేరులపై మొల్లంబుగా నల్లిబిల్లిగా నల్లుకొనిన మొల్ల మల్లెవిరిదుమారంపుఁదప్పల నొప్పుగల పొరుగుల నొప్పు గరుగులమరు గులకరిగి ముప్పిరిపెనంగిన యేలకతీఁగెలు గప్పుకొని మొప్పుగుల్కుచు గుప్పుగుప్పునఁ దావులుగుప్పు గొప్ప కప్పురపనంటుల దాఁటఁ బ్రాయని గెంటెనలపజ్జ గుజ్జుగొజ్జంగిపొదరిండ్లనుండి దుమికి బోరున బాజు తెలిమంచునీటికాలువలదరుల విరుల సిరుల నలరుచుఁ జాలుదప్పని బొంకు మల్లియలదండ నండగొని యెడ తెగని నీడలు సేయు దాడినిమ్మలం గూడి పొడిమిగల కొడెనిమ్మల యినుమ్మలఁ గమ్మవాసనలు గుమ్మరిలుచుఁ గొదమతుమ్మెదల సొమ్మసిలం జేయు సంపెంగల చెంగట రంగుమీటిన గేదంగులం బెనంగిన లవంగపుఁదీఁగియల నల్లికొని సోగలై సాగిన

తీఁగెమల్లియలకుఁ బట్టులై కన్పట్టు కలిగొట్టుచెట్టులపై వట్టుమీఱి దట్టంబుగాఁ బ్రాఁకిన బండిగురువిందపందులం బుట్టి పొందుగలిగి పందిరుల కందిన ద్రాక్షలఁ గలయం బెనఁచుకొన్న రుద్రాక్షతీఁగెల కెలననలరు క్రోవుల కేవల రివిమీఱు పూవుతేనియబావుల దీవుల మావుల మావులకుద్దియై పెద్దగాఁ బెరిఁగిన గంగరావులతావులకుఁ దోలంకు కలంకుకొలంకుల పోకమ్రాకుల నల్లిప్రేలు మిరియంపునునుతీఁగె తూఁగుటుయ్యేలల నొయ్యనొయ్యన రేయుం బగలనక యూఁగు రాయంచమొగల మగనాండ్రు నిగనిగని చికిలిరంగు మెఱుంగు బంగరుతెక్కలతుదలం బోడమితురంగళించు సన్నంపుగాడుపుకుఱ్ఱల సాగిపోనీక యీడిగిలంబడఁ జేయు కురువేరుచప్పరమ్ములముంగిళులఁ గుప్పలుగా నొప్పునుప్పాణిముత్తియమ్ములు దొరఁగు ముదురువెదురు హత్తికొని తేటుల తేటలగు పాటల పాటమ్ములైన సుగపొన్నకూటమ్ముల సమీపమ్ములమీఱు పారిజాతమ్ములకు జోడులైయున్న మారేడులకు నీడలై చూపడునల్ల నేరేడుల మొదళ్లనలరారు జగానెలరాలతిన్నెలకనసలదాపునఁ బనసల నెనసిన విరజాదులపాదుల ప్రోవులై పెరిఁగిన సూదిమల్లియలచేరువ గుమురులైన జాజులనీడల మెల్లనఁ జనుచు నా రాజన్యనందనుండు తన చిత్తంబున 153

సీ॥ వరశుకాంగనఁ జేరి సరససల్లాపముల్
రహిఁ జేయు రాజకీరంబుఁ జూచి
అంచకామినిఁ గౌఁగలించి మించిన వేడ్క
హర్షంబునొందు రాయంచఁ జూచి
కలనాద మొనరించి కలరవి కెమ్మోవి
చుంబించు పారావతంబుఁ జూచి
ఘననీలచక్రవాకినిఁ గూడి రతికేళి
గావించు మదరథాంగంబుఁ జూచి

గీ॥ చానకడకేగి సంభాషలువచించి
బిగువుకౌఁగిటఁగదియించి పెదవినొక్కి
రతులఁజెందుటకై చాలమతిఁజెలంగు
రాజచంద్రుండు మోహవిభ్రాంతుఁడగుచు. 154

సీ॥ కాసారములయందుఁ గలువరేకులఁజూచి
యంతరంగంబునఁ జింతనొందు
సొగసైన సువ్వంపుసోగతీఁగెలుచూచి
మానసాబ్జమునందు మగ్నమందు
నునుచ్ఛాయలఁదలిర్చు ననఁటిబోదెలఁజూచి
చిత్తమం దెంతయుఁ దత్తరించు
పోలుపారు గుత్తంపుఁబూవుగుత్తులఁజూచి
స్వాంతంబునందు విభ్రాంతినొందు

తే॥ గీ॥ సుదతి నిమువాలుకన్నులు చూడఁదలఁచి
సింహమధ్యమ బాహువు వీక్షింపఁదలఁచి
కంబుకంధర యూరువుల్ కనఁగఁదలఁచి
చెలువ వలిగుబ్బదోయి దర్శింపఁదలఁచి॥ 155

వ॥ అప్పుడు రాజచంద్రునకు మంత్రిచంద్రుండిట్లనియె, 156

సీ॥ అప్పాలంతిమెఱుంగు గొప్పకీల్కొప్పుక
ప్పంధకారమొనర్చు నంతరిక్షు
ముక్కాంత నవమందహాసాంకురచ్ఛాయ
దిశలందుసాంద్రచంద్రికలనీను
అబ్జాల పదపల్లకారుణద్యుతి పద్మ
రాగకుట్టిమఁజేసె రత్నగర్భ
అకన్య రుచిరదేహప్రభ నికటల
తాదుల భర్మమయంబొనర్చు

తే॥ గీ॥ అదియకనుగొంచు నిఖిలధరాధినాథ
హితవయస్యాళిరోమణుల్ చతురగతుల
నూడిగంబులుసేయంగ నుచితలీల
శోకకుచయున్న లవలీ నికుంజగృహము॥ 157

వ॥ అని తెల్పిచూపుచు సవిధసరోజాతాకరసంజాత కబంధజాతసౌగంధికబంధుర సుగంధానుబంధి గంధవహపరంపరాపరికంపమాన విశాలప్రవాళజాల లాలితంబును, నుపరిప్రదేశ పరస్పరజటిల మల్లికాప్రసూనమంజరీ పుంజనిర్గతానర్గళమధురమనురస వారణపరాయణ విభ్రమద్భ్రమరాంగనాసంగీత కలధ్వానప్రదవమానైణాంకదృషద్వితర్ది కాంచలాంచన్నీర ధారాధారకుల్యా ఘుమంఘుమ నిర్ఘోషానుకారికీరభాషావిశేష యోషామణిజాలవాచాల చిరత్నరత్నమేఖలాలంకృత ఘంటికాతులాకోటి కంకణకింకిణీ కేంకార కోలాహలబహుళంబును, శాంతాశ్రాంతపరిశ్రాంతి విశ్రాంతికరాత్యంత కాంతస్వచ్ఛతరశీతలచ్ఛాయానికాయ్యనికాయంబును, సామీప్యభాగసమావృత చందన కుచందన కృతమాల తమాల మందార మాకంద మధూకాశోకానోకహ నీక వ్యాకోచ కుసుమవిస్మృమర సారసౌరభవిస్తారంబును, అత్యంతరమణీయంబును నగు నక్కుంజ సమీపంబున నిలిచిన, 158

ఉ॥ స్వాంతముపల్లవింప నృపచంద్రుఁడు గన్గొనె గొంచి తన్నికుం
జాంతరిజాలమార్గముల నల్లనఁ గంధరనీల వేణిఁ గ
ర్ణాంతవిలాసనేత్రిఁ గనకాంగిని గంజనిభాస్యఁ గాంచనా
త్యంతమనోజ్ఞనాసఁ గరియానఁ గఠుత్కరిన స్తనద్వయన్ 159
గాంతను గంబుకంఠిఁ గలకంఠకలస్వనఁ గామినీమణిన్.

క॥ కనుగొనినంతనె మనసిజుఁ
డనుపమపికకీరశారికార్భటులొలయన్

నునువాఁడి చికిలికోలల
జననాథవతంసుఁగుండె జల్లనఁ గలఁచెన్. 160

వ॥ అప్పుడు 161

శా॥ రివ్వెన్ వెల్వడు పంక్తిసంతమసకోటిం జిక్కి సీమంతరే
ఖావీథిన్ స్తనదుర్గవర్తియయి వేడ్కన్ హారస్రశ్రేణులన్
వేవే డిగ్గు గభీరనాభిసరసీ నిర్మగ్నయై సన్నుతం
బావక్రోత్పలినంబుఁ జేరు పతిచూపజ్జాక్షిపైఁ బర్వుచోన్. 162

తే॥ కన్యకామణి సకలాంగకములయందు
తిరుగు నృపుచూడ్కి నరికట్టి వరుసనిలుపు
చెఱకుసింగిణిమన్నీఁగు, యిఱుకుబిగువు
గబ్బిచన్గట్లనడిఁద్రోవ గనుమగట్టు. 163

తే॥ మహిళ నెమ్మేన నాపాదమస్తకముగ
నడరి యారోహణావరోహణలఁ దిరిగి
యచలమాస్థితి ననిమిషంబైనదృష్టి
యలవడె మహీంద్రునకు నంత నద్భుతముగ. 164

వ॥ అయ్యెడ నయ్యవనీకాంతుం డంతరంగంబున నక్కురంగన
యన నిట్లని వర్ణింపందొడంగె, 165

క॥ " నరవర విద్యాధర కి
న్నర సుర గంధర్వ యక్ష నాగాంగనలీ
సరసిజపత్రవిలోచన
చరణనఖాంకురముతోడ సరిపోలుదురే. 166

శా॥ మారుం డద్భుతలీల దీని నజుపై మాఱొడ్డి కల్పించెఁగా
కారా! యీ వలిగుబ్బదోయిబిగు వీయందంపుఁగీల్కొప్పుచో
ప్పీరోమావళిపొంక మీ నడబెడం గీతళ్కువాల్కన్నులో
య్యారం బిద్ధరఁ గాకయున్నఁ గలదే యబ్జాక్షులం దెన్నినన్॥ 167

సీ॥ కలకంఠరవ మబ్జకంఠి కంఠము గాఁగ
పల్లవమ్ములు బాల పాదములుగ
కలహంస నిభ రాజగమన యానము గాఁగ
బలుతూండ్లు వనజాక్షి బాహువులుగ
ఘనఘనాఘనము చందనగంధి కొప్పుగ
నక్షత్రములఁ గొమ్మ నఖరములుగ
కరికరంబుల హేమగాత్రి యూరులు గాఁగ
నీరజంబులఁ గాంత నేత్రములుగ
గీ॥ సర్గమొనరించి సహజవైషమ్యగతుల
తలఁచి యన్యోన్యదర్శన స్తంభనముగ
కఠిన కుచశైలముల మధ్యగతముఁ జేసె
చిత్రమాఁగద చతురాస్య శిల్పమహిమ॥ 168

తే॥ అతివ నెమ్మోము పూర్ణసుధాంశుబింబ
మౌటఁ దెలిపెడుఁ బక్వబింబాధరోష్ఠ
ఘనసుధాసారవరహాసకౌముదీవి
రాజితేక్షణ మృగసమాశ్రియుతఁ జేసి॥ 169

ఉ॥ రాజమరాళిపై నెటుల రమ్యతగాంచెనొ తమ్మిదోయి, రం
భాజగతీరుహద్వయముపై నెటులొందెనొ ధాత్రి, మింటిపై
నోజదలిర్ప నెట్లణఁగియుండెనొ కొండలు, పూర్ణతారకా
రాజుపయిన్ ఘనం బెటులరంజిలెనో కడునక్కజంబుగన్. 170

క॥ మృగశాబాయతలోచన
జిగినిబ్బర పుబ్బుగబ్బి సిబ్బెపుగుబ్బల్
పొగరణఁచఁబోలు నిత్యం
బగణితముగఁ జెండ్ల గిండ్ల నరులన్ గిరులన్. 171

ఉ॥ కీరముగా మృదూక్తి, నును కెంపుజిగిం దగు మోవి సత్సుధా
పారముగా, మనోజ్ఞ ఘనసారముగా తెలిలేఁతనవ్వు, పా ...

టీరముగా తనూసురభి తీవెదనర్పెడికొప్పు బంభరీ
వారముగా లతాంగిపరివారముగా పుష్పాళి గన్గొనెన్ 172
క॥ తాళముచనుగవ మత్తతు। రాళము యానంబు గోమతాజి వినీల
వ్యాళము బాహుయుగంబు మృ। ణాళము హా సిద్ధమెన్న నారీమణికిన్
చ॥ అరుణమణిప్రవాళసురపాశ్మ సుమౌక్తికవజ్రరత్నముల్
బరువడిఁగూర్చి చిత్రముగఁ బాదరదాంశుకకేశదంతసం
దరనఖముల్ రచించి తగఁ దత్క్రియఁ జేయఁడుగా విరించి యీ
సరసిజనేత్రిచిత్తము విచారమొనర్చి మదిం దలంచినన్ 174
సీ॥ కమ్మపూఁదేనియకాల్వలై పాఱదే
కల్కి తియ్యనిపల్కు పల్కెనేని
చెలువారు పండువెన్నెల తేట నిండదే
జవ్వని లేనవ్వు నవ్వెనేని
వెలిదమ్మివిరివాన వెలయ కురియదే
సుందరి కన్నెత్తి చూచెనేని
డాల్తైన నునుకెంపురాలు రాలుగావె
పడఁతి రెండడుగులు నడచెనేని
గీ॥ చారుతరసార ఘనసారసౌరభంబు
పొలయదే కొమ్మ యూరుపుచ్చెనేని
వితతముగ దీని నతులితగతులంతులఁ
గలయఁగలుగుట బహుజన్మఫలము గాదె 175
ఉ॥ ఈరమణీలలామ నను నెంతయుఁ గూరిమి పిక్కటిల్లఁగాఁ
దారపుగబ్బిగుబ్బచనుదోయి యెదం గదియంగఁ గౌఁగిటన్
జేరిచి తేటతేనియలు చిప్పిలఁ దీయనిమోవివిందు పెం
పారఁగఁ జేసి నవ్యమధురాంచిత భాషలగారవించి వి
స్ఫారమనోజకేళికిని బాల్పడఁజేసిన సౌఖ్యమెట్టిదో,, 176
కం॥ అని యువ్విళ్లూరెడి నృప

తినిగనుగొని హితుఁడుపల్కె, ,,దేవర! యోఁజె
ప్పినవార్త నిజముగాదే
నను నచటికి నింకఁ బంపు నయ ముప్పొంగన్ 177

క॥ కామినినత్కులనామము । తే మునివాసస్థలంబ దెచ్చటనోతా ।
నేమినిమిత్తంబివ్వన । భూమిన్ వసియించినదియొ పోలఁతులుగొల్వన్

వ॥ అత్యంత నిగూఢక్రీడాప్రవర్తితోదారలగు రాజన్యశుద్ధాంతకాంతాజనంబులకడకు మిముబోటిమహానుభావు లప్రియత్నంబునం జనుదెంచుట గౌరవశ్రీప్రాతికూల్యంబుగావున వారలవృత్తాంతం బెఱింగి వచ్చెద, 178

చం॥ అనవుడు భూమిపాలకశశాంకుఁడు మిత్రునితోడఁ బల్కె "మ
జ్జనకుఁడు తొల్లి నీ తుహినశైలసమీపవనాంతరంబునన్
వనజముఖీసహస్రము లవారణవైభవలీలఁగొల్వఁగా
ఘనధరనీలవేణి వరవర్ణిని యోతుఁ వసించి ప్రేమచేన్ 179

వ॥ భవత్సంబంధంబునకై యపారమోహాతిరేకంబున దినంబులుగడపుచున్నది, మృగవ్యసనవ్యాఖేలనవ్యాయామంబునంజని వసంతదినాంతరంబుల నవ్వరారోహంగని వివాహంబుగమ్మనిపల్కెఁ గావున నిక్కురంగనయనమదీయజనకుం డెఱింగించినకన్యకామణియగుటఁబోలు నీహిమవన్మహీధరప్రాంతోద్యానాంతరంబునఁ గాంతాజనసమేతయై వసంతదినంబుల మత్సమాగమంబున కెదురుచూచుచున్నదిగావలయు, నీవు చనితద్వృత్తాంతం బెఱింగిర"మ్మనిపనిచిన, 180

క॥ నగుమొగముతోడ నెచ్చెలి
ముగుదలువసియించు కుంజమునకేగి యటన్
నిగనిగనికలువశారా
జగతిపయిం గూరుచున్న జవ్వనిఁగాంచెన్ 181

వ॥ కాంచి కించిన్మధ్యలు చంచత్కౌతూహలాద్భుతరసాక్రాం(తలగుచునాద)రింప నచ్చట నాసీనుండై యత్యంతగంభీరమృదుమధుర.

చతురవచనరచనల నయ్యాచిరరుచిరుచికిట్లనియె, 182

ఉ॥ "నీలావణ్యకళావిలాసములు వర్ణింపంగరాదేరి కో
బాలా! యెవ్వరిదాన వీవు, దివిషత్పద్మాస్యవో భోగభృ
న్నాళీకేక్షణవో ఖగాంగనవొ గన్ధర్వాబ్జరాగోష్ఠవో
యేలా యివ్వనభూములందిరుగఁ జేరే మేర్పడంజెప్పుమా 183

మ॥ తెలియంజెప్పెద సావధానముగ మద్వృత్తాంతమాలింపు మో
జలజాతాక్షి సముద్రముద్రిత ధరాచక్రావనోద్యద్విలా
స లసద్రాజశిరఃకిరీటఘటితాంచద్రత్నచిత్రప్రభా
కలితోదారపదుండు శంతనుమహాకాంతుం డెసంగున్ భువిన్ 184

చం॥ జనకుఁ డహో ప్రదీపుఁడఁట, చారుకళానిధి సారసారిత
ద్ఘనతరవంశకర్తయఁట, కంధిచతుష్టయవేష్టితాఖిలా
వనితలపాలనోజ్జ్వల నృవల్లభరత్నచయంబు సత్సహా
జ్జనఁమట, భోగభాగ్యముల శంతనుఁబోలుదు రెవ్వ రంగనా! 185

తే॥ అమ్మహారాజు నన్ను సత్యాదరమున
తనదు మంత్రులలోపల ఘనతఁ బ్రోచు
అతనితోడుత సఖ్యసౌఖ్యానుభూతి
నిచ్ఛయించిన నొందింతు నేరికైన 186

క॥ పేరు విశారదుఁడందురు। సారసదళనేత్రి! రాజచంద్రుఁడు మృగయా
దారమతి వనికి రాఁగా। వారక నేనతని వెంటవచ్చితిఁ బేర్మిన్"॥ 187

వ॥ అని తెల్పిన, 188

తే॥ మానసము జల్లుమనియె, నెమ్మేనఁబులక
పాళి మొనచూపెఁ, గోర్కులు ప్రబలమయ్యె
గాఢకౌతూహలానురాగమ్ము లొదవె
శంతనునివార్త చెవిసోఁకినంత సతికి 189

• మంత్రితోడఁ జెలికత్తె గంగవృత్తాంతము దెలుపుట •

తే॥ అట్లు బద్ధానురాగయై యంబుజాక్షి

హాసమందాక్షయుత వీక్షణాంచలమునఁ
దనసఖీమణిఁ జూడఁ దద్భావ మెఱిఁగి
సరసలీలల నాప్రౌఢసకియ పలికె 190

సీ॥ శ్రీరమాపతి యైన నారాయణస్వామి
పదపద్మసీమ సంభవముగాంచె
సకలమంగళదివ్యసౌభాగ్యములమీఱు
త్రైలోక్యములయందుఁ దగ వసించె
యమునాసరస్వతీప్రముఖతరంగిణీ
తతులలోపలఁ బెద్దతనముగాంచె
వర్ణనీయ ప్రాణివర్గపావనభవ్య
సరసకళా మహోజ్జ్వలత గాంచె
గంగయనుపేరఁ బరఁగునీ కమలవదన
పరఁగ నేమెల్ల నిక్కన్న ప్రాణసఖుల
నొకమహాకారణముగల్గియుండవలసె
సింధువునకిట్టు లివ్వసీమయందు 191

చ॥ కువలయపాలమిత్ర! విను గోప్యము సేయఁగనేల సజ్జనో
త్సవవిలసచ్చరిత్రుఁడగు శంతనురాణ్మణి సద్గుణప్రభా
నివహము తద్గురుండు నయనిర్మలభాషలఁ దెల్ప నీగతిఁ
శ్రవణరసాయనంబుగ ససంభ్రమతన్ విని మోహితాత్మయై 192

సీ॥ అశ్రాంతసరవకాశాగతాంభశ్చర
ధ్వజకాండవర్షసంతతులఁ దడిసి
అకలంకసాంద్రచంద్రాతపద్యోతమా
నాతపానర్గళవ్యాప్తినొంది
గంధగోత్రాధరాగమ సుశీతలగంధ
వాహంబుచల్లు బల్వడలఁ గంది
విస్ఫూర్జితాక్షుద్రవిరహసంభూత సు
సిరపరితాపంబుచేఁ గ్రాఁగి

తపము సేయుచున్నది నృపతిఁగూర్చి
శంతనునిరాక దెల్పితి సరవి వీరి
కిరుపురకుఁగూర్ప నీకన్న నెవ్వరింక
మంజువాగ్దేవతాచార్య! మంత్రివర్య!" 193

క॥ నావుడుమంత్రిసుతుండను "దైవాజ్ఞను రాజమణికిఁదరుణీమణికిన్
భావింపఁగననుకూలం శ్రీవిభవముగల్గు వేదసిద్ధాంతముగన్ 194

వ॥ కావున, 195

క॥ శంతనుభూకాంతునకున్ గాంతామణివార్తదెలిపి కౌతూహలసం
క్రాంతాత్మునిఁగాఁ జేసిట కెంతయుఁదూర్ణమునఁదెత్తునీక్షింపుఁడొగిన్

వ॥ పోయివచ్చెద" నని పలికి వారిచేత ననుజ్ఞవడసి శంతనుభూ
కాంతుకడకుంజని కాంతావృత్తాంతంబంతయు విన్నవించిన, 197

తే॥ పులకితతి మేనఁ బొడమెఁ, గపోలయుగళి
చికిలియొనరిచె. లేనవ్వుసిరివహించె
వదన, మనురాగసంపూర్తిఁ బొదలె హృదయ
మతివవృత్తాంత మాలించినంతఁ బతికి 198

వ॥ ఇట్లద్భుతానురాగజలధినిర్మగ్నమానసుండైన మానవేం
ద్రునింగనుంగొని, 199

క॥ మానరసపానభృంగి
గానధ్యానము లనూనగతులఁ దనరఁ బెం
పూనిన పొదరింటికిఁజన
మానినివీక్షణముచేసె మానవతిలకున్ 200

సీ॥ అకలంకలావణ్య సుకుమారలలితాంగ
లతికకు మిగులఁ జల్లదనమబ్బె
భువనైకమోహనాద్భుతవిలోకేక్షణ
కైరవంబులకు వైకాస్య మొదవె
స్వచ్ఛతరాఖండసాంద్రీభవత్కౌతు
కోల్లోలజలరాశి వెల్లివిరిసె

సతతప్రతీక్షణజాయమానప్రచిం
తాసముదాయాంధతమము దొలఁగ

గీ॥ సురతరాంతఃపరిపూర్ణ వియోగజనిత
తతపరిశ్రమభూరిసంతాపమణఁగ
చంద్రవంశాబ్ధిసంపూర్ణచంద్రరాజ
చంద్రసందర్శనంబునఁ జారుముఖికి॥ 201

క॥ తరుణీమణిచూపు మహీ
శ్వరుచూ పనన్యోన్యధైర్యసంపద లహహా!
హరియించెఁ జికిలియొనరిచి
సరసీజాంబకుఁడుపఱుపు సరిగోలలకున్॥ 202

వ॥ అయ్యెడ, 203

చ॥ కలికిమిటారి వాల్కులుకుకన్నులఁగమ్మొదుసిగ్గుపెంపునన్
లలనమొగంబు వాంచి పదలగ్నమణీకటకోదయద్ఘళం
ఘళమధురాయతార్భటుల సంచల దంచితమధ్యకీలిత
జ్వాలరశనోరుకంకణభవ స్ఫుటరావము లైక్యమై తగన్॥ 204

తే॥ లేచి కుచకుంభభరమున లేఁతకౌను
వడఁక శశికాంతవేది నింపడరఁ గదలి
సఖులతోడ నికుంజము చాటుకరిగె
మేఘతతిమాటుకరిగెడి మెఱుపనంగ 205

సీ॥ నిలంపురాకప్పు మేలుమేలననొప్పు
విప్పైన గొప్ప కీల్కొప్పుచొప్పు
కొదమసింగముతీరు నదలింపఁగాఁగోరు
కలికి లేఁతమెఱుంగు కౌనుసౌరు
ఇసుకతిప్పలఁ గ్రిందువేసిచేసి రహించు
సుందరంబైన పిఱుందుపొందు
పసిడియుంచులఁ జిక్కపఱుపఁగాఁ దగ నిక్క
డంబైన మందయానంబు టెక్కు

మానినీమణిసోదరింటిమాటుకరుగ
నరసిజాక్షులతో నట మరలునప్పు
డవనిపాలేంద్రు మానసాబ్జాంతరాళ
మతులమోహాతిశయమున నలరఁ జేసె॥ 206

వ॥ ఇట్లు నికుంజంబుమాటున నిల్చి తదీయరంధ్రంబుల రాజకుమారమన్మథుం గనుంగొని యొక్క ప్రౌఢయగు ననుఁగుచెలితో నిట్లనియె, 207

క॥ "కంతునిజూడమొ రజనీ
కాంతు వసంతుని జయంతుఁ గనుగొనమో యో
కాంతామణి! యీవసుధా
కాంతునిబోలుదురెరూపగౌరవలీలన్॥ 208

చ॥ సకియరో! యీనృపోత్తముని చక్కదనంబు విలాసవైభవం
బకుటిలలీలఁగన్న లలితాంగుల నిబ్బరపుబ్బుగబ్బిగు
బ్బకవలమధ్యరంగముల బంగరుగేదఁగిపువ్వుఁదేకు మేల్
చికిలికటారిచేగుదిఁ గచిక్కనగ్రుమ్మఁగ మారుఁ డుగ్రుఁడై॥ 209

తే॥ ఇతనిఁ గౌఁగిటఁ జేర్చి పెంపెసఁగఁ గ్రోవి
విందుగాఁగొని రతికేళి నొందనట్టి
వనిత తారుణ్యలావణ్యవైభవములు
అడవిఁగాసినవెన్నెలతోటగాదె 210

సీ॥ పికవాణులకుఁ జాలఁ బ్రియముపుట్టింపదే
యతివ! యీతని పల్లవాధరంబు
కువలయాక్షుల కెదఁ గోర్కెనొందింపదే
సుందరి! యితని పూర్ణేందువదన
మబ్జాతముఖులకు నాసగల్పింపదే
తెఱవ! యీతని సూర్యదీప్తిమహిమ
సారంగకచల నోరూరంగఁ జేయదే
వనిత! యీతని మధువాక్యరచన

సుదతి! యీతనిచైత్రభాసురవిలాస
మోట్రిలతికూనలకునైన నెలమిపుట్టఁ
జేయుదే" యని యాశ్చర్యసింధుమగ్న
మానసాంబుజయై పల్కె మఱియు సఖికి 211

మ॥ చిరకాలంబుననుండి యీతని మదిం జింతించి చింతించి స
ద్వరహప్రాకట వేదనాభరమునన్ వేఁగంగ నిన్నాళ్ళకి
ధరణీనాథకులావతంసు నిటకున్ సల్లీలఁ దోడ్తెచ్చె నీ
శ్వరుఁ డత్యంతదృఢానురాగమగు మత్సంకల్ప మీడేర్పఁగన్ 212

వ॥ అనివర్ణించుచుండ నప్పుడు, 213

శంతనుమహారాజునకు నారాయణమూర్తి ప్రత్యక్షమగుట

సీ॥ కమలాద్యలంకారకలితంబులై భుజాం
తర నేత్రములు మనోహరత మెఱయ
ఘనసువర్ణాంచత్ప్రకాశమానంబులై
నేత్రగాత్రములు వన్నియఁ జెలంగ
ప్రస్ఫురద్ద్విజరాజరాజమానంబులై
ధ్వజవదనంబులు తనరుచుండ
మంజుతరానంతమణిసుందరంబులై
కోటీరదీప్తులు కొమరుమిగుల
గీ॥ అపుడు ప్రత్యక్షమయ్యె నారాయణుండు
చంద్రవంశాబ్ధిసంపూర్ణచంద్రు నెదుట
అమలశతకోటికోటిజన్మాంతరార్జి
తాతివిస్తరసుకృతమాహాత్మ్యమునను॥ 214

తే॥ అట్లుసాక్షాత్కరించిన యాదిదేవు
భక్తవత్సలు నిందిరాప్రాణనాథుఁ
గాంచి పులకితగాత్రుఁడై కౌతుకాద్భు
తాతిశయములువొడమ సాష్టాంగమెరఁగి॥ 215

వ॥ లేచి ముకుళితకరకమలకలితలలితఫాలభాగుండై యిట్లని స్తుతియించె, 216

దండకము॥ శ్రీభామినీ భూమి నీళా సువృత్త స్తనన్యస్త కస్తూరికాపత్రగుచ్ఛాంకితోద్యద్భుజామధ్యమధ్యాసనాసీన ఖద్యోతకోటిద్యుతి ప్రస్ఫురత్కౌస్తుభాంచన్మణీహార! నీహారగోచిఃకళాశేఖ రాంభోజగర్భామరేంద్రాశ్రయా శాగ్రజా తామిషా శ్వబ్ధిరా జానిలేశానమిత్రాది గీర్వాణకోటీరకోటీస్ఫురత్పద్మరాగ ప్రభా రాజినీరాజితశ్రీభాజితామేయరాజీవ రాజీవవిద్విడ్ధ్వజా బ్జారిరేఖా సమాలంకృతాంఘ్రిద్వయీభాసమానా సమాన ప్రభావాన్వితానంతకల్యాణగంభీరశుంభద్గుణాధార! యాధారచక్రా ద్యశేషోల్లసచ్చక్ర లీలాక్రమారూఢపంచానిలాకర్షణోద్యత్త్రికూటహేతుజాలంధరోడ్యాణమూలాఖ్యబంధానుసంధాన ధౌరేయతాకించి దుత్తంభితాచ్ఛాదితా యుగ్మకీభవత్తార కాద్వంద్వసందర్శితా భంగశృంగాట కాంతస్థలాభోగయోగీంద్రసంప్రాప్యమాన స్వయంభూతభాస్వచ్చిదానందరూపా! శరత్కుందకుందా రవిందారి బృందారకానేకపా నోకహానీక నాకాపగా దందశూకేశ కాశ ప్రతీకాశకీర్తిచ్ఛటాచ్ఛచ్ఛవిచ్ఛన్న నానాదిగంతా! ముకుందాచ్యుతానంత! తాపత్రయాంభోజ కాంతార హేమంత! దేవాదిదేవా! మహాదేవ! నీ దివ్యమాహావిలాసప్రభావంబు భావంబునన్ నిల్పి వర్ణింపఁగా శేషభాషావధూటీపతుల్ చాలలేమన్న చో నేను వర్ణింపశక్తుండనే, యొక్కమాఱెక్కువా వొక్కవుం డెక్కునం బాలవెల్లందుఁజెల్వొందు నా తెల్లదీవిన్ వికుంఠాభిధానప్రధానస్ఫురత్పట్టణాంతస్థితానంతభోగీశ్వరాభోగభోగాంచితా నల్పతల్పాగ్రభాగంబునం బద్మసద్మానుకూలక్రియారూఢకేళిన్ వినోదింపవే, యొక్కమాఱుక్కునం జక్రిలోకంబునందుండి దంభోళికోట్యుల్లస ద్ఘోరసారాతిశాతోరుధారాకరాళోగ్రచక్రంబునం జక్రవిద్వేషులన్ భీషణాయోధనోర్విన్ సముద్దండతన్ మించి ఖండింపవే, యొక్కమాఱుగ్రకాంతారదేశంబుల

దుద్యదధ్యాత్మవిద్యాన వద్యోద్యమాభేద్యహృద్యోల్ల సద్యోగిరాణ్మా
నసాపారకాసారసంచారహంసావతంసంబవై మీఱువే, వాసుదేవా!
భవానీనుతా! గ్రచ్చరన్ మచ్చరూ పుచ్చమై పొచ్చెముల్ లేకపోఁ
పంగనాలచ్చినింగన్న యిల్వొచ్చి యామ్నాయపాటచ్చరుం జెచ్చెరన్
వ్రచ్చి ప్రాబల్క్యలం గ్రమ్మఱం దెచ్చి పెంపెచ్చ మేల్పచ్చనిన్ తక్క
నిద్రాహుమూ తేజవై నేగు బల్వెల్గు లో మెచ్చఁగా మచ్చికన్ వేగమం
దిచ్చితీవేకదా, పక్షిరాడ్వాహనా! మోక్షసంధాయకా! పోత్రిరూపంబు
చిత్రంబుగాఁదాల్చి ధాత్రీస్థలిం జక్కఁగాఁ జేసి హేమాక్షరక్షోగణాధ్య
క్షుఁ గల్పక్షయాక్షీణతీక్ష్ణాంశుశుక్షుణ్యఖండస్ఫులింగాతిభాస్వత్కరోరో
గ్రదంష్ట్రాగ్రభాగంబునం గ్రుమ్మి తీవేకదా, మాధవా! నందిగోమా
ధవా! జంభభిద్ఘోరదంభోళిగంభీరసంరంభముం బాపి యా కీలికీలా
కలాపంబు నిర్మూలముం జేసి దండిన్ మహోద్దండతన్ జెండి రక్షోధి
నాథున్ వశత్వాస్యునిం జేసి కంధీశు దర్పాంధమున్ బంధురప్రౌఢి వారిం
చి గాలిన్ విపాలించి యక్షేశు భిక్షేశుఁగావించి గంగాధరున్ భంగ
ముం జేసి యేదిక్కునం దానయై వేఁడిమిన్ మూఁడులోకంబులున్
వీఁకఁ జీకాకుగావించి హాలారసాసూన పానక్రియాలోలలీలాత్మకత్వం
బునన్ మంత్రముల్ తంత్రముల్ శైలముల్ వేదముల్ వాదముల్
గాలియుం గీలియుం దానె బ్రహ్మాహమంచుం గరాళించు నా జాళు
వారక్కసుం డెక్కుమాన్పంగ మున్నాపు పేరుక్కునం జొక్కమా
యుక్కగంబంబు కల్పక్షయానల్పకేళీవిహారోల్లస ద్భైరవాఖండహుం
కారగర్జార్భటీధాటికామ్రేడితప్రస్ఫురత్త్రస్భుజాఘౌకమానోగ్రఘక్కాతి
ఘంఘంఘమంఘంఘమధ్వానభీమంబుగా వీఁక ఘెల్ఘెల్లునన్ వ్రీల శశ్వన్మ
హావిశ్వవిశ్వంభరా భారధౌరేయకుంభీంద్రకుంభీన సాంభశ్చరాముల్
వడిన్ గ్రుగ్గి ముల్లోకముల్ హల్లకల్లోలముం జెంద బ్రహ్మాండభాం
డంబు (ఘూర్ణిల్లఁ) గల్పాంతవేళాసముద్దండచండప్రభామండలాఖండ
చండాంశుఫాలాక్షపిక్షాంశుశుక్షుణ్యమోఘజ్వలజ్జ్వాలికా మాలికాద్వా

దశద్వాదశాత్మాతినిర్నిద్రరౌద్రక్రమోద్రేకతాత్క్షుద్రసద్వీరభద్రార్జునా
ఖర్వఘోరం బహార్యంబుగా వేగఁగన్పట్టు శ్రీనారసింహాకృతిం
బుట్టి ప్రహ్లాదు నాహ్లాదుఁగాఁజేసి యుగ్రాంశు జాగ్రన్నఖాగ్రంబులం
దన్మహాబాదగ్రవక్షఃకవాటంబు విక్షోభ మొందించి తీవేకదా, లోక
రక్షామణీ! దేవచూడామణీ! వేల్పురాతల్లికిం బట్టివై గుట్టునం బొట్టి
రూపంబునం బుట్టి బల్గట్టులం జట్టుపల్గొట్టిన ట్టెక్కుడుం బుట్టి చేపట్టి నేకం
టినేకంటినామింటిపాళీలు గెంటించి యొప్పారు బల్దంటకుం జంటయౌ తమ్మి
లోగింటివాల్గంటితో నంటు కానిం హరిం దమ్మికంటిం దగం మంటినం
చెంతయుం గొంటు దైత్యుండు వే పంటముత్తైదువం మూఁడుపాదం
బులీయంగ మిన్నంటి వానిం నిమేషంబులోఁ గంటివిన్కల్ దువాళిం
చుచో టంటఁగాఁ ద్రొక్కి పెన్త్రోవలునః వింటిజాల్గంటి వీవేకదా, నీల
జీమూతధామా! పవిత్రైకనామా! మహోద్దామ! భీమాహవక్షో
ణీ దోర్దండదంభోళి శుంభత్కఠోరాతిభాస్వత్కుఠారోగ్ర
ధారాహతిం గార్తవీర్యాది నానాజనాధీశ్వరశ్రేణి ముయ్యేడుమాఱుల్
ధరం గూల్చి సప్తాబ్ధిరాణ్ముద్రితాఖండసర్వంసహామండలం బంతయుం
గశ్యపబ్రహ్మకుం యాగకాలంబునం దానమిచ్చెల్లలోకంబులం
భార్గవఖ్యాతిచే మీఱితీవేకదా, పద్మపత్రేక్షణా! భక్తచింతామణీ!
సూర్యవంశంబునందుం దశస్యందనక్షోణిభృన్మౌళికిం రామచంద్రుండ
వై పుట్టి మర్త్యాది నానాలసత్ప్రాణిదేహాంతరావిర్భవద్రక్తసిక్తాసిభాస్వద్గ
దాఖేటకం దాటకం గూల్చి గాధేయుయాగంబు వేగంబునం గాచి
పాదాంబుజాతాగ్రరాజత్పరాగంబునం గంటివాల్గల్గు వాచంయమి
శ్రేష్ఠునిల్నిల్పి ఖండేందుకోటీరకోదండదండప్రభగ్నప్రచండార్భటీకంపిత
శ్వేతభూభృన్మణీకందరాలోలశైలాధిరాట్కన్యకాలింగనాభంగసౌఖ్యా
నుషంగంబునం దివ్యగంగోత్తమాంగుం బ్రహృష్టాంతరంగత్వ మొం
దించి సీతం మహీజాతఁ ద్రైలోక్యమాతం లసత్కుంతలశ్రేణి
బల్కొత్తము త్తెంపుబ్రాల్నించి చేపట్టి మార్గంబునం భార్గవుం నిర్గ

తానర్గళాఖర్వగర్వోద్ధతుం జేసి పెత్తండ్రి పంపంగఁ దమ్ముండునున్ భార్యయుం దోడరాఁ జండవేదండకాండద్వీపిద్గండభేరుండశుండాలభిన్నాండలోద్యన్మహాదండకానామకోగ్రాటవీవాటి వర్తింపుచున్ సాధులోకాపరాధుల్ విరాధుల్ నశక్షోణిపాల్చేసి మౌనివ్రజద్వేషణుల్ దూషణుల్ భీషణోష్ణప్రకాండంబులం గూల్చి మాయాఖురుండౌ ఖరుం జంపి జాళ్వామృకంబై భ్రమింపంగ మారీచునిన్ నిచుసింద్రుంచి వాలిం గరోన్మ్రాలితాహార్యపాళిన్ మహాశౌర్యశాలిన్ సమిద్భాగమందొక్కకోలన్ పడంగూల్చి సుగ్రీవు భాస్వన్మణీహారవిభ్రాజితగ్రీవుఁ గిష్కింధకుం బట్టముంగట్టి గోపుచ్ఛకీశాచ్ఛభల్లూకముఖ్యుల్ డబ్బదిన్ రెండువెల్వాల్ తగంగొల్వ మాద్యద్గిలోద్యత్తిమిగ్రాహవారససాప్రమాట్కళీరీధులీవ్యాళభేకీశలీసంకులోత్తాల నయూర్మిమాలిన్ శరాగ్రమ్మునం దాణిముత్తెంబుగా నిల్పు దుర్వారయుష్మద్వచోహేతుతన్ సేతువుంగట్టి పేకుంభకర్ణాతికాయేంద్రజిత్కాయకీలాలధారాప్రవాహంబునన్ శాకినీఢాకినీభూతభేతాళకూశ్మాండకబ్రహ్మరక్షఃపిశాచాళికం బ్రీతిగా నామెతల్ వెట్టి త్రైలోక్యవిద్రావణున్ రావణున్ వీకసంక్రందనస్యందనం బెక్కి విరోద్ధతిన్ ముట్టి సంగ్రామరంగస్థలీనాట్యకృద్భద్రకాళిం దదుద్యచ్ఛిరఃకందుకక్రీడ వాటింపఁగాఁ జేసి యాచంద్రతారార్కమౌనట్లు లంకాపురాధీశుఁగాఁ బంక్తికంఠానుజున్ నిల్పి సీతామహాదేవితోఁ గూడ సాకేతముం జేరి పట్టాభిరాముండవై తీవ కావే, భుజంగేంద్రశాయీ! మహాభోగదాయీ! ప్రలంబాదిదుష్టాసురశ్రేణులం గూల్చి కాళింది భేదించి బల్నాగటన్ హస్తినాపట్టణం బుగ్గలిలం బెకల్పెల్లలోకంబులన్ రేవతీవల్లభఖ్యాతిచెమ్మాఱ తీవేకదా, కేశవా! భుక్తిముక్తిప్రదా! వృష్ణివంశంబునన్ శంఖచక్రాదిపంచాయుధోద్యద్భుజాద్వంద్వయుగ్మంబునం బీతకౌశేయముం దాల్చి వ్రేపల్లెలో గొల్లలెల్లన్ సముల్లాసమొందంగ బాల్యక్రియన్ మీఱుచున్ వింత బాలింతరాకాసి పాలిండ్లపాల్ద్రావి బల్దండమై బండపై మెల్లనే చిన్నిపాదాబ్జ

ముల్ మోపి చక్రానిలాదిత్యవిద్వేషికంఠంబునన్ లాలియూఁగింపుమీఁ
అంగఁ గౌమారకక్రీడలం గాళియాభోగభోగాగ్రభాగంబునన్ మంజు
మంజీరశింజానినాదమ్ము లొక్కుమ్మడిన్ సందడుల్ సేయ నానందనా
ట్యంబుగావించి లీలన్ శరత్పూర్ణరాకానిశావేళలన్ నిండుజాబిల్లి
యుద్దండతం బండు రేయెండ బ్రహ్మాండభాండంబునిండారఁ దండోపతం
డంబుగాఁగాయఁ బొచ్చెంబులే నచ్చుపుం బచ్చికల్గల్గు బల్తావులన్ మేపు
చున్ వేడ్కఁ బృందావనారణ్యభాగ ప్రభాస్వత్కళిందాత్మజాతీరవి
స్ఫారవానీరవాసంతికామల్లికా వల్లికా కుంజపుంజాంతరాళోల్లసత్స్వ
చ్ఛసుచ్ఛాయలన్ వేణురంధ్రంబులన్ వల్లవస్త్రీప్రశస్తోరుహస్తాంగుళీ
సంచయాందోళ విన్యాసనైపుణ్యలీలాగతిన్ మంద్రతారోల్లసన్మధ్యమ
వ్యాప్తి లొప్పార సప్తస్వరస్ఫాయదానందకందంబుగా బ్రహ్మగాంధ
ర్వగానంబు సేయంగ నాలించి యామల్ మఱందుల్ సుతుల్ భ్రాత
లున్ దాతలున్ వల్లభుల్ తల్లులుం దండ్రులున్ సారె వారింపఁగా
కొక చెంగల్వసెజావళీచుద్ధతం దియ్యఖాణాహులుమాఖుత్తులాణంబుహా
సిన్ దువాళించు సంపంగిపూహొస్కళీబంధు తేటన్ మిటారించు
క్రొత్తావి గేదంగినున్మగ్గఖండద్ఘురీనన్ బెరానన్ పడిన్ డున్నిమర్మస
లంబుల్ విదారింప వారింపఁగా రాసమోహంబులన్ మేఖలాదామ
ముల్ పిడఁ గొదిఁగలఘ్లాడఁ దారుణ్యలావణ్యలీలాంగముల్ వాడ బల్
కోరికల్ సారె డెందంబులన్ దూర సిట్టూర్పు లంతంతకున్ మీఱ నిద్దా
జరీరంగుసింగారపుంజీసె చెంగావినున్నయ్యెదల్ జాఱ రాధాసుధా
మంజువాణీముఖానేక పిల్లోల్ల సద్ఘోష యోషామణుల్ చేరరా మీఱి
కొక్కోకశాస్త్రక్రమార్గంబునం దత్సతద్దేశజాతస్వభావేంగితాదుల్
మనోదృష్టి వీక్షించి చెంచద్గతిన్ నాగరేంద్రాణికస్వస్తికానివిషాబ్జాది
బంధంబులన్ సత్కళాస్థానముల్ ముట్టుచుంజుంబనాశేషనర్మోక్తులేపార
మీనధ్వజాయోధనక్రీడలంగూడ గోగోపికాగోపకశ్రేణి బల్లాలవానన్
ధరన్ బ్రమంద గోత్రంబు ఛత్రంబుగా సప్తరాత్రంబులత్యంతసూత్రంబు

నంగేలఁ బైకొత్తి కంసుం ద్రిలోకీనృశంసున్ వడిన్ జంపి వైదర్భికన్యా
దికాంతాలలామాష్టకంబుం బదార్వేలఁ బెండ్లాడి మందాకినీవిస్ఫుటా
ష్టాపదాంభోజ సౌగంధికప్రాంత గంధానిలాందోళికైలా లతామంది
రాళిందమందార మూలస్థలీకాంత చింతామణీ వేదికాసీనగంధర్వ
విద్యాధరద్వంద్వవీణానినాదోల్లసన్నందనోద్యాన వాటీస్ఫురత్పారిజా
తావనిజాతముం దెచ్చి సత్యవధూ కేళికారామువాటిం బ్రతిష్ఠించి దుష్టా
సురాంశోదితానేక రాజన్యవీరావళిన్ జన్యరంగంబులం గూల్చి సర్వం
సహాభారముం బాపి తీవే కదా, సజ్జనాధార! గోవర్ధనోద్ధార! బుద్ధా
కృతిం బౌరనారీశిరోరత్నముల్ భూరిసిద్ధాతిరేకంబునం జేయునోముల్
నివారించి వ్యాఘ్రాసురధ్వంసికిం దేరునున్ సారథిన్ బాణబాణాసనో
ద్యత్తనుత్రాణకంఖాణతూణాదులుం గూర్చి మధ్యాహ్నకాలంబునన్
మూడుపీడల్ నిమేషంబులో భస్మమై పశ్చిమాంభోనిధిన్ రాలఁగాఁ
జేసి తీవే కదా, యచ్యుత! శార్ఙ్గపాణీ! ధరిత్రీస్థలిన్ దుష్టనిచాత్మ
పాషండవర్ణాశ్రమాచార రాహిత్యులన్ మేటఘోటంబుపై నీటుమీ
ఱంగ లంఘించి బాహాగ్రజాగ్రత్స్ఫురత్ఖడ్గధారాహతిం ద్రుంచి కల్యాకృ
తిన్ మీఱితీవే కదా, దేవదేవా! నమస్తే నమస్తే నమః, 217

నాగబంధ చంపకమాలావృత్తము

చ॥ నరహరిరూప! శౌరి! సురనారదసన్నుత! లోకనాయకా!
శరగృహా! గోపవీరవర! సారసహాస! సురాధివాస! భా
స్వరసకలావనిరమణ! బాణమదద్విడ్భూరిసంహా! శ్రీ
హరి! విధిజతకారణమహామహా! యజ్ఞవరాహసుందరా! 218

దోష్ట్యంతకందము

క॥ ప్రాపొప్పఁ బ్రోవుమీ వే! మాపాపముఁ బాపిమమ్ము మాభూమీభా
మాప్రాభవభూమాట్టా! బావవిభృత్ప్రాభవప్రభవ్యప్రేమా! 219

ఏకశబ్దచ్ఛలాంత్యనియమముక్తపదగ్రస్తనిరోష్ఠ్యకందము

క॥ శరఖండిత కుహానాశర!

శరశాయిత లలిత కలశజలరాశిశరా!
శరజాన నార్దదశశర!
శరవేణధరాస్యధరహసన భశితశరా! 220

చలజిహ్వాకందము

క॥ శ్రీరాధాహృదయప్రియ! నారాయణ! లక్షణాఢ్య! నళినదళాక్షా!
క్షీరనిధినిలయ! లక్ష్మీ! ధౌరేయోద్ధార! వరద! దశరథకృష్ణా! 221

అచలసింహాకందము

క॥ మాభూపగోపపాపమ! హాభోగివిహంగపుంగవాంభోవాహా!
బాధవమాభాంగప! వీభావుక గేహభావవిభవాభోగా! 222

మత్తేభకందగర్భసీసము

సీ॥ విజయలక్ష్మీవర! విశ్రుతాగమనుతా! శౌరీ! బిడౌజానుజా! ముకుంద!
విలయకాలానలభీషణోగ్రనృహరీ! లక్ష్మీమహోరస్థలా! రమేశ!
వినయలీలాన్వితా! విప్రవర్ణిత! హరీ! నారాయణోద్యద్గుణా! మహాత్మ!
విభయదానాశరవిక్రమక్రమనగా! బ్రహ్మాండభాండోదరా! రమేశ!
హరివరశయాన! కేశవ! గరుడగమన!
జలజనయన! శంధిభవన! శంకరసఖ!
శరధరనిభభాస్వరదేహ! సరసవిభవ!
కుజనగణహరణామేయ! వృజిననాశ! ” 223

క॥ అని సుస్థిరభావంబున। వినుతించుమహీతలేంద్రు వినయవివేకా
ద్యనవద్యగుణము లెన్నుచ। వనజాక్షుఁడువల్కె మధురవాచాప్రౌఢిన్

మ॥ “జగతీనాథకులావతంస! వినుమా చక్రక్షమాభృన్మణీ!
జగతీచక్రములోపలన్ గత భవిష్య ద్వర్తమానంబులన్
దగ నిన్ బోలినభూమిపాలకుఁడు తథ్యం బెన్నఁగా లేఁడు, నీ
సుగుణప్రాభవవైభవాదులు మహాచోద్యంబు పుట్టించెడిన్॥ 225

వ॥ అదియునుంగాక శారదఘన మారదమన పారద ఘనసార
శర క్షీర సురాహార ధరాధారఫణ శ్వేతఘృణి శ్వేతధుని గోతరుణీ

తృణీకరణనిపుణాఖండపాండురయశోమండలమండితుండవు, నిజభుజాత్యుగ్రజాగ్రన్మండలాగ్రధారావిఖండిత విమతసర్వసామంతమండలాఖండలప్రకాండకాండభృద్వాహనహారిద్వేదండ శుండాదండసముద్దండభుజాదండఖండమణికుండలఘృణిగండలలితోత్తమాంగుండవు, నలరాజ రాజరాజకుమార రాజరాజకుమార కుమార విష్ణుకుమార జిష్ణుకుమార వసంత నాసత్య సత్యసౌందర్యరేఖావిరాజితుండవు, సురభి సురధరణీరుహవర మణితిలక కలశజలనిధి జలధర బలి శిబిమనుజవరారోహణధరాధర నిర్భరవితరణపరాయణుండవు, నట్లగుట భవత్సమాగమంబు చింతింపుచుఁ జిరకాలంబుననుండి యువ్వనాంతరంబున సఖీజనసమేతయై మదీయకన్యకాశిరోమణియగు గంగ వసియించియున్నది. నీ వవ్వరారోహం బాణిగ్రహణంబు సేసికొనవలయు, నెల్లి శుభముహూర్తంబు, ప్రాలేయశైలోపకంఠంబున విశ్వకర్మచే నొక్కపురంబు చేయించెద, యుష్మద్బంధుమిత్రామాత్యపురోహితసామంతాదులఁ బిలువంబంపు" మని తత్క్షణంబ చతుర్దశభువనకల్పనానల్పశిల్పకళాధౌరేయుండగు విశ్వకర్మం బంచిన నొక్కపురంబు గావించె, 226

సీ॥ ఎచ్చోటఁజూచిన నింద్రనీలచ్ఛటా
చకచకల్గల తుంగసౌధతతులె
ఏవంకఁగనుగొన్న వైడూర్యకోపల
గోమేధికాంచిత కుట్టిమములె
ఏచాయఁజూచిన హీరమణివ్రాత
దీపితకమనీయగోపురములె
ఏమూలనరసినఁ జామీకర స్తంభ
దేదీప్యమాన మందిరచయములె
ఎచటఁబోడఁగన్నఁ గురువిందఖచితరుచిర
మంటపంబులె, యెటఁగన్న మహితగంధ

బంధురాభ్రంకషద్రుమోపవనతతులె
భాసురంబైనయట్టి యప్పట్టణమున 227

సీ॥ కాంచనభూమిభృత్కల్పనాప్రాచుర్య చాతుర్యసందర్భసరణినొసరి
భీషణాపారగంభీరజృంభిత వారిరాశివిధాయకప్రౌఢిమఁ దగి
కల్పకసంతానకలితసంక్రందనారామకరస్ఫూర్తిరహింవహించి
రాజమానోత్తుంగరమణీయవైజయంతక రచనాచమత్కారమొంది
మొనసి కంజాతసంజాతమూర్తి వేడ్కఁ
జేసెఁగాఁబోలుఁ దన హస్తశిల్పిమహిమ
జనులకెఱిఁగింపనన నొప్పె సాలఖేయ
భాసురోద్యానవరహర్మ్యపంక్తులచట॥ 228

సీ॥ సానఁబట్టిన సూనశరునిశస్త్రంబులో
పొలుపొందురతనంపు బొమ్మలొకొ
అణిమెఱుంగుముత్యమ్ములనిగ్గులో
సొబగొందు వన్నెలసోగలొకొ
శృంగారరసమొలుక చిత్తరుప్రతిమలో
క్రాలఁ జెల్వగు చంద్రరేఖ లొకొ
మురిపెంపురతిచేతి ముద్దులచిల్కలో
మెఱుఁగైన తొలకరిమెఱుఁగులొకొ
పొలుచు బంగరు రాయంచబోదలొకొ
కొమరుమిగిలిన విరితేనెకొలఁకులొకొ
యనఁగఁ ద్రైలోక్యమోహనహావభావ
గతుల విలసిల్లుదురు పురికన్నెసతులు॥ 229

మ॥ పురిసౌధాబ్జశిలావితానములు సంపూర్ణతుపారాద్ద్వడు
త్కరయుక్తిం జెలయేఱులై దివిజగంగంగూడి స్వర్గంబుపైఁ
బఱపం దజ్జల ముగ్రతుండముల నొప్పం ద్రావి గీర్వాణహృ
ద్భరితాంచచ్ఛయముం గ్రహించి చెలఁగుం భద్రేభసందోహముల్

క॥ తుంగంబులు రణరంగా। భంగంబులు భూరివిమతపార్థివపటలీ
భంగంబులు తన్నగరశ। తాంగంబులు శుద్ధమేరుధరశృంగంబుల్

మ॥ కరు లుద్యద్బలభద్రసంపదలఁ జొక్కం బైతగం జక్రభృ
ద్గరిమందాల్చె, శతాంగసంతతులు కంఖాణంబులున్ సద్భటో
త్కరముల్ మేలసమానుగా స్థి నసిరుద్ధశ్రీలఁజెల్వార, త
త్పురి వర్ణింపఁగశక్యమే తగ స్వయంభూముఖ్యదేవాళికిన్॥ 232

వ॥ ఇట్లత్యంతసుందరం బైన యప్పురవరంబులోన, 233

సీ॥ మగరాలగోడల నిగనిగల్ గలడాలు
చెలువైన పంచవన్నెలలు గాయ
నీలంపుటాకట్టు జాలక చకచకల్
గాఢాంధకారంబు గ్రమ్మఁజేయ
జాతిమేల్ప్రాగెంపురాతితిన్నెలజిగి
చరమసంధ్యారాగగరిమనింప
పగడంపుబోదెకంబముల నిద్దపుఁదళ్కు
తరుణాతపంబు విస్తరిలఁజేయ
గరుడపచ్చలతోరణకాంతి దిగ్వి
శాలలోచనలకు నిశాచర్చ యొసఁగ
భావచిత్రకళాభిరూప్యంబుగలిగి
రంగువిరాజిన యంతఃపురంబులోన॥ 234

క॥ పులుగులదొరకౌనిపోయిన
తళతళమనుతీఁగెమెఱుఁగు తలతలమను నై
తళుకుగల కూఁతుతోడుత
జలధరవర్ణుండునిలిచె సముచితలీలన్॥ 235

వ॥ ఇట్లునిలిచి యయ్యెడ, 236

చ॥ తరుణశశాంకచూడునకు ధాతకు దుగ్ధతరంగిణీమనో
హరునకు దైవతాగురున కత్రివసిష్ఠముఖర్షిలోకశే

ఖరులకు వానవార్ధవరకంధిపముఖ్యదిగీశకోటికిన్
గరుడుని చేతనంపెఁ గుతుకంబునఁ బత్రివివాహపత్రికల్॥ 237

క॥ సరసీజపత్రనేత్రుఁడు
కరమరుదుగఁ బంపినట్టి కమ్మలుగని సు
స్థిరచిత్రికళాన్వితులై
బరువడి రాఁదొడఁగి రల సుపర్వగణంబుల్॥ 238

సీ॥ గోరాజమణిచంద్ర గోరాజమణిచంద్రి
హరిదేవతాచ్ఛాయ లతిశయిల్ల
సారంగధరమిత్ర సారంగధరమిత్ర
నేత్రత్రయస్ఫూర్తి నివ్వటిల్ల
సారంగఘననీల సారంగఘననీల
కంధరాబంధురకాంతిదనర
పుండరీకశరాభ పుండరీకశరాభ
భసితాంగరాగంబు పొసఁగుచుండ
క్రొత్తమిత్తెంపువన్నియగిత్త నెక్కి
పరఁగుసామేన గిరిముద్దుపట్టి చెలఁగ
ప్రమథగణములుగొల్చిరాఁ బార్వతీశుఁ
డరుగుదెంచెఁ దదీయకల్యాణమునకు॥ 239

ఉ॥ బంగరుబొజ్జలోపలను బ్రాఁజదువుల్ గదలంగ నిద్దపున్
బంగరుతెక్కఁ జేర్గలుగు పక్కిపిసాళిపటాణి నెక్కి ది
వ్యాంగిమయూఖసంఘము లహర్పతి మార్పడఁజేయఁ బల్కుచా
నం గొనవచ్చెఁ బెండ్లికిని నల్గడబ్రహ్మలుగొల్వ ధాతయున్॥ 240

సీ॥ తనలోని నవహీరమణిగణాచ్ఛచ్ఛవి
చ్ఛటమీఱు మందహాసంబు చెలఁగ
తనలోని యువదాతివనజాతముల సొరు
గలిగియొప్పెడి గొప్పకన్నులలర

తనలోని రోహిణీతరుణీమనోహర
బింబంబుఁబోలు మొగంబుదనర
తనలో మనోహరోద్యత్తరంగంబుల
బెడఁగుగల్గిన వెల్లగొడుగులలర
తనదుమధ్యస్థచక్రాంకతతి మనోజ్ఞ
ధవళచామరములు సరిద్యువతిమణులు
పరఁగ వేయంగ దివ్యరూపంబుఁబూని
వార్థినాథుండువచ్చె వివాహమునకు॥ 241

సీ॥ అమరీకరోచ్చలచ్చమరివాలాంచల
మరుదంకురమ్ములఁ గురులుగదల
నిమిషహీనసహస్రనేత్రవీక్షాళులు
శచిమోముదమ్మిపై సంభ్రమింప
ధనరాజవనరాజధర్మరాజాదులు
గురుజయంతులు వేడ్కఁ బిరుదరాఁగ
రమణీయతరనీలరత్నచింతారత్న
కీలితకనకభూషాళిమెఱయ
కల్పకలతాంతమాలికా క్రమసురభి
నినుమడింపుచు దివ్యచందనసుగంధ
సారచర్చామచర్చికాసౌరభంబు
నెఱయ సితకరిపైవచ్చె సురవిభుండు॥ 242

సీ॥ మందారనవపుష్పమాలికావృతములై
బలుకీలుజడలు శ్రోణులనటింప
గోవముత్తెపుజంటకుట్టుహొంబట్టుచ
న్గట్టులు గుబ్బలగుట్టుదెలుప
వలిపెచెంగావిపావడలతళ్కులుపర్వ
జిగిబురుసాపనిచీరెలలర

కల్పకసంజాతకమనీయనవరత్న
భూషణావళులు మైపూఁత నొరయ
కులుకుపాలిండ్ల హారములు గునిసియాడ
రవలగజ్జెలు ఘల్లుఘల్లారవములీన
ధరణికేతెంచు క్రొక్కాఱు మెఱుఁగులనఁగ
నచ్చరలువచ్చి రవ్వివాహంబునకును॥ 243

వ॥ మఱియు వసిష్ఠాత్రి కశ్యప మాండవ్య మందపాల మంకణ జాబాలి భరద్వాజ గౌతమ చ్యవన కణ్వ విశ్వామిత్ర జమదగ్ని కుంభసంభవ ప్రముఖ మహర్షిసంచయంబులును నరుంధతీముఖ్య పుణ్యపురంధ్రీరత్నంబులును దక్షిణ గరుడగంధర్వసిద్ధవిద్యాధరకిన్నర కింపురుషయక్షోరగాదులునుజనుదెంచి, రట శంతనుకుమారకాంతుండును బంధుమిత్రామాత్యపురోహితవరూధినీచయంబులం గూడుకొని యేతెంచి యొక్కసుధాధామశిలాపరికల్పితోత్తుంగరంగత్సౌధవీధికాంతరాళంబున హరిని యోగంబున విడిసి చతురవచనారచనాతిరస్కృత పురుహూతపురోహితులగు పురోహితులం బంపి సర్వసర్వంసహామండలాఖండలుల రావించిన, 244

సీ॥ కస్తూరితిలకంపుఁ గమ్మవాసనకంటెఁ
గడుఁదావిగల సిరిగంధమలఁది
ఉరుమంజిముత్యంబు నొంటలుసవరించి
బంగరుజలఁపోతపాగఁజుట్టి
చంద్రికపూవన్నెఁజిల్కుకబాయిపైఁ
దగటుచిత్తరువు బలటిగట్టి
దంటముత్యపుఁగుట్టుతళుక్కెంబట్టుసి
స్తురుమాలు కరమున నెఱయఁబట్టి
పచ్చడాల్ చెక్కడపు రంగుపతక మెసఁగ
పచ్చవిల్కానిఁబోలు రూపంబు చెలఁగ

పచ్చవన్నె తురంగంబుపైఁ దనర్చి
వచ్చె సింధుక్షమాతలవల్లభుండు॥ 245

సీ॥ మరకతహారి నీలమహానీయమకుటకి
మ్మీరకాంతులు మింటమెండుకొనఁగ
అత్యంతసుకుమారమగుమేన నలఁదిన
మృగనాభివాసనల్ భుగులుకొనఁగ
మాణిక్యమయహేమమకరకుండలరుచుల్
గండభాగములపైఁ దాండవింప
వజ్రగోమేధికవైడూర్యహారముల్
రమణీయదోరంతరమున మెఱయ
చండదర్పాంధపరిపంథిమండలేంద్ర
సాంద్రమదసింధుమంధవిశ్వంభరాధ
రాయమానభుజాస్ఫూర్తి రహిఁ జెలంగ
వచ్చెఁ బెండ్లికి మత్స్యభూవల్లభుండు॥ 246

సీ॥ ఆణిముత్యము కంఠహారంబునొరయుచు
నీలంపుసరిఫిణీ నీటుఁజూప
తళ్కుసువ్వాణిచౌకట్లనిద్దపుడాలు
మరకతాంగదకాంతు లొరయుచుండ
స్వర్ణభూషణదీప్తి వలెవాటువైచిన
నపరంజిపూసాలు నందగింప
తావిబుగులొల్కను గోవజవ్వాజిమై
పూఁతతేఁటులనెల్లఁ బ్రోదిసేయ
చండతరతీవ్రమార్తాండమండలాంగ
రుచులు కోటీరతటరత్నరుచులు చూప
రులకు నేత్రోత్సవము సేయఁ జెలువుమీఱి
మాగధుఁడువచ్చె నమ్మహామహముఁజూడ॥ 247

వ॥ మఱియుఁ బలాట లాట భోట కరహాట కర్ణాట కొంకణ కుంకణ విదేహ విదర్భ యుగంధర ప్రముఖ నిఖిలవసుంధరామండలాధిపకుమారమండలాఖండలులు సౌందర్యశౌర్యాద్యధఃకృత రమాకుమారోమాకుమారులు శంఖభేరీమృదంగపటహ కాహళ వేణువీణా రవానుకారిమాతంగతురంగ శతాంగపరభటకోలాహలప్రపూరితభువనభాంతరాళులై చనుదెంచి, రిట్లు వైవాహికోత్సవంబునకరుగుదెంచిన పంచముఖచతుర్ముఖప్రముఖలేఖగణంబులకు నిఖిలభూపతివ్రాతంబులకు విడియునట్లుగా వైకుంఠుం డుచితంబులగువిడుదులు గరుడునిచే నిరూపించి వారివారి సనర్ఘజాంబూనదాంబరరత్న భూషణసుగంధకుసుమమాలికాదులఁ బరితృప్తులంగావింపుచుండె నంత,

కం॥ సరసిజసంభవగౌతమ
గురులు వశిష్ఠుండు లగ్నకోవిదమతులై
త్వరిత మొనర్పఁగనంతట
నరుంధతీముఖ్యసతులు హరియనుమతిచేన్॥ 249

కం॥ చింతామణిపీఠంబునఁ
గాంతామణినునిచి రుచిరకౌతుకలీలన్
స్వాంతముల శోభనాకృత
లంతటఁ దలనునిచి యొసఁగి రారతులుతగన్॥ 250

తే॥ అంగనామణియొకతె సంపంగినూనె
కౌతుకంబునఁ దలయంటఁ గమ్మతావు
లినువరవర్ణినినవమృగమదములఁ
గాంతియొక్కర్తు నలుగిడెఁ గమలముఖికి॥ 251

కం॥ ఫలపుం జవాదియటుకలి
కలకంఠి యొకర్తొసంగి కనకఘటములన్
దెలిగొజ్జఁగినీ రునిచియు
జలజాక్షి యొకర్తు సతికి జలకములార్చెన్॥ 252

తే॥ చారుకురులందు జాఱుగొజ్జంగినీటి
తేటబిందువులొప్పారె సూటినపుడు
ప్రావృషేణ్యపయోధరపటలగళిత
లలితవర్షోపలావళి చెలువుగలిగి॥ 253

తే॥ గంధగజయానయొక్కతె కంజనేత్రి
తళుకు నెమ్మేనఁ దడియొత్త జిలుఁగుచీని
చెలువపావడగనరయ్యె చెలువుమీఱె
పైఁడితీవకు నార్చినపటికసంగ॥ 254

ఉ॥ రాజనిభాస్యయోర్తు దయరాగఱుఁ జేలఁ గటిస్థలంబునన్
రాజతలీలఁ గట్టెఁ దనరంగ వివాహమహోత్సవేక్షణే
చ్ఛాజహదాగమాప్తిగల చక్రనిరంభకు సిగ్గుదోఁచునం
చోజ మృదూరురంభలఁ దలోదరి మాటొనరించువైఖరిన్॥ 255

తే॥ ఉదయరాగపువలువ పైఁ గుదురుకొనిన
కంబుకంఠిసితంబబింబంబు దనరె
ప్రథమకుధరాగ్రసందీప్తబాలభాను 256
భానుసంక్రాంతసైకతప్రతిభ గలిగి॥

ఉ॥ బంగరుసాలు కన్నియకుఁ బయ్యెదగా వలెవాటువైచె నొ
క్కంగన గబ్బిగుబ్బచను (లన్ కవజక్కవ) వక్త్రపూర్ణసా
రంగధరప్రభాకలితరమ్యదరస్మితసాంద్రచంద్రికా
సంగతి జోడువిచ్చునని చాటొనరించినలీలఁ దోఁపఁగన్॥ 257

ఉ॥ చందనసాంకవాగురురజఃపటలార్పితధూపధూమ మిం
దిందిరవేణిపెన్నెఱుల నించి నిగన్నిగలొప్పదువ్వి స
త్సుందరరేఖ చెన్నెసఁగ సూటిగఁ బాపటదీర్చి జాఱుగొ
ప్పందమమీఱఁ బెట్టి యొకయంగన చుట్టె మధూకదామమున్॥256

తే॥ కన్యకామణికొక శుభ్రకమలనేత్రి
కమ్మకస్తురిచేఁ దిలకమ్ముదీర్చె

అదియుముఖపూర్ణిమాతుషారాంశుబింబ
మునకు శంబరలాంఛనస్ఫూర్తిచూప 259

తే॥ అంబుజానననేత్రకర్ణాంతములుగ
మంజులాంజనమిడె నొక్కమగువ మరుఁడు
శ్రవణపుటకూపపాతచంచలవిలాస
వీక్షణములకు శృంఖలల్ వేసెననఁగ 260

తే॥ మొలఁత నునుముద్దుచెక్కిళ్ల మృగమదమున
మకరికాపత్రములు వ్రాసె మగువయొకతె
విరహిజనములపై దండువెడలఁదలఁచు
దర్పకుని మోహ్రిలనెత్తిన ధ్వజములనఁగ 261

చ॥ సరసిజగంధియోర్తు సితచందనచర్చయొనర్చునప్పు డా
గురుకుచ కుల్కునిబ్బరపుగుబ్బలు చూడఁదనర్చి రాజశే
ఖరకరసంగతిం జెలఁగుఁ గాంచనగోత్రము మేము రాజశే
ఖరకరరూఢిఁ గాంతుమని గంధవరాద్రులు లూనెనోయనన్ 262

తే॥ మత్తగజయానపదములు మహిళయొకతె
చిత్తరపుఁ గ్రొత్తలత్తుక హత్తె నింక
నిఖలభూకాంతసీమంతినీలలాట
కలితసింధూరరజమిట్లు గప్పెననఁగ 263

ఉ॥ కాంతయొకర్తు కంబునిభకంఠికి వేడ్కనలంకరింప సీ
మంతకలాప మౌక్తికసమాజము లొప్పెఁ దదాస్యరోహిణీ
కాంతపిధానయత్నకచకంధరరాజముఁ జేరవచ్చి మా
కాంతునిగావుమంచని తగన్ (బ్రతిమాలెడి) రిక్కలోయనన్ 264

చ॥ సురుచిరనవ్యహీరమణిశోభితమౌ నెలవంకబొట్టు సుం
దరి యొకలేమ వెట్టఁ దగెఁ దన్ముఖకోమలపంకజంబుచేఁ
బరిహృతసత్కళార్థమయి పర్వసుధాకరమండలంబు తన్
మరలఁ బ్రపూర్ణుఁ జేయుమని మైత్రికివచ్చినలీల దోఁపఁగన్॥ 265

తే॥ కొమ్మ కొక(కొమ్మ) ముత్యాలకమ్మదోయి
కర్ణములకిడ నొప్పారెఁ గమలశరుఁగు
కలితదృష్టిశరంబులఁ గలిమిమెఱయ
రమణనిలిపిన శాణచక్రములనంగ 266

ఉ॥ నారియొకర్తు పద్మముఖి నాసకు రంగుమెఱుంగుముంగ రిం
పారఁగనిడ్డ ముత్తె మలరారె ముఖేందునిజేరవచ్చి మూ
దారనొసంగితీవు దయఁ దత్తనుసంభవు నిమ్మటంచు వే
మూరు ముఖాముఖిన్ నిలిచి మూనక వేడెడి జీవుఁడోయనన్॥ 267

తే॥ దివ్యమణికీలితంబైనతీఁగె సతికిఁ
దరుణియొక్కతె వెట్టినఁ దనరుచుండెఁ
గంఠమను పోకబోదియఁ గదిసి చుట్టు
కొనితనర్చెడి నును లతకూనయనఁగ 268

చ॥ తరుణికిఁ దారహారములు తన్వియొకర్తు ఘొసంగవైవ వి
స్ఫురణఁదనర్చె శంఖ మురుసుందరబంధురకంధరోజ్వల
స్థిరగతిఁబూనఁ దజ్జరసీమఁ బ్రభూతనులైన మౌక్తికో
త్కరములు భూరిమైత్రితగ దండలఁ బాయకయుండెనోయనన్ 269

తే॥ పద్మరాగపుఁబతకంబు పణఁతియొకతె
ముదితపాలిండ్లసందునఁ గుదురుపఱుపఁ
దనరెఁ బూర్వాపరాగమధ్యప్రదేశ
కలితశతపత్రమిత్రమండలమనంగ 270

వ॥ మఱియుఁ గొంద ఱిందిందిరకుంతలులు చందనగంధికి రత్న కంకణంబులు వలయంబు లూర్మికలు చేకట్లు చిఱుగజ్జెలందియలు బవిరెలు లోనుగాఁగలుగు భూషణంబులు మనోహరాంగకంబుల నలంకరించిరిట్లు, 271

తే॥ రమణ సైరంధ్రికాప్రియత్నమునఁ జేసి
నవచతుర్విధశృంగార మవధరించి

జలజపత్త్రాక్షి మిక్కిలి చెలువొసంగె
సానవట్టిన మన్మథు సూనమనఁగ 27

చ॥ అమృతగభస్తి పంకరుహ మంగన! నీ నగుముద్దుమోముతో
సమతకు రాఁగఁబూని తగ సామ్యముగాక పరస్పరోగ్రవై
రములఁ జెలంగి రోలి నిది రమ్యముగా నరివచ్చునంచుఁ బ
ద్మముఖి యొకర్తు నిల్పెఁ బ్రిమదస్థితి ముందట మించుటద్దముల్

తే॥ అద్దమీక్షించి పెద్దముత్తైదువలకు
సరవిఁ గేలోడ్డి ముత్యాలచపికెలోన
పైడిముక్కాలిపీరిపైఁ బరఁగుచుండెఁ
దమ్మిపూగద్దెపైఁ గల్మికొమ్మయనఁగ 274

వ॥ అట శంతనుండును బంధుమిత్రసామంతసచివాదులతో
హితవినోదంబులఁ బ్రొద్దుపుచ్చుచుండె, సైరంధ్రికాజనంబులు,

తే॥ మొలకనవ్వులు మోములఁ దళుకుఁజూపఁ
గలికిచూపులు మరు నంపగముల గదుమఁ
గులుకుపాలిండ్లఁ బయ్యెదల్ చెలువుమీఱ
రత్నపీఠంబుఁ బెట్టి భూరమణు నునిచి 276

చ॥ కరమణికంకణధ్వనులు ఘల్లున మ్రోయఁగఁ దారహారముల్
గురుకుచమధ్యభాగమున గొబ్బునఁ బేరిణిసల్ప వేశి బల్
పిరుదుపయిన్ నటింప జిగిలేనడు మల్లలనాడ రాజశే
ఖరునకుఁ గాంతయొక్కతె సుగంధపునూనె తలంటె వేడుకన్ 277

క॥ రాజముఖి యొర్తు పావలు! రాజేంద్రశిరఃకిరీటరత్నద్యుతినీ
రాజితవిభ్రాజితపద! రాజీవములంధుదొడఁగె రాత్త్రిలకునకున్ 278

క॥ గంధగజగమన యొక్కతె
గంధామలకంబు వెట్టె ఖంజనమదపు
ష్పంధయకంధరబాంధవ
బంధురరుచి నొప్పు నెఱులఁ బ్రభుచంద్రునకున్॥ 279

తే॥ కామినీజనమృదుహస్తకమలపూర్ణ
కనకకలశములీక్షింపఁ దనరెనపుడు
తత్కుచస్ఫూర్తిఁగాంచి సాధ్వసముఁబొంది
దాసిగతి నీరుమోచువిధంబుగలిగి 280

తే॥ చంద్రకాంతపుగిండులఁ జంద్రముఖులు
లలితకంఠోదకంబులు చెలఁగియొసఁగ
నందుకొని యోర్తు మదరాజహంసగమన
స్నానమాడించె శంతనుక్ష్మాపమణికి 281

సీ॥ తడియొత్తె నొక్కసుందరగాత్రి చంద్రికా
ధాళధళ్యరుదుకూలమునను
కట్టనిచ్చె నొకర్తె గంధసింధురయాన
సన్నంపుసొన్నంపు వన్నెవలువ
సిగవైచె నెఱులు రాజీవాక్షి యొక్కతె
సంపంగిక్రొవ్విరి సరులుదుఱిమి
తిలకంబు నుదుటిపైఁ దీర్చె నొక్కతె తన్వి
బుగబుగవాసించు మృగమదమున
కలపమలఁదెను నెమ్మేనఁ గలికియొకతె
కప్పురపుసురటి కాంత యొక్కర్తు విసరె
నిలువుటద్దంబు చెలియోర్తు నిలిపె నెదుట
చంద్రకులవార్ధిపూర్ణిమాచంద్రునకును 282

వ॥ మఱియు నొక్కబింబోష్ఠి జాంబూనదాంబరం బభినవాంబురుహాంబకునకు వాటంబుగా వలెవాటువైచె, నొక్కబోటి రాజశతకోటిధరు శిరోభాగంబున రత్నహాటకసంఘటితకోటీరంబు పొందుపఱచె, నొక్కండజయాన భూమండలాఖండలకుమారమండలప్రకాండు కర్ణంబుల మాణిక్యకుండలంబులు పొసఁగించె, నొక్కకలకంఠకంఠి యకుంఠితశౌర్యకంఠీరవుకంఠంబున నాణెముత్తెంపుఁ గంఠమాలికలు

గీలుకొలిపె, నొక్కరజనీకరముఖి భూభుజు భుజంబుల మరకతస్ఫీతంబులగు భుజకీర్తు లలవరించె, నొక్కసుందరి సుందరీకందర్పు సందిటఁ గుందనంపుఁ దాయెతులుగట్టె, నొక్కపంకజాక్షి ప్రభుశశాంకుహస్తంబుల రత్నకంకణంబు లలంకరించె, నొక్కశుభాంగి నరపుంగవు కరాంగుళుల జాళువాబంగరు ముద్దుటుంగరంబులు దొడిగె, నొక్కవధూటి హాటకాచలధైర్యు కటిస్థలంబున హాటకసూత్రంబు ధరింపఁ జేసె, మఱియు గొంద ఱందిందిర వేణులు పద్మరాగపతకంబులు నీలహారంబులు లోనుగాఁగల భూషణంబు లఖిలాంగకంబుల శృంగారించి, రిట్లు సకలాలంకారమనోహరాకారుండై యుండె నప్పుడు, 283

క॥ ధళధళితనిజకటాక్షో
జ్జ్వలరోచులు దీపికావిశాలద్యుతులన్
జెలిమిగొనఁ గొందఱొసఁగిరి
నెలఁతలు మాణిక్యచిత్రనీరాజనముల్ 284

క॥ అంతట శంతనువసుధా। కాంతుని రాజత్ప్రకాశగౌరవము త్రపా
క్రాంతమతిఁగాంచిసంజ్ఞా। కాంతుఁడుచనినట్లుచరమకంధిం గ్రుంకెన్॥

కం॥ శంతనునృపచూడామణి
కాంతామణియైన గంగగళమునఁ బ్రమద
స్వాంతమునఁగట్టె బంగరు
కాంతులలరు తాళిబొట్టుగతి శశి పొడమెన్॥ 286

వ॥ అయ్యెడ॥ 287

మ॥ సుముహూర్తంబదె దగ్గఱించెనని యచ్చో జీవుఁడుం దెల్ప శ్రీ
రమణీవల్లభునాజ్ఞచే నల సుపర్వస్వామిం దిక్పాలవ
ర్గము నల్వంకలఁగొల్వఁ గిన్నరమరుద్గంధర్వవిద్యాధర
ప్రమదామంగళచారుగానములు పైపైఁ గ్రమ్మఁగా నేఁగి భూ
పమణింగాంచి సమగ్రకౌతుకమునం బ్రాగ్దంతినెక్కెం జొగిన్॥ 288

వ॥ రాజమార్గంబునం దోడ్కొనివచ్చునప్పుడు.

క॥ పౌరవధూరత్నంబులు
చారుసుధాధవళహీరసౌధాగ్రములన్
గూరిమి గుంపులుగూడుక
క్ష్మారమణుం గాంచి పలుకసాగిరి తమలోన్॥ 298

సీ॥ ఇతఁడటే నాసత్యరతికాంతశశిపాత్ర
సురుచిరలావణ్యసుందరుండు
ఇతఁడటే కల్పకక్షితిజచింతారత్న
రాజతౌదార్య ధురంధరుండు
ఇతఁడటే హిమవన్మహీధరాష్టాపదా
హార్యవర్యస్థైర్య ధైర్యశాలి
ఇతఁడటే విద్వదాశ్రితబంధుసందోహ
మాకందవాటికా మాధవుండు
ఇతఁడటే క్షీరనీహారహీరహార
సారఘనసారమందారశంకరగిరి
రాజకరిరాజహరిరాజరాజకిరణ
ఘనయశఃశాలి శంతనుక్ష్మాపమౌళి॥ 290

సీ॥ ఎవ్వనిపొక్కిటయిందిరాగృహాసీమఁ
గడుపుబొక్కసపుబిడ్డఁడు జనించె
ఎవ్వనికన్నులై యింపొందుదురు జగ
ద్బంధుండు రోహిణీప్రాణనాథుఁ
డెవ్వనియురమందు నేప్రొద్దుఁ బాయక
లిబ్బిగుబ్బెత శాలలీలఁదనరు
ఎవ్వనిమిత్రుఁడై యొసఁగుముక్తిందు భా
నద్ధకోటీరుఁడౌ నగనివాసి
సకలగీర్వాణపరివృఢమకుటఖచిత
పద్మరాగప్రభాధౌతపాదుఁడెవ్వఁ

దట్టిశౌరికి నల్లుఁడై యలరఁగల్గు
నఁట యితనిభాగ్య మెన్నఁగా నాతరంబె 291

క॥ నలరాజు రూపసంపద
నలరాజు కళాతిశయత నతులప్రభుతన్
నలరాజు ధృతిని మలరా
జిలరాజులనెల్ల నితని కెనయఁగ నగునే 292

ఉ॥ చక్కనివారిలో మిగులఁజక్కనివాఁడు కదమ్మ బాపురే!
ఎక్కడ నేర్చెనో సలువ యీతని చారువిలాసమూర్తి యీ
చక్కెరమోవి యీవలపుజవ్వనశ్రీకళ యీమొయార మ
మ్మక్క రచింప నీనృపతి హల్లకబాణుని జోడుగూడి తా
నక్కునఁ జేర్పఁగాఁగలుగు నంగనవే సుమి భోగభాగ్యముల్ 293

చ॥ నరవర యక్షకింపురుష నాగనభశ్చరసిద్ధసాధ్యకి
న్నరవరచారణ ప్రముఖనవ్యకళాపరిపూర్ణకన్యకా
నిరుపమవైభవప్రోల్లసిత నిర్మలచిత్తవిధూపలౌఘముల్
గరఁగవె వీని సద్గుణనికాయవిరాజితసాంద్రచంద్రికన్ 294

వ॥ అని బహుప్రకారంబుల వర్ణింపుచుండఁ బ్రాలంబమాన స్వచ్ఛతరచ్ఛాయాభియుక్తముక్తాఫలగుచ్ఛవిచిత్రసితచ్ఛత్రసందోహ సమాకాశంబు నిరవకాశంబుగావింప నుభయపార్శ్వసమాయాతభూతల సంక్రందననందనబృంద నవీనకోటీరకోటీకుటీరఘటిత మాణిక్యమయూఖసంఘంబులు నడదివియలై యొప్పుమెఱయ నంతరాంతరంబులు మెండుకొని దండలాస్యంబుగావించు రంభాద్యప్సరఃకుంభికుంభస్తనీమణీనికరమణిరమణీయతపనీయచరణ మంజీరపుంజమంజుఘల్లఘల్లాఘోషంబులు పుంఖానుపుంఖశంఖ భేరీమృదంగవేణువీణాది వివిధహృద్యవాద్యనిరవద్యనాదంబులు నరుంధతీప్రముఖ పుణ్యపురంధ్రీరత్నంబులుపాడు లక్ష్మీనారాయణోమామహేశ్వరవైవాహకలక్షణాంకితంబులగుధవళంబుల మధురరావంబులు శతముఖప్రముఖనిఖిలబర్హిర్ముఖకంఠావలంబి

పారిజాతప్రసూనదామస్తోమాభిరామపరిమళఝరిలుబ్ధరంగద్భృంగసంగీతకూజితంబులు నచ్చటచ్చట నందడులఁబాప వేత్రధరుల సాహోహో నాదంబులు కోలాహలంబై దశదిగ్వీటంకంబుల మాఱ్మ్రోయంజేయఁ గలధౌతసౌధయానంబులనుండి సుధామధురాధరలు శుక్తిజాతలాజాక్షతప్రసూనంబులు సేసలుచల్లమంద మందగమనంబున సుధాంభోధిరాడ్గంధసింధురరాజంబుపై రాజగృహద్వారంబుఁ జేరవచ్చె నంత, 295

తే॥ హరి మొకుర్కొని ప్రాగ్దంతినవతరించి
వందనములనృపతికి దీవనలొసంగి
తోడుకొనిపోవ మంత్రులు దొరలు బుధులు
బంధుకోటియు వెంబడి బలసి రాఁగ 296

వ॥ భూసురభాసురాశీర్వాదనాదంబులు రోదసినిండ నభ్యంతరమందిరంబునకరుగునప్పు డప్పురుహూతనన్నిభుం డెడనెడ విప్ర పుణ్యపురంధ్రీరత్నంబులొసంగు కర్పూరనీరాజనంబు లాదరింపుచుఁ దోరణస్తంభాగ్ర మాన రంభాద్రుమపత్రచిత్రతాలవృంతాశుగాంకురంబుల నలకలుచలింపఁ గక్ష్యాంతరద్వారప్రదేశంబుల మంగళార్థంబుగానిలిపిన పూర్ణశాతకుంభకుంభప్రముఖపదార్థంబులు వీక్షింపుచు నల్లనల్ల నడచి విబుధపరంపరాపరివేష్టితంబయ్యును విబుధపరంపరాపరివేష్టితంబై సరస్వతీమనోహరాలంకృతంబయ్యును సరస్వతీమనోహరాలంకృతంబై వివాహశుభలక్షణలక్షితంబయ్యును వివాహశుభలక్షణలక్షితంబై సర్వమంగళాభంగశృంగారవిలసితంబయ్యును సర్వమంగళాభంగశృంగార విలసితంబై యొప్పుకల్యాణగృహంబుసొత్తెంచె నంత॥ 297

కం॥ పేరంటాండ్రులుకొందఱు। గౌరీకల్యాణములు పికస్వరమధురో
దారగతులెసఁగఁ బాడుచుఁ।గూరిమిడెందములమీఱఁ గొని తేరంగా

సీ॥ మందహాసాపాంగమహితద్యుతుల్ మీఱ
చంద్రహాసద్యుతుల్ చౌకసేయ

సుకుమారతరదేహసుగుచిరామోదంబు
పద్మసౌరభలక్ష్మిఁ బరిహరింప
సమపీనవక్షోజరమణీయవిభవంబు
భద్రేభకుంభసంపద నదల్ప
మందయానవిలాసమహిమానుభావంబు
మందమరాళంబు గ్రందుకొనఁగ
ఘనతులాకోటి మణికోటి ఘటితకమ్ర
కనకకాంచీలతాలంబి ఘంటికౌఘ
కలరవమ్ములు కోయిలగములఁ బిలువ
వెలఁది యేతెంచెఁ గల్యాణవేదికలకు. 299

వ॥ అప్పుడు, 300

సీ॥ బాలాశిరోమణి ఫాలపట్టికగాంచి
నగమయ్యెఁ గృశతచేఁ జంద్రరేఖ
తొయ్యలి నిద్దంపుఁదొడల నున్జిగికాంచి
యాకులపడియె నయ్యారె రంభ
కంజాతపత్రాక్షి కలికిచూపులుగాంచి
తృణధైర్యవృత్తిచేఁ దెరలె హరిణి
మోహనాంగి మనోజ్ఞమూర్తిసంపదగాంచి
యఱలేక లోలోనఁ గరఁగె హేమ
తెఱవ పదములుగాంచి రాగరసమగ్న
యయ్యెఁ బద్మిని, కొమ్మ నఖాళిగాంచి
తలఁకి తావెల్లనైయుండెఁ దార, వెలఁది
ముక్కుఁగాంచి తిలోత్తమ సొక్కుణంగె. 301

చం॥ సకలజనంబు దంపతుల చారుకళావిభవంబుచూడ నం
బకయుగళంబు చాలదని భాసురవైఖరి నెన్నుచుండె, రెం
డొకటియు నాల్గునాల్గుకనులొప్పెడివేల్పులు వేయికన్నులం.

గకముఁగల్గుప్రౌఢ యిఁకఁ గన్నులుగావలె వేయి రెండువే
లకుటిలలీలనంచుఁ గొనియాడుచునుండిరి వారి నయ్యెడన్. 302

కం॥ మధురిపుఁడాసఁగ భుజించెను
మధుపర్కము రాకుమారమన్మథుఁ డదియే
మధుమథనకన్యకాధర
మధురసుధాపానలీలమతి యలరింపన్. 303

కం॥ అంతకుమున్నె కొందఱు
కాంతలు దంపతులనడుమఁ గరకంకణముల్
కాంతగతిఁ బ్రోయఁ దెర య
త్యంతామోదానుయుక్తి నమరించిరొగిన్. 304

తే॥ సుందరీమణి నిడువాలుచూపులపుడు
తెరకు నెగఁబ్రాకి బాపురే! యొఱపుమీఱ
నదమలామృతవాహిని కెదురు లెక్కఁ
గొదమబేడిసమగమీల పదవులనఁగ. 305

తే॥ అట్టియెడ రంగుబంగరుమెట్టుఁబ్రాల
పుట్టికలు కన్యకామణి భూపమణిని
గదియఁజేసిరి కొందఱుగరిత లతుల
భూరితర హృద్యవాద్యము ల్బోరుకలఁగ. 306

క॥ తెఱవ త్తెరవంచిన నా
గరిత మొగంబపుడు పతికిఁ గానంబడియెన్
శరదభ్రముఁబాసి ఘన
స్ఫురణం జెన్నొందు పూర్ణసోముసిభాతిన్॥ 307

తే॥ జవ్వనికిఁ గానఁబడెఁ బతి నవ్వుమోము
గొప్పకన్నులు సీలంపుఁగప్పుగుప్పు
మొలకనూనూఁగుమీసము త్రుళ్లుకుమేను
వెడఁదయురమును సింగమ్మునడఁచుకౌను॥ 308

శా॥ గౌరీ వాగ్రమణీ శచీప్రముఖ రాకాచంద్రబింబాననా
స్ఫారాధారకరాగ్రపల్లవలసత్సంస్పర్శమొందించి య
ప్పౌరోహిత్యధురంధరుం డొనఁగ భూపాలుండుగావించెఁ బెం
పారన్ మంగళసూత్రబంధనము కన్యాకంఠదేశంబునన్॥ 309

చ॥ హరిహయుఁడొట్టిదిక్పతులు నప్సరస ల్ఋషిపుంగవు ల్మనో
హరతరలీలఁగన్గొనగ నైదువ లోరలనిల్పి చేతులన్
నిరుపమశుక్తిజాతములునించినపళ్ళెములన్ వహించి హె
చ్చరికలొనర్ప గంగయును శంతనుఁడుం దలఁబ్రాలయంబునన్
శిరసులనుంచి రొండొరులు సిగ్గున నవ్వులు లోనఁగ్రమ్మఁగన్॥ 310

తే॥ చెలువ కేశావళీర్ణవిశిష్టమౌక్తి
కావళినిజూడనొప్పారె నహహా! యపుడు
లలితబాలేందురేఖ నొఁదలధరించి
యలరుచున్నట్టి సర్వమంగళయనంగ॥ 311

మ॥ ధరణీనాయకుఁడొప్పె మౌళివరముక్తారత్నములూని పు
ష్కరగంగాలహరీవళక్షకణరాజత్త్రీసజటామండలాం
తర సంధ్యాసమయోత్కటస్ఫుటనటత్సంరంభ కేళీవిలా
స రసప్రాంచిత పంచబాణహర చంచల్లీల చూపట్టఁగన్॥ 312

క॥ అంతట నెలఁతలు స్వాహా। కాంతాధిపుఁదెచ్చిపెట్టి కాంతాపతులన్
జింతామణిపీఠంబున। సంతసమున నునుప వారు సముచితలీలన్॥ 313

తే॥ భాసురపలాశ నవ శమీపల్లవాగ్ర
రమ్యగోఘృతధారాపరంపరాహు
తులు హుతాశనునందుఁ బ్రస్తూయమాన
వేదవిదితక్రియారూఢి వ్రేల్చిరపుడు. 314

క॥ రాజీవపత్రలోచన। లాజలుదోయిటను జేర్ప లాలితఘనకీ
లాజాలాభ్యంతరమున। రాజద్గతి వ్రేల్చిరపుడు రహిఁగన్పట్టన్ 315

వ॥ అయ్యెడ, 316

తే॥ హోమధూమంబు పైఁగప్ప హేమగాత్ర
స్వచ్ఛశుభ్రతరచ్ఛవిగుచ్ఛరుచిర
తరశరద్ఘనమండలాంతరమునందు
మెఱయుచుండెడి లేఁతీఁగె మెఱపుఁబోలె॥ 317

క॥ అమరేంద్రనిభుఁడు మనమునఁ
బ్రమదంబిగురొత్తఁ బాణిపద్మము చేతన్
గమలదళేక్షణమృదుపద
కమలాగ్రంబవుడు సన్నెకలు ముట్టించెన్॥ 318

క॥ కలకలనవ్వుచు నొక్కతె
కలకంఠి నృపాలతిలక కాంతాచేలాం
చలములు ముడియొనరిచె, నొక
చెలువ కరగ్రహణలీలఁ జెలఁగం జేసెన్॥ 319

క॥ పవనాప్తునకుఁ బ్రదక్షిణ
మవిరళగతిఁ జేసి మానసార్చితలక్ష్మీ
ధవు నిష్కలుషయశోజిత
ధవు ధ్రువు నుడువీధిఁ గసిరి పతియున్ సతియున్॥ 320

వ॥ తదనంతరంబ, 321

సీ॥ పరిణయాగత యమిప్రవరులైన యరుంధ
తికి వశిష్ఠరికి ధృతిని మ్రొక్కి
సకలసరిచ్చయజనసేవ్య రత్నాక
రాధినాథునకు సాష్టాంగమొనఁగి
ఆదిమదంపతులైయొప్పు పార్వతీ
శశివతంసులకు హస్తములు మోడ్చి
త్రిభువననిర్మాణదీక్షాచణాధార
భాషాబ్జులకును సద్భక్తినెరఁగి

మఱియుఁ దక్కిన దేవతామానులకును
దండములు వెట్టి తత్కరకాండజాభి
మంత్రితాక్షత లెంతయు మౌళిఁ దాల్చి
రంబుజాక్షియుఁ జంద్రవంశాధిపతియు. 322

చ॥ సురతరుసంభవంబులగు సుందరదివ్యమణీవిభూషణో
త్కరములు చారుచిత్రమృదుకాంచనవస్త్రచయంబు ప్రోల్లస
త్పరిమళభూరివస్తువులు భాసురకౌతుక మావహిల్లఁగా
హరి చదివించె దంపతుల కప్పుడు చిత్రశిఖండిపుత్రుచేన్. 323

క॥ బలభిన్మణివరముక్తా
ఫలచింతారత్నవజ్రపట్టాంశుకము
ల్జలనిధిపతి గౌతముచే
సలలితముగ మిథునమునకుఁ జదివించెఁ దగన్. 324

క॥ బంధుసమూహంబంతటఁ గంధరవేణికిని బతికిఁ గౌశేయస్ర
గ్బంధురమణిభూషాదులు కంధిగభీరత నొసంగెఁ గానుకలు తగన్ 325

సీ॥ శరదభ్రఘనసార చంద్రచంద్రికలతోఁ
గలకలనగు మేనికాంతి దనరి
కల్యాణఘుంథాద్రికటకభాగప్రతి
ఘోషితహేషావిశేష మొసఁగి
కాద్రవేయాశన గంధవాహమనఃప్ర
భాసురవేగసంపదఁ జెలంగి
చక్రవాళావృత సర్వసర్వంసహా
చక్రవిలోలహాసంబు గలిగి
హరిహరిద్ఘోటవరహరిస్ఫురణ దెగడి
హారికల్క్యవతారవిహారవేళ
తన్నుజవమునఁ బూను గాంధర్వతిలక
మల్లునకుఁ జూపి శ్రీరమావల్లభుండు॥ 326

క॥ "రజనీచరకులపావన!
నిజమీవాహావతంసనిపుణతగలభూ
భుజునకు సమస్తధాత్రీ
విజయము దుర్లభమె యాత్మ వీక్షింపంగన్॥ 327
వ॥ దీనిఁబరిగ్రహింపు" మనిపలికి॥ 328

సీ॥ మేదురద్వాదశద్వాదశాత్మాంశుభా
సురమణిశోభాభిశోభితంబు
తపనీయధారుణీధరరోహణాచల
ప్రతిమానబహుదైర్ఘ్యభాసితంబు
కలహంససంకాశకమనీయకంఖాణ
రత్నసహస్ర విరాజితంబు
గాంగేయఘంటికాఘణఘణితోడ్యాణ
సంపూరితాశాంతసంచయంబు
సరసమందారమాలికాజాలకాంతి
సౌరభాగతపుష్పవిట్సంకులంబు
మయవినిర్మితమైన విమానమొకటి
మాఘవుఁడుచూపి కూర్మి జామాతకనియె॥ 329

సీ॥ "చిరతరఘనహిమ శ్రీమీఱఁగాఁ జేయు
విలసిల్లువైశాఖవేళలందు
ఉష్ణసంపదఁజేయు నుష్ణాగమము మాడ్కి
నలరారుచున్న శీతర్తువందు
గగనగంగా తరంగప్రాంగణంబుల
ఖచరయానంబులఁ గలసిమెలఁగు
అశ్రాంతకేళీవిహారపరిశ్రమా
హారనిద్రాతృష్ణ లణఁగఁజేయు

అమలినై తద్విమానమాహాత్మ్యమెన్న
బహుళిచిత్రంబు, మత్తనూభవయు నీవు
మించి యందధిరూఢులై మెలఁగునపుడు
తేటపడఁజేయు నన్నియుఁ దీసికొమ్ము"॥ 330

వ॥ అనిపల్కి యమ్మహనీయదివ్యవిమానం బొసంగి॥

క॥ మందారకల్పతరుహారి!చందనములతోడ జలధి జన్మించిన యీ
(నందిని ధేనువు భూభృ)ద్బృందారకపతికిఁజూపి శ్రీహరిపలికెన్ ॥331

తే॥ "కామగామినియిది భవద్ధామసీమ
నృపతి!మదనుజ్ఞ తప్పకనిల్చి త్వత్కృ
తాధ్వరంబులు సాఫల్యమందఁజేయు
నీప్సితార్థంబులొసఁగూర్చు నెవ్వియైన॥

వ॥ దీవింగైకొ"మ్మనియొసంగిమఱియు విశ్వకర్మనిర్మితంబులగు కలధౌతగాంగేయతల్పాసనభోజనభాజనకేళికాడోలికాపీఠికాపేటికాకరండభృంగారుప్రముఖధామోపకరణంబులును జింతారత్నపుష్యరాగాబ్జరాగాద్యనర్ఘ్యరత్నకీలితవలయకంకణహారావళ్యంగుళీయకతులాకోటితాటంకకాంచీకంఠికాదివిభూషణంబులును కురంగమదకుంకుమాగరుఘనసారపటీరసముదయోదయభాస్కరప్రముఖసమస్తనిస్తులపరిమళవస్తువిస్తారంబులును శరచ్చంద్రచంద్రికాధవళచిత్రకంచుకదుకూలాంబరసంచయంబులును గూఁతునకొసంగి యిట్లనియె॥ 333

సీ॥ "బాలాశిరోమణి! పారిజాతావనీ
జాతంబు మదనుజ్ఞ స్వర్గభువన
మవతరించి భవద్విహారశృంగార వ
నాంతరంబుననిల్చునంతరంబు
రసరసాన్నములు వస్త్రవిభూషణాదులు
గామించునవి యెల్లఁ గలుగఁజేయు

పతికినీ కత్యంతభావానురాగంబు
చెందించు,బడలిక ల్చేరనీదు,
కోవి క్రొమ్మావి సంపెంగ గోగువిరులు
పూయునేపొద్దు దోహదమ్మాతిఁ నీవు
కడియు,తద్ద్రుమకుసుమము లైకాశికములఁ
దాల్చి సౌఖ్యముఁజెందుఁడీ ధవుఁడు నీవు"॥ 334

వ॥ అనిపలికి మఱియు ముద్దుపట్టికిం గొన్ని బుద్ధులుసెప్పి ప్రయాణంబుచేసి వాణీశ్వర గౌరీశ్వర సురేశ్వర రత్నాకరేశ్వర ప్రముఖుల నుచితసత్కారంబుల మన్నించి వీడ్కొలుపువాఁడై యుండ నంతఁ జతుర్ముఖ పంచముఖులిట్లనిరి॥ 335

మ॥ "అరుదా తెల్లనిదీవి రేవి ఫణిశయ్యక్ శ్రీరమాదేవితో
విరజానామతరంగిణీపటురటద్వీచీమతల్లిలల
త్సరసీజోత్పలగంధబంధురపరిశ్రాంతిఁ వినోదించుచో
వలిగాడ్పుల్పయిఁగ్రమ్మఁ గ్రీడలొనరింపం గంను మొప్పర్ నిరుఁ 336

సీ॥ బాహ్యాంతరేంద్రియ పరిణామములుమాన్చి
పద్మాసనస్థితిఁ బరిఢవిల్లి
పవనుని బశ్చిమపథమున నొందించు
కుండలిశక్తి మేల్కొనఁగఁజేసి
లలిఁ జంద్రమండల లలదఖండామృత
బిందుధారావాప్తిఁ బ్రీతినొంది
పూర్ణమాదృష్టిచే భూమిమధ్యశృంగాట
కంబునఁ జిత్తంబు గదలనీక
లీలను లలాటచంద్రికాజాలమందు
సచ్చిదానందమయుఁడవై చాల నొసఁగు
నట్టి యోగీంద్రు నారాయణాఖ్యునిన్ను
బతరికావనిఁగాంతుము భద్రమొంద॥ 337

వ॥ అట్టినన్ను జగద్గురు ననాదిపురుషు ననన్యసామాన్యప్రభా వోదయు నవాఙ్మానసగోచరు నద్వితీయు నేమును గూడిన భువనత్రయవాసులును సులభంబుగా సందర్శించి సంభాషణ సంశ్రవణ విలాసంబు లొందంగంటిమి, కృతార్థులమైతి” మనిపలికి శంతనునిజూచి యిట్లనిరి॥ 338

ఉ॥ “శంతనుసార్వభౌమ! నృపసత్తమ! నీదవుభాగ్యమెన్న న
త్యంతము, శ్రీరమాధిపతి యల్లుఁడటంచుఁ బ్రసాదభాసిత
స్వాంతముతోఁ గనుంగొనఁగఁజాలితి ప్రాలితి కీర్తివల్లికా
శాంతసమాశ్రితాఖిల దిశాతలయాతుఁడవై మహోన్నతిన్” 339

వ॥ అనిపలికి యాశీర్వదించి వీడ్కొని వారిచేత నామంత్రణంబువడసి స్వేచ్ఛంజనిరి, హరియును దత్పుటభేదనంబు జామాతృభుజాదండపరిపాలితంబుగావించి సురేశ్వర రత్నాకరేశ్వరులఁ దక్కొన సురగరుడగంధర్వసిద్ధవిద్యాధరుల వీడ్కొల్పి తానును వైకుంఠధామంబుప్రవేశించె, నటశంతనుండును సామంతసచివపురోహితబాంధవవరూథినీసమేతుండై వధూమణిందోడ్కొని చనిచని ముందట॥ 340

సీ॥ గురుమౌక్తికోదారతర రంగవల్లికా
సంగతప్రతిగృహప్రాంగణంబు
గారుడోపల లసత్తోరణబద్ధాతి
సుందరద్వారాభిశోభితంబు
కర్పూరచందనాగరుధూపధూమసం
వాసితప్రాసాదభాసురంబు
భూరికాహాళశంఖ భేరీమృదంగాది
మంగళారావ సమన్వితంబు
ఘనచతుర్విధ శృంగారకలితలలిత
సుందరీజనబృంద సంస్తూయమాన
చారుఘంటాపథంబు భూజానియెదుట
కనుగొనియె నిజమగునట్టి గజపురంబు॥ 341

క॥ శుభలగ్నంబున మఘవాన్విభుఁడగు భూజానిబంధునికరము మంత్రు
ల్ప్రభువుల్నలుదిక్కులఁగా విభవోన్నతిగేహమునఁ బ్రవేశించెఁదగన్

వ॥ ఇట్లు గృహప్రవేశంబు గావించి గృహదేవతారాధనంబొనర్చి
జనయిత్రికి నమస్కరించి దీవనలు గైకొని బంధుమిత్రామాత్యాదుల స
ముచితసత్కారంబుల సంభావించి యంత నొక్క శుభదినంబున॥ 343

సీ॥ మణిమంటపంబున మదకీరశారిక
లుపుష్పాస్త్రశాస్త్రార్థము లువచింప
నిద్దంపుబంగరు ముద్దుకీల్బొమ్మలు
స్వరసలీలలఁ బనుల్సంఘటింప
గంధవాహవిశేషగతులమించి విపంచి
తతులును రాగపద్ధతులువలుక
వజ్రమయస్తంభ వరమయూఖచ్ఛట
లేఁబగ లాంద్రచంద్రికలనీన
పద్మరాగవితర్దికాబ్జమణికుట్టి
మేంద్రనీలకవాటక శ్రీవిలాస
సుందరంబైన కేళికామందిరంబు
కదియనేతెంచె శంతనుక్ష్మావరుండు॥ 344

క॥ ఒకచో సకినలమంచం (బొకచో దోమతెరమంచము యుయ్యాలమంచం)
బొకచోఁ జప్పరమంచం బొకచో నెప్పారిమిగుల నొప్పు (వహింపన్)

సీ॥ దాసకన్యాంగసౌందర్యసంపదఁ గాంచి
మరులు చెందిన పరాశరునివిధము
దారుకావని మౌనిదారలచిత్తము
లరఁగంగఁ జేయు శంకరునిజగ్గు
గౌతమపత్నితోఁ గలయుటకై చాలఁ
దమక మొందిన పురందరునిసొబగు
గురుభార్యతళుకుచెక్కులఁ గమ్మకస్తూరి
శతకల్పనముసేయు చంద్రుఠీవి

అల్ల రేపల్లె గొల్లయిల్లాండ్ర నతుల
చతురచాశీతిబంధసంగతుల రతులఁ
దేల్చుచుండెఁ గోపాలదేవుచర్య
యమరఁ జిత్రించినట్టి కుడ్యములఁ గాంచి
ప్రమద మొందుచునుండెను బ్రబలుఁ డగుచు॥ 346

సీ॥ పగడంపుఁదరికోళ్లు నిగరాలమగరాల
పట్టెలు చీనిహొంబట్టుపట్టు
చొక్కపుటల్లిక సుందరచిత్రవ
స్త్రావృతంబైనట్టి హంసతూలి
యనసొప్పుపాన్పునఁ దనరారనించిన
రాజిల్లు చెంగల్వరాజివిరులు
గనుపట్టి పైనొప్పు నునుచల్వవలిపెంబు
పచ్చాకునించిన పరిమళించు
తలగడయు జాళువాజలతారుతెరయు
మించి రమణీయమైనట్టి మంచముపయి
రాజచంద్రుఁడు పవళింప రాజవదన
లంగనామణిఁ బతికడ కనుపఁదలఁచి॥ 347

వ॥ కలువలచెలిమికానిం గలకలనగు ముద్దుమొగంబున మొల
కనవ్వుమెఱుంగువెట్టఁ గంగఁగదిసి యిట్లనిరి, 348

తే॥ "కన్నె! యిన్నాళ్లు పతిసమాగమము మదిని
గాంక్షితము సేతు, విదె నీకుఁ గలిగె నింక
రాత్రిఁబగలును సురతతంత్రములఁ జొక్కి
మగఁడు నీవును సుఖలీల నెగడరమ్మ॥ 349

సీ॥ కమలాయతాక్షి నీ కాఠిన్యవక్షోజ
పర్వతంబు లురంబు పైఘటించి
తీయనికెమ్మోవి తేటతేనియ లెల్ల
గురుతరవిస్ఫూర్తిఁ గొల్లలాడి

అతులితనవనఖరాయతాంకములను
బంధురక్షతములపాలుచేసి
బాహులతాపాశంబుల బంధించి సద్గాఢ
బహుళకర్దముమునఁ బరఁగఁద్రోచి
"ఎంతచేసిన వారికి నంతకాదె"
యనెడువాక్యంబు ధర నిజమ్మైయొనంగఁ
బెలుచ వలపించి వెతలనుబెట్టినట్టి
ప్రాణనాయకుఁ దగ భంగపఱుపవమ్మ॥ 350

తే॥ సర్వపర్వంనహానాధసంచయముల
ఖండనక్షోణులను గ్రిందుపఱచునట్టి
జీవితేశుని బైకొని చిత్తమలర
బాల!పుంభావరతిఁ గ్రిందుపఱుపవమ్మ॥ 351

వ॥ అని మేలంపుమాటల లోలాక్షికిఁ గొంతప్రొద్దు ప్రియంబు గఱపి మఱియునిట్లనిరి॥ 352

సీ॥ "చంద్రాస్య!యిప్పుడె చక్కెరఁ(బెట్టి రా)
చిలుకకుఁ బద్యము ల్సెప్పవలెనె
విమలాంగి!యిప్పుడె వీణియధరియించి
సరసరాగంబు లేర్పఱుపవలెనె
ఎలనాగ!యిప్పుడే కలికిరాయంచకు
నేర్పుమీఱఁగ నడల్నేర్పవలెనె
మానిని ! యిపుడే మధుకోకిలలొనఁగూర్చి
చిత్రకవిత్వంబు చెప్పవలెనె
జీవితేశుండు పడకిల్లుఁజేరవచ్చి
మృదులపర్యంకమందున నెదురుసూడ
జాగుచేసెదవమ్మ లేజవ్వనంపు
సుందరులఁగంటె మిటులెందుఁ జూడమమ్మ"॥ 353

వ॥ అనిపలికి 354

తే॥ త్రోవు త్రోవ పాడుచును జెలు ల్గొడి తేఁగ
కన్యకామణి మందాక్షకలితలీల
మెల్లమెల్లన నడుచుచు మిగులనప్పు
డలసగామినియనుట దృశ్యంబు చేసి॥ 355

క॥ లలిత మణిపంజరమునకుఁ
జెలువమరఁగఁ జొచ్చు చిలుక చేడియ లీలన్
తలవంచి సిగ్గుతోఁ ద్రోల
జలజాయతనేత్రి కేళిసదనముఁ జొచ్చెన్॥ 356

వ॥ అపుడు

తే॥ సురటి తెచ్చెదనని యొకతుక జనఁగె, గిండి
మఱచివచ్చితినని యొకతుక జరిగె, నించు
టద్దమిదె తెత్తుననుచునొకర్త రిగె, చెలియ
లందఱిటు లేని నెపముల నరుగుటయును॥ 358

ఉ॥ చక్కెరబొమ్మ గాంచి ఘనసంభ్రమమోహము లుప్పతిల్లఁగాఁ
జక్కెరవింటివాసి నగు చక్కనిరాకొమరుండు సిద్దపుఁ
జెక్కుల తేఁటనవ్వొలయఁ జీర చెఱంగొగిఁ బట్టి పాన్పుపై
కక్కఱిమీఱ రాదిగిచి హారిసుధామృదుభాష నిట్లనెన్॥ 359

మ॥ "సరసీజాస్త్రమహాస్త్రఘాటి కెలమిన్ శంకించి నే నీదు బం
ధురకారిస్యపయోధరాచలమహాదుర్గంబు లాపన్నతన్
శరణంబొందఁగఁ గోరినాఁడఁ గనుకన్ సంప్రీతి మన్నించి నీ
కరుణాపాంగములం గనుంగొని వెసం గావంగదే కోమలీ!॥ 360

సీ॥ కలకంఠపంచమకలకూజితస్ఫూర్తిన్
నలరు నీ కలికిపల్కు లువినంగ
శర్కరాప్రతిమాన చారుమాధురిగల్గు
నీదు కెమ్మోవి తేనియలుగ్రోల
కల్యాణభూమిభృద్గౌరవోన్నతిఁ (దద్ద)
నొప్పు నీ వక్షోజయుగము నిముర

విద్యుల్లతాస్నిగ్ధ విమలప్రభారూఢి
గలిగిన నీమేనుగౌఁగిలింప
శ్రవణరసనాశయాంగము ల్జలదవేణి!
తమకమొందుచునున్నవి,తత్తదుదిత
భాసురోదారసౌఖ్యసంపత్సమృద్ధి
సంఘటన వానికొనరింపఁజనదె నీకు॥ 361

తే॥ వరుస రతివేళ నీకచవదనగళము
లనెడివరనీలపద్మశంఖాప్తినాకు
నలరఁగల్గించి రాజరాజనెడిమాట
నిజముకావింపరాదె పంకజదళాక్షి! 362

ఆ॥ అస్తినాస్తిసంశయాపాదియై చిదం
బరరహస్యలీలఁబరఁగు నీకు
కలికి కౌనుఁజూచు కాంతు వేఁడెడినాకు
నీవియనఁగ వేలనీవు తరుణి!" 363

వ॥ అనిసవియనురాగంబులుదోఁపఁ బలికి 364

సీ॥ తాంబూలరాగాధరంబుపై రదనాళి
రాయొత్తఁబోయిన మొగంబోసరఁజేయు
హేళి లతావేష్టితాశ్లేష మొనరించు
గరిమఁబూనఁగఁ బెడమరులఁబొరలు
ఉదుటుసిబ్బెపుగుబ్బ లొడిసిపట్టఁగఁబోవ
నొకుపుదప్పించు నేర్పొప్పమీఱు
నీవిమాత్రమొసంగు నేనన్యమేమొల్ల
నని కేలుచాపఁ దద్వ్యాప్తిమాన్పు
చంద్రవంశాబ్ధిసంపూర్ణచంద్రుతోడఁ
బ్రథమసురతసమారంభభవ్యకాల
జనితలజ్జాతిశయమునఁ బెనఁగెఁజాలఁ
గన్యకామణి యభిముఖిగాక యిటుల 365

వ॥ అప్పుడు॥ 366

కం॥ తరళగతిగాంచుటను బతి
కరమునకుంజిక్కె బాలకరినకుచ మహా
తరళగతిగన్న వారలు
స్థిర నేరికిఁ గరిమలైనఁ జిక్కరె తలఁపన్॥ 367

తే॥ కరినవక్షోజదుర్గము లక్షణములోనఁ
జేకొనినభూమిపతినింకఁ జెందె(ఁజూవె)
సతతమృదులోరువిస్ఫురదతిమనోహ
రాంగవప్రాక్రమణవాంఛ యద్భుతముగ॥ 368

అయ్యెడ॥ 369

కం॥ నరపతివాల్చూపు పయో
ధరములనుండి చాలి జఘనతలమున వ్రాలెన్
ధరణీధరాగ్రంబులనుం
డిరవొందఁగ ధాత్రిఁ వ్రాలు నింపమరంగన్॥ 370

తే॥ ప్రాణనాథుండు తమకంబుపట్టలేక
నీవిబంధంబువిడిచి మానితనితంబ
తలపటం బొయ్య దిగిచి కొనెలమిఁ బొదలి
యులరె మిన్నందియున్నట్టు లాత్మలోన॥ 371

మ॥ కురువక్షోజమహాచలేంద్రవిలసత్కూటంబులన్ సత్తప
శ్చరణల్పూని గభీరనాభిసరసిన్ స్నానక్రియల్ సల్పివి
స్ఫురదంచత్కటిభూప్రదక్షిణము నేర్పుల్మీఱఁగావించి శం
బరద్విడ్బ్రహ్మసుఖాప్తిగాంచె ధరణీపాలావతంసం బొగిన్॥ 372

సీ॥ రాజసింహుల నఖాంకురములు సోఁకకయున్న
కోమలీ (పృథు) కుచకుంభములను
రాజమత్తేభ సంరంభమెచ్చకయున్న
నాళీకముఖి నిమ్న నాభిసరసి

రాజమార్తాండ కరస్ఫూర్తిఁ జెడకున్నె
బాలకచోత్పలపత్రగరిమ
రాజేంద్రుచేతఁ బారణసేయఁబడకున్నె
యంగన మధురాధరామృతంబు
రాజసార్వభౌము రభసమొందకయున్నె
కాంతజఘనతలమహాంతరీప
మును నృపాంగసంగఘనపారవశ్యాప్తి
యువిద కెఱుకపడక యుండెఁగాక॥ 373

చ॥ ఖరనఖపంక్తి నిబ్బరపుగబ్బిచనుంగవ గ్రుచ్చిగ్రుచ్చి సుం
దరరదనాంకురంబుల సుధామధురాధరమెల్ల గంట్లుగాఁ
గఱచి భుజాయుగంబునను గాంచనగాత్రము గట్టివైచి బా
పురే! నృపుఁ డాఁగెఁ దత్కృతవిమోహమహార్తినిబద్ధబన్నముల్॥

సీ॥ స్తనితవైభవరీతిఁ దనరారె రత్నకం
కణసాంద్రతరఝణంఝణరవంబు
ఘనఘనాసీలతఁ గనుపట్టె వరసీల
చంచచ్ఛిరోగుహా సంచయంబు
శక్రశరాసనోజ్వలతనొప్పె లతాంగి
సీమంతరేఖావిశేషలక్ష్మి
విద్యుల్లతాస్ఫూర్తి వెలసె నన్యోన్యంబు
సంప్రాప్తచారువీక్షణగణంబు
భూరితరవర్షధారావిభూతిఁ దనరె
భాసురాంగజఘర్మకబంధరాజి
అహహా! యత్యద్భుతావహంబగుచునప్పు
నీరదాగమమైతోఁచె నిధువనంబు॥ 375

క॥ ఇత్తెఱఁగున నృపచంద్రుఁడు। మత్తద్విపయానఁ గూడి మన్మథసౌఖ్యా
యత్తవికస్వరభాస్వర। చిత్తాబ్జుండగుచుమిగులఁ జెలఁగుచునుండెన్

కం॥ వలరాజువంటిచక్కని
చెలువుఁడు దినదినము బోధసేయఁగనంతన్
జలజాతపత్త్రనేత్త్రికి
విలసద్వ్రీడాభరంబు విడంబాఱెన్॥ 377

సీ॥ మగఁడెంచి మొగమున మొగముఁ జేర్చిన ముద్దు
మొగము మోమునఁ జేర్చు నిగురుబోణి
ప్రాణనాథుఁడు గాఢపరిరంభణము సేయఁ
బరిరంభణము సేయఁ బద్మనేత్రి
మోహనాంగుండు కెమ్మోవి తేనియలాన
మోవి తేనియలాను ముద్దుగుమ్మ
చెలువుండు నిద్దంపుఁ జెక్కిలి ముద్దాడఁ
జెక్కిలిముద్దాడు సితకరాస్య
గీ॥ అతులితాద్భుతచతురత నహరహంబు
భర్త తన్నెడఁబాయ కభ్యాసపఱుప
నంగనామణి యభిముఖియై తనర్చె
బహుళలజ్జానుబంధంబు పాయుకతన॥ 378

తే॥ కౌఁగిటఁ గదిసి కదియనికలికి కులుకు
గుబ్బ (దోయిటఁ బతి) రొమ్ము గ్రుమ్మసాగె
తనర రతికోడి విముఖత దాల్చుతరుణి
యుపరిసురతంబు తనుదానె యొందసాగె॥ 379

సీ॥ తారహారచ్ఛట ల్తాండవంబొనరింపఁ
గరకంకణధ్వను లుల్లుమనఁగఁ
బలుచగా నలఁదిన కలపంబు చిటులంగ
గురుకుచకుంభంబు లొరసికొనఁగఁ
కౌఁదీఁగె జవ్వాడ ఘర్మాంబుకణములఁ
గమ్మకస్తూరితిలకంబు కరఁగ

సిగనిడుత్రొవ్వి రుల్చిందువందగరాల
వరరత్న మేఖల వరలకాటఁ
గీ॥ బూనఁగఁ బైపైని గళరవమ్ము చెలఁగంగఁ
జూపు లనురాగరసము విస్ఫూర్తి జిలుక
బాలికామణి యానందపారవశ్య
కలన విభుఁ డొంద నుపరతిసలిపె నపుడు॥ 380

శా॥ నానాశ్లేష సమృద్ధిఁజెంది రసపూర్ణస్ఫూర్తి గన్పట్టఁ బెం
పూనంబాత్రను వృత్తగౌరవముచే నొప్పొ సుసంగూఢభా
వానూనస్థితిమీఱి సత్కవికృతోద్యత్కావ్యలీలన్ వధూ
పీనోరోజయుగంబు హత్తె నటు లాపృథ్వీశుఁ బైకొన్న చోన్॥ 381

క॥ నీలాలక కొనుఁ బైరతి
బాలామణి క్రీడ సలుపుచుఁ బ్రాణేశ్వరు, స
ల్లీలాగతులఁ బరస్పర
హేలాకృతి వితతరతము లెనకమెసంగన్॥ 382

సీ॥ బంధురగంధి సౌగంధికాకలితంబు
సుందరకుచ చక్రశోభితంబు
కమనీయమృదుహస్త కమలమనోజ్ఞంబు
నీలకుంతలభృంగ లాలితంబు
వరరోమరాజి శైవాలవిస్ఫురితంబు
వీక్షణరాజీవ విలసితంబు
మహితప్రపాద కూర్మవిలాసరుచిరంబు
రమ్యవళీభంగ రాజితంబు
గీ॥ నైన హేమావతీలలామాభిరామ
మంజులావణ్యకాసారమధ్యసీమ
నవనిపాలకసుందరరాజహంసమప్పు
డోలలాడుచునుండె మహోత్సవమున॥ 383

వ॥ మఱియు శ్రీమన్నారాయణ ప్రసాదాసాదిత పారిజాతప్రభావప్రభూత సకలర్తు సౌభాగ్యలక్షణలక్షితంబులగు శృంగారోద్యాన వాటీకాంతారంబులను విమలకమలకల్హారమాలికాసల హంసికాహంసావతంస సంసదభిరామంబులగు కాసారతీరంబులను రోహిణీకాంతాకాంత కాంతోపల పుష్యరాగాబ్జరాగసుందరంబులగు కృతకవసుంధరాధర కందరమ్ములను నతిస్వాదుతరగుళుచ్ఛ ఫలరసధారాప్రవాహంబులగు ద్రాక్షాకాయమానాభ్యంతరంబులను జల్లనగు మల్లెతీవపొదరిండ్లను గొప్పలై యొప్పుమిగిలిన కురువేరు(చప్పరంబు లను) జాంబూనదాంబరాభరణమాల్యానులేపనసమృద్ధిం జెంది గంగాకురంగనయనంగూడి శంతనుండు వివిధవిలాసక్రీడలం గ్రీడింపుచు 384

తే॥ కమలనాభుండొసంగిన కామధేను
వాత్మగృహమునను నిల్పి యిష్టార్థ మొసఁగ
(కామినీమణియైన యాగంగతోడ
సహితుఁడై) యశ్వమేధము లహినొసర్చె॥ 385

సీ॥ నెలమూఁడువర్షము ల్పొలుపొందవర్షించె
దుర్భిక్షచయములు దొలఁగిపోయె
సకలసస్యసమృద్ధి క్ష్మాచక్రమొప్పారె
ధర్మంబు నాలుగ్గుపాదములనడచె
సర్వకాలముల రాజద్గతిఫలియించి
విలసిల్లెనంతయు వృక్షతతులు
(తొలఁగె నుపద్రవంబులు రాష్ట్రమెల్లను)
చోరులకాంక్షలు దూరమయ్యె
విప్రజనకృతహోమము ల్వృద్ధిఁజెందె
సాధుజనముల కత్యంతసౌఖ్యమొదవె
చంద్రవంశాబ్ధిసంపూర్ణచంద్రుఁడైన
శంతనుండేలునట్టి రాజ్యంబునందు॥ 386

కం॥ అనిన న్వైశంపాయనముని౯గని జనమేజయుండు మ్రొక్కుచుంబలికెన్
"వినఁగ లేనిదుకరుణను। ఘన మోక్షదమైన పుణ్యకథను చరిత్రా"॥ 387

కం॥ శ్రీతరుణీహృదయేశ్వర! పాతకహార! సర్వలోకపావన! వేదా
తీత! భవబంధమోచన! పీతాంబర! భీష్మబలివిభీషణవరదా!
కూఁతును జెనిచి। కుమారికి నాతతగతి ధారవోయకను వైనవరున్
బ్రీతిం బరికించి యొసఁగిన। భాతి నిమత్కావ్యకన్య భక్తినియుక్తిన్
భూతలనేతలకొసఁగక। ధాతలధాతవు ఫలప్రదాతవు సుజన
త్రాతవు బ్రహ్మాండోత్కర। నేతవు నీవ (నుచు నిడితి) నిర్మలలీలన్ 388

సీ॥ సకలదేవాధ్యక్ష! పన్నగేశ్వరపక్ష!
వైజయంతీవక్ష! వారిజాక్ష!
(శతపత్రసమనేత్ర!) శాంకరీనుతిపాత్ర!
కపటనాటకసూత్ర! కలుషజైత్ర!
ఘనఘనాఘననీల! కాంచనోజ్వలచేల!
కమలానుకూల! మంజుకరవిశాల!
మర్దితాసురవీర! మదనకోట్యాకార!
యాశ్రితమందార! హతవికార!
గీ॥ భవ్యసుగుణాలవాల! కృపావిశాల!
హారితవరగోత్ర! (పాలితపాండుపుత్ర!)
శంఖచక్రాబ్జహస్త! శశ్వత్ప్రశస్త!
కలశపాథోధిరాడ్ధామ! కదనభీమ!॥ 389

గద్య॥ ఇది శ్రీమద్వేంకటేశ్వరకరుణాకటాక్షసంప్రాప్త కవిత్వవిద్యా
విచిత్రాపస్తంబసూత్ర హారితసగోత్రపవిత్ర వెంకటనరసయా
మాత్యపుత్రాన్నమరాజాన్వయపయఃపారావారసంపూర్ణ
సుధాకర సకలగుణరత్నరత్నాకర విద్వజ్జనవిధేయ
రమణయనామధేయప్రణీతంబైన శంతనురాజ చరి
తంబను మహాప్రబంధంబునందు సర్వమును
జతుర్థాశ్వాసముసంపూర్ణము.

తప్పొప్పుల పట్టి.

పుట	పంక్తి	తప్పు	ఒప్పు	పుట	పంక్తి	తప్పు	ఒప్పు
1	7	బామోద	బైమోద	40	5	నభ్రవు	నబ్రవు
2	13	చంద్రకా	చంద్రికా		16	కాంతుడో	కాంతుండో
6	2	శాంతన	శంతను			రతికాంతుండో	రతికాంతుడో
	18	శంతన	శంతను	44	17	వ్యాపునిం	వ్యాప్తునిం
9	11	మహోన్నతి	మహోన్నత		19	గత్రభ్రాంత	గతాపత్ర
14	12	కుశ	కుచ	45	18	క్రృత	క్రృతు
15	7	స్వాంతమున	స్వాంతముల	53	17	శస్తులు	కుస్తులు
16	1	తుపాపత్త్రి	తుపారాత్త్రి		24	నియు	ముని
	17	భరంత్రి	భర్త్ర	54	18	విమతాగము	విమతాంగము
	25	చిత్రత	చిత్రము	59	17	దీనత	ధీరత
	26	బోటులు	చోటులు		22	నుతి	న్నుతి
17	5	వృత్తి	వృత్త	60	8	మండు	రండు
	10	బరంగువాణి	బరుగువారి	62	2	బాగమతి	బాగమర
	11	వృత్తి	వృత్త	63	7	ఛటచ్ఛటా	చ్ఛటచ్ఛటా
	20	మార్గంబులొప్ప	మార్గంబులొప్పు		8	కీలాప	కలాప
	26	ప్రమదానగతులు	ప్రమదానుగతులు	68	19	పటపుకా	పట్టపురా
18	8	భాసురులు	భాసురుల	69	7	బేది	భేది
		భూసురులు	భూసురుల	71	12	లవాంమరా	లలాంమరా
21	5	కృతాంగ	కృతాగ		14	భేకాలి	భేకాతి
24	16	ధర్మ్యండు	ధర్మ్యుడ	72	4	మూలోడ్యాణ	మూలోడ్యాణ
	17	ద్యుచ్ఛుకు	త్యుచ్ఛిత	73	11	మైలని	మైత్రిని
	28	నత	నవ	77	7	ప్రబ	ప్రభ
25	2	సిత	శిత	80	19	చందాతప	చంద్రాతప
27	14	లిలా	లీలా	86	5	చేసికమింతు	చేశమ్మింతు
32	5	లిందపంచ	లిందువంశ	87	6	చక్రములో	చక్రముల్
	6	త్కులశ	న్కులశ	88	12	బెండుల	బెండులు
	14	రహించె	వహించె		14	కలలోను	కలలోనను
35	7	ఘున	ఘన	89	22	యింద్రుడు	యింద్రుడ
36	11	సురతంత్ర	సురతతంత్ర	95	4	కన్నియ	మన్నియ
	16	సీతా	శితా	97	18	ఇట్లు	ఇట్టి
37	16	స్ఫురతాంబూల	స్ఫురత్తాంబూల	101	15	చిత్రతర	చిత్రకర
	20	నిష్ఠురాంకార	నిష్ఠురాంగార	104	5	రేక	రేఖ
	26	తగ	దగ	118	6	వెల	వెలి

118	8	రాజ్యదజనీ	రాజ్యదజనీ
121	19	వల్లి	వల్లీ
128	20	బంధురగతులు	బంధురగంధగతులు
130	4	మధువిద్గంభీర	మధులిద్గంభీర
184	15	మేసరి	వేసరి
188	14	చింతా	చింతా
140	16	చున్నది	మన్నతి
144	6	బేరము	బేరము
145	17	మాస్తాంగత్వ	మాసాంగత్వ
147	14	నాళీకారము	నాళీకాకరము
160	5	భాగాభ్యోగ	భాగాభోగ
	6	కొత్తుప్పల్ల	కొత్తుప్పల్ల
	11	ఫీంకార	ఫీంకార
	22	వాసిన	నాసిన
168	1	ద్వీపంబు	ద్వీపంబు
189	8	భైరవా	భైరవా
197	11	తెనియ	తేనియ
199	14	బూని	బూన
212	21	హాయిూ	హారినో
214	22	మురుని	కరము సాశకు
228	6	నిస్సాళ్లకి	నిస్సాళ్లకుక్
229	8	సమాలంక	సమాలంక్ృ
	10	చ్చక	చ్చక్రి
	26	దేశంబుల	దేశంబులు
230	5	పచ్చనిజ	పచ్చనా
	6	తేజిపై	తేజిపై
281	18	దంభోళి	దంభోళి
	17	ఖ్యాతిచె	ఖ్యాతి చే
	20	గాధేయు	గాధేయు
282	11	ట్కృశిరి	ట్కృశిరి
		వదయూర్మి	దయూర్మి
	12	హాతు	హాతు
	13	కీలాల	కీలాల
		తీవే	తీవేకజా
	26	బల్లండిమై	బల్లండిమైం
283	14	కోక	కోక
	15	హాన్కలీ	హాఖలీ
	16	వర్మస	మర్మప
		ఖండర్ఘురి	ఖండర్ఘురి
	21	లోళిల్ల	లోళిల్ల
284	16	నముః	నముః
	17	మాలా	మాలా
	23	దోష్ట్యంత	ఓష్ఠ్యంత
	24	బావ	బాప
285	9	బాభవ	భాభవ
243	21	లిను	లీను
244	17	వినాటి	నినాటి
	1	చారు	జాలు
245	18	సింధూర	సిందూర
249	7	ఇందిందిర	జిందిందిర
250	22	శాల	చాల
252	5	సుధాంభోధి	సుధాంధోధి
254	19	తైర	తెర
255	20	ధారా	ధారా
258	15	పుష్పవిట్సం	పుష్పలిట్సం
		కులంబు	కులంబు
259	23	సాతరంబున	సాతరంబున
260	7	బుద్ధులు	బుద్ధులు

పీఠిక

క॥ కప్పురము గుప్పుగుప్పున
గుప్పినక్రియ సంకుమదము కుంకుమ నొకచోఁ
గుప్పలుపోసినక్రియ సభ
మెప్పఁగ ఘుమ్మనుచుఁ గవిత మెఱయఁగవలదా॥

అను నీపద్యమును సార్థకపఱచుచు నీప్రబంధము శృంగారరస బంధురంబునను నత్యంతహృదయంగమంబును నై యలరారుచున్నయది. శబ్దాలంకారములు సర్వవైచిత్ర్యములును నానావిధశయ్యలును గలిగి నాతికఠినమును నాతిమృదులమును గాక గంభీరతావిశిష్టమగు నీ ప్రబంధము పండితపామరుల కందఱకును బరమాహ్లాదజనకమనుటకించు కంతయు సంశయము లేదు. గ్రంథకర్త యనన్యసామాన్యమగు సంస్కృతాంధ్రసాహిత్యమును నలంకారపాండిత్యమ్మునుఁ గలిగి పద్యములలోఁ బలుపోకడలు గనఁబఱచుటయ కాక వచనములఁ గూడ శబ్దాలంకారములతోను సర్వవైచిత్ర్యములతోను నతిగంభీరముగ నడపించియున్నవాఁడు. విజయవిలాసాముక్తమాల్యదాద్యుద్గ్రంథములలో వలెఁ గ్వాచిత్కముగఁ ద్వ్యక్షకసంధులు ద్రుతాంతక్రియాసంధులు నున్నగునవి వాడఁబడినను మొత్తముమీఁద నీగ్రంథ మతిప్రౌఢము ప్రాక్తనప్రబంధములతోఁ దులదూఁగియుండెననుటకు సందియము లేదు. కవినివాసగ్రామము కర్నూలుమండలమందలి మార్కాపురము తాలూకాలోఁ జేరిననరసాయపాలెము. అది శ్రీశైలమార్గస్థమగు దిగువ (చింతగుండ) పాలెమునకు సామీప్యమందున్నయది. ఈకవికిఁ బురుషసంతతి లేనందునఁ దత్పరంపరవర్తమానమునఁ గన్పట్టదు. ప్రసంగానము గల్గి తద్వంశక్రమము ప్రకృత మార్కాపురము తాలూకాలోనిదేయగు నారెవీడుగ్రామమందుండినట్లు తెలియనయ్యెడిని, ఈకవి జ్యేష్ఠభ్రాతయచ్చన్న. ఆయనకు శేషాచలము గరుడయ్య యని యిరువురుకొమరులు. శేషాచలమునకుఁ బెదపిచ్చయ్య చినపిచ్చయ్యయను కుమారులును వెంకట

రామమ్మయను కొమార్తెయును గలిగిరి. ఆ పెదపిచ్చయ్యకొడుకు కచ్చన్నయును జినపిచ్చయ్యకొడుకులు శేషాచలము వెంకటసుబ్బయ్యలును ప్రస్తుతమునరసాయపాలెమున వసించుచున్నవారు. శేషాచలము కొమరితయగు వెంకటరామమ్మను బల్నాడుతాలూకాలోని పెదకొదమగుండ్లయందుండెడి చింతపల్లి సాంబయ్యగారి కొసంగిరి. వారి కుమారుఁడగు పర్వతాలుగారు నరసాయపాలెమందుండి తన మేనమామల యొద్ద నీగ్రంథము వ్రాసికొనివచ్చి స్వయముగనే ప్రకటించుతలంపునఁ జాలఁ బ్రయత్నించియు దైవసాహాయ్యము లేమిని గృతార్థులు కాక తుదకు మాపత్రిక కొసంగుటయు నేఁటి కీగ్రంథము బ్రకటించి గ్రంథకర్త యసామాన్యపాండిత్యమును లోకమున వెల్లడింపఁగలిగితిమి. గ్రంథకర్త యన్నమనుమరాలి కుమారుఁడైన యీచింతపల్లి పర్వతాలుగారి ప్రాయ మిప్పు డేఁబదివత్సరములకు మించియున్నందునఁ దరమున కేఁబదివత్సరములవంతున లెక్కించుకొన్నను నీకవి యిప్పటికి 150సంవత్సరముల మీఁదటివాఁడుగాఁ గాన్పించుచున్నవాఁడు. అప్పటి గ్రంథమై తాళపత్రములపైని బూర్వసంస్కారులుగాని యొకరియొద్ద నుండి యొకరిచేఁ గ్రమముగా వ్రాసికొనఁబడుచు వచ్చినదగుటచే వ్రాఁతతప్పులు వేనవేలుండి సంస్కరణమునకుఁ జాల శ్రమపడవలసి వచ్చినది. పంక్తులకుఁ బంక్తులే వదలిపెట్టఁబడిన స్థలములుకూడఁ గొన్ని యుండ నాయాభాగముల నాకుఁదోఁచినరీతిఁ బూరించితి. అట్టిపట్టులఁ జదువరుల కాభేదము దెలుపునిమిత్తము బ్రాకెట్లు పెట్టఁబడియున్నవి. ఇందలి ముద్రాపకప్రమాదములు శుద్ధాశుద్ధపట్టికలోఁ జాలవఱకు చేర్పఁబడియున్నను మఱికొన్ని యుండకపోలేదు. అట్టి యత్కించిన్మాత్రదోషంబు లెవ్వరికో తెలియకున్నను నిరాఘాటమైన యక్షరజ్ఞానముకలవారి కెంతమాత్రము నవేద్యములుకావు కావున రసికజనులెల్లరు నేతద్గ్రంథపఠనమున నానందసంభరితు లగుదురుగాక.

జానపాటి పట్టాభిరామశాస్త్రి,
ఎడిటరు, అభినవసరస్వతి.